



# విశ్వంవాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY








SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 | సంచిక : 14 | అమలాపురం | ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ | శనివారం 4 అక్టోబర్ 2025 | పేజీలు : 12 | వెల : 2/-


# ఎమ్మెల్యేలను కట్టడి చేయాల్సిన బాధ్యత మంత్రులదే



- కట్టు తప్పుతున్న ఎమ్మెల్యేలతో మాట్లాడండి.. తప్పొప్పులు వారికి తెలియజేయండి
- అయినా వినకుంటే నాకు చెప్పండి.. అసెంబ్లీలో కొందరి తీరు బాలేదు
- సభలో ఏం మాట్లాడాలో ఎమ్మెల్యేలకు చెప్పాల్సిన బాధ్యత మీదే
- ఇన్‌చార్జి మంత్రులకు సీఎం స్పష్టీకరణ.. శాఖాపరంగా విమర్శలకు తావివ్వొద్దు
- విమర్శలొస్తే వెంటనే స్పందించండి.. మంత్రులకు చంద్రబాబు నిర్దేశం

**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

అసెంబ్లీ సమావేశాల్లో కొందరు ఎమ్మెల్యేల తీరు ఏమీ బాగోలేదని, వారిని అసెంబ్లీ లోపలా బయటా కట్టడి చేయాల్సిన బాధ్యత ఇన్‌చార్జి మంత్రులదేనని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. రాష్ట్ర మంత్రిమండలి సమావేశం శుక్రవారం సచివాలయంలో జరిగింది. క్యాబినెట్ సమావేశం అనంతరం పలు అంశాలపై మంత్రులతో సీఎం మాట్లాడారు. ఇటీవల అసెంబ్లీ సమావేశాల్లో కొందరు ఎమ్మెల్యేలు వ్యవహరించిన తీరుపై ఇన్‌చార్జి మంత్రులకు సీఎం దిశానిర్దేశం చేశారు. "ఇన్‌చార్జి మంత్రులు తమ పరిధిలోని ఎమ్మెల్యేలను నియంత్రించాలి. వారు చేస్తున్న తప్పొప్పులను వారికి తెలియజేసి సరిచేసుకోవాలని కోరాలి. అప్పటికీ వినకుంటే నా దృష్టిలో పెట్టాలి. ఇదంతా ఇన్‌చార్జి మంత్రులే బాధ్యతగా చేయాలి" అని సీఎం వ్యాఖ్యానించారు. అసెంబ్లీ సమావేశాల్లో కొందరు ఎమ్మెల్యేలు ఉద్దేశపూర్వకంగానో, మరే కారణంతోనో పార్టీ నిర్దేశించిన గీత దాటారని, ఇది మున్ముందు పునరావృతం కాకుండా చూసుకోవాలని ఇన్‌చార్జి మంత్రులను కోరారు. అసెంబ్లీ జరిగే సమయంలో ఎమ్మెల్యేలకు ఏం మాట్లాడాలో.. ఏం మాట్లాడకూడదో చెప్పాలని సీఎం సూచించారు. ఇన్‌చార్జి మంత్రులు తమ పరిధిలో ఉన్న ఎమ్మెల్యేలతో తరచూ మాట్లాడుతూ, రాజకీయంగా సమన్వయం చేసుకుంటూ వారికి సరైన మార్గని ర్దేశం చేయాలని సూచించారు. శాఖాపరంగా ఎలాంటి విమర్శలకూ అవకాశం ఇవ్వకుండా మంత్రులు పనిచేయాలని, ఒకవేళ ఏదైనా విమర్శ వచ్చినా వెంటనే స్పందించాలని కోరారు. ఈ విషయంలో ఎలాంటి అలసత్వం చూపినా అందరం నష్టపోతామని చంద్రబాబు అన్నారు. చరిత్రలో తొలిసారి రాష్ట్రవ్యాప్తంగా - మిగతా2లో

## అమరావతి కోసం ఎస్పీవీ

**రాజధానిలో భూసేకరణ నోటిఫికేషన్ నుంచి 343.36 ఎకరాల భూమి మినహాయింపు**

**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

రాజధాని అమరావతిలో పనుల వేగవంతంకోసం, ప్రత్యేక ప్రాజెక్టుల అమలుకోసం స్పెషల్ పర్పస్ వెహికల్‌ను (ఎస్పీవీ) ఏర్పాటుచేస్తూ రాష్ట్ర మంత్రిమండలి కీలక నిర్ణయం తీసుకుంది. కంపెనీ చట్టం కింద దీనిని ఏర్పాటుచేస్తారు. అలాగే, గతంలో భూసేకరణ నోటిఫికేషన్ నుంచి 343.36ఎకరాల భూమిని - మిగతా2లో



## ప్రపంచపటం నుంచి తుడిచేస్తాం

- పాకిస్థాన్‌కు ఆర్మీ చీఫ్ హెచ్చరిక
- ఆపరేషన్ సిందూర్ రెండో దశ ఎంతో దూరంలో లేదు
- అది 1.0లా ఉండదు
- భౌగోళిక పటంలో తన దేశం ఉండాలా వద్దా అనేది పాక్ నిర్ణయించుకోవాల్సి వస్తుంది.
- ఆపరేషన్ సిందూర్ 2.0 కోసం సిద్ధంగా ఉండాలి

5




5

## ఏ క్షణంలోనైనా షెడ్యూల్

- బిహార్ పర్యటనకు ఎన్నికల అధికారులు..
- ఎన్నికల అధికారుల పర్యటన పూర్తయ్యాక ఏ క్షణంలోనైనా బిహార్ అసెంబ్లీ ఎన్నికలకు షెడ్యూల్ వెలువడే అవకాశం
- 243 స్థానాలు కలిగిన బిహార్ అసెంబ్లీకి గడువు 2025 నవంబర్ 22తో ముగియనుంది
- ఆ గడువులోగా కొత్త ప్రభుత్వం కొలువుదీరాల్సి ఉంటుంది.




5

## రెండేళ్ల జీతమిచ్చి.. ఉద్యోగుల తొలగింపు

**దేశంలోనే అతి పెద్ద ఐటీ దిగ్గజం టీసీఎసలో లే ఆఫ్‌లు**

**ఉద్యోగులు సంస్థలో పనిచేసిన కాలాన్ని బట్టి తొలగింపు ప్యాకేజీగా ఆర్నెల్ల నుంచి రెండేళ్ల వేతనం**

## నాడు అంధకారం.. నేడు ఉత్సవం.. ఉత్సాహం

- 15 నెలల కిందట రాష్ట్ర ప్రజలకు స్వేచ్ఛ వచ్చింది
- అభివృద్ధి, సంక్షేమం, ఉల్లాసం మేళవించిన పాలన అందిస్తాం
- ఇంట్లో ఎంతమంది చదువుకునే పిల్లలుంటే అందరికీ తల్లికి వందనం అందిస్తున్నాం.
- విజయవాడ ఉత్సవ్ వేడుకల్లో సీఎం చంద్రబాబు



**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

'గత ప్రభుత్వ పాలనలో ప్రజలు బయటికి రావడానికే భయపడే పరిస్థితి. ఎక్కడ చూసినా విధ్వంసం, దాడులు, కేసులు. ఇప్పుడు నాటి అంధకారం తొలగింది. ప్రజల ఉల్లాసం చూస్తుంటే ఆనందంగా ఉంది. ఎన్నికల్లో మీరిచ్చిన తీర్పుతో ప్రజలందరికీ స్వేచ్ఛ వచ్చినట్లయింది' అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఈ ఆనందాన్ని ఇలాగే కొనసాగిస్తూ అభివృద్ధి, సంక్షేమం, మానసిక ఉల్లాసం మేళవించిన పాలన అందిస్తామని హామీ ఇచ్చారు. విజయవాడ ఉత్సవ్ ముగింపు వేడుకల సందర్భంగా గురువారం గొల్లపూడి ఎక్స్‌పో మైదానంలో ఏర్పాటు చేసిన సభలో ఆయన ప్రసంగించారు. 'మహిళలకు స్త్రీశక్తి పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణం వల్ల విజయవాడ దుర్గమ్మ నవరాత్రులకు ఎప్పుడూ రాని స్థాయిలో మహిళలు వచ్చారు. ఇంట్లో ఎంతమంది చదువుకునే పిల్లలుంటే - మిగతా2లో

# ఉత్తరాంధ్ర అతలాకుతలం

- తీవ్ర వాయుగుండం ప్రభావంతో ఎడతెగని వర్షాలు
- చివురుటాకులా వణికిన శ్రీకాకుళం, విజయనగరం
- ఈ రెండు జిల్లాల్లో ఈదురుగాలులతో భారీ వర్షాలు
- అంధకారంలో గ్రామాలు.. నీట మునిగిన పొలాలు
- విశాఖ సహా పలుచోట్ల నేలకొరిగిన చెట్లు, స్తంభాలు
- వేర్వేరుచోట్ల గోడకూలి వృద్ధ దంపతులు సహా ముగ్గురి దుర్మరణం



**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

తీవ్ర వాయుగుండం ప్రభావంతో ఉత్తరాంధ్ర వణికింది...! ఎడతెరిపి లేని భారీ వర్షంతో తడిసి ముద్దయింది...! మరీ ముఖ్యంగా శ్రీకాకుళం జిల్లా అతలాకుతల మైంది...! విజయనగరం విలవిల్లాడింది...! విశాఖపట్నంలోనూ తీవ్రత కనిపించింది..! ఏకధాటిగా కురిసిన వానకు నదులు, వాగులు పొంగి ప్రవహించాయి...! గంటకు 60%–%70 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీయడంతో అనేకచోట్ల చెట్లు రోడ్లపై కూలిపోయాయి. వేలాది ఎకరాల్లో పంట పొలాలు మునగడంతో రైతులు గుండెలు బాదుకుంటున్నారు. కాగా, వేర్వేరు ఘటనల్లో గోడకూలి వృద్ధ దంపతులు సహా ముగ్గురు మృతిచెందారు. నది ప్రవాహంలో ఓ యువకుడు గల్లంతయ్యాడు. రికార్డు స్థాయిలో 18.03 సెంటీమీటర్ల వర్షం కురవడంతో - మిగతా2లో

## ఫిబ్రవరి 23 నుంచి ఇంటర్ పరీక్షలు

- మార్చి 24 వరకు ఉ.9 గంటల నుంచి మ.12 వరకు పరీక్షలు
- షెడ్యూల్ విడుదల చేసిన ఇంటర్ విద్యా మండలి
- ఈనెల 10 వరకు ఫీజు చెల్లింపునకు అవకాశం

2





## చిన్నారులకు దగ్గుమందు వాడకండి

- 2 ఏళ్ల లోపు పిల్లలకు దగ్గు సిరప్ ఇవ్వొద్దు
- ఈ వయస్సులో శరీరం మందుల ప్రభావానికి అధికంగా స్పందించవచ్చు.
- 5 ఏళ్ల లోపు పిల్లలకు దగ్గు మందులు సిఫార్సు చేయరాదు
- దగ్గుమందు వికటించి 11 మంది చిన్నారుల వరకూ మృత్యువాత

5

# నాడు అంధకారం.. నేడు ఉత్సవం.. ఉత్సాహం

-మొదటిపేజీ తరువాయి

అందరికీ తల్లికి వందనం అందిస్తున్నాం. ఒక్కొక్కరికి 2.5 లక్షల ఆరోగ్య బీమా ఇస్తున్నాం. సూపర్ సిక్స్ హామీలు అమలు చేసి చూపించాం. పట్టిసీమ ద్వారా పదేళ్ల కిందటే కృష్ణా డెల్టాకు గోదావరి నీరు తెచ్చాం. భవిష్యత్తులో కృష్ణా జిల్లాకు నీటి కొరత లేకుండా చేస్తామని మాటిస్తున్నా. 2019లో అధికారంలోకి వచ్చి ఉంటే 2020 నాటికే పోలవరం పూర్తి చేసేవాళ్లం. అమరావతిని గాడిలో పెట్టాం. విజయవాడను విడిచి వెళ్లిన వారంతా తిరిగి వచ్చేలా చేస్తాం. 57 శాతం ఓట్లు, 94 శాతం నియోజకవర్గాల్లో విజయాన్ని ఇచ్చారు. మిమ్మల్ని ఆనందపరిచేలా పాలన సాగిస్తాం' అని సీఎం తెలిపారు.

**జాతీయ సమైక్యతను చాటారు..**

'ఆధునిక తరంలో మన సంస్కృతి, సంప్రదాయాలను మర్చిపోతున్నారు. అలాంటి పరిస్థితుల్ని మార్చుతూ 11 రోజుల్లో 280 ప్రదర్శనలు నిర్వహించడం అసాధారణం. 2.5 లక్షలమంది ప్రేక్షకులు కళారూపాలను వీక్షించారు. డప్పు ర్యాలీతో గిన్నిస్ రికార్డు సాధించారు. హెలిరైడ్‌లో సైతం 2,000 మంది పాల్గొన్నారు. విద్యా, వ్యాపారం, పారిశ్రామిక, వ్యవసాయం తదితర 700 స్టాళ్లు ఏర్పాటు చేశారు. దేశంలోనే అత్యుత్తమ కళలు, కళాకారులతో ప్రదర్శనలు నిర్వహించి భిన్నత్వంలో ఏకత్వాన్ని, జాతీయ సమైక్యతను చాటారు. రాష్ట్రంలో భవిష్యత్తులో టెంపుల్ ఎకానమీ కీలకపాత్ర పోషించనుంది. మన రాష్ట్రంలో 27కి పైగా ప్రముఖ ఆలయాలున్నాయి. మనకు శక్తి పీఠాలు, పవిత్ర పుణ్యక్షేత్రాలు ఉన్నాయి. ఇవన్నీ మన వారసత్వ సంపద. వాటిని కాపాడుకోవాలి. భవిష్యత్తులో టెక్నాలజీ గేమ్ ఛేంజర్. విజయవాడ, అమరావతి అనగానే ఏఐ, క్వాంటమ్ వ్యాలీ గుర్తొచ్చేలా చేస్తాను. టెక్నాలజీ వల్ల ఉద్పాదకత పెరిగి ఉద్యోగావకాశాలు వస్తాయి. ఇంటికో పారిశ్రామికవేత్త తయారు కావాలి' అని సీఎం తెలిపారు.

**ఉత్సవ్‌లో గిన్నిస్ రికార్డు..**

సీఎం ముందుగా బందర్ రోడ్డులో 3,000 మంది కళాకారులతో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కవాతులో (మెగా కార్నివాల్ వాక్) పాల్గొన్నారు. ప్రదర్శనలు తిలకించారు. ఇందులో 1,000 మంది డప్పు కళాకారులతో జరిపిన ర్యాలీ గిన్నిస్ రికార్డు నెలకొల్పింది. గిన్నిస్ రికార్డుల కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో సీఎం.. సొసైటీ ఫర్ వైబ్రెంట్ విజయవాడ సభ్యులకు గిన్నిస్ రికార్డు పత్రాన్ని అందించారు. బందర్ రోడ్డు నుంచి ఆయన గొల్లపూడి ఎక్స్‌పో మైదానానికి చేరుకున్నారు. అక్కడ ఏర్పాటు చేసిన రోబోటిక్ కిచెన్‌ను సందర్శించారు. ఏఐ సాంకేతికతతో పనిచేసే రోబో షెఫ్ తయారు చేసిన వంటకాన్ని రుచి చూశారు. ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్, ఇతర ప్రజాప్రతినిధులు అధికారులు పాల్గొన్నారు.

# ఫిబ్రవరి 23 నుంచి ఇంటర్ పరీక్షలు

అమరావతి

ఇంటర్మీడియట్%-%2026 పబ్లిక్ పరీక్షలు వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు శు క్రవారం ఇంటర్ విద్యా మండలి కార్యదర్శి నారాయణ భరత్ గుప్తా షెడూయ్‌ల్ విడుదల చేశారు. మొదటి ఏడాది పరీక్షలు ఫిబ్రవరి 23 నుంచి, సెకండియర్‌వి 24 నుంచి ప్రారంభమవుతాయి. ఈ పరీక్షలు మార్చి 24వ తేదీ వరకు ఉ.9 నుంచి మ.12 వరకు జరగనున్నాయి. ప్రాక్టికల్ పరీక్షలు వొకేషనల్ విద్యార్థులకు జనవరి 27 నుంచి ఫిబ్రవరి 10 వరకు, జనరల్ విద్యార్థులకు ఫిబ్రవరి 1 నుంచి 10 వరకు జరుగుతాయి. అలాగే, సమగ్ర శిక్ష ప్రాజెక్టులో భాగంగా నిర్వహిస్తున్న వొకేషనల్ ట్రేడ్స్‌కు ఫిబ్రవరి 13న ప్రాక్టికల్స్ ఉంటాయి. విద్యార్థులకు నైతిక విలువలు, మానవ విలువలు (ఎథిక్స్ అండ్ హ్యూమన్ వేల్యూస్)పై జనవరి 21న, పర్యావరణ విద్యపై 23న పరీక్ష నిర్వహిస్తారు. ఇక ఈ విద్యా సంవత్సరం నుంచి కొత్త సిలబస్, సీబీఎస్ఈ విధానం అమలుచేస్తుండడంతో కొందరు విద్యార్థులు రెండో భాష స్థానంలో ఆర్ట్స్ సబ్జెక్టులు ఎంచుకోవడం, ఎంబైపీసీ కోర్సు ప్రవేశం తదితర కారణాలతో ఒకరోజు ఒక పేపర్ విధానంలో పరీక్షలు జరిగేలా జాగ్రత్తలు తీసుకున్నారు. అలాగే, గతేడాది ఫెయిలైన విద్యార్థులకు అనుగుణంగా బ్యాక్‌లాగ్ పేపర్లు పూర్తిచేసేలా షెడ్యూల్ రూపొందించారు. ఇదిలా ఉంటే.. ఇంటర్ పరీక్షల ఫీజు చెల్లింపునకు ఈనెల 10 వరకు అధికారులు గడువునిచ్చారు. అపరాధ రుసుంతో ఈనెల 20 వరకు చెల్లించవచ్చు.

**మొదటి ఏడాది పరీక్షల షెడ్యూల్ ఇదీ..**

ఫిబ్రవరి 23 తెలుగు/సంస్కృతం/ఉర్దూ/హిందీ/తమిళం/ఒరియా/కన్నడ/అరబిక్/ఫ్రెంచ్/పర్షియన్
బ్యాక్‌లాగ్ సెకండ్ లాంగ్వేజ్ పేపర్%-1
25-2-%2026: ఇంగ్లిష్
బ్యాక్‌లాగ్ : ఇంగ్లిష్
27%-2-%2026 : చరిత్ర
బ్యాక్‌లాగ్ : బోటనీ, చరిత్ర
మార్చి 2 : మేథమెటిక్స్
బ్యాక్‌లాగ్ : మేథమెటిక్స్ 1ఏ
5%-3-%2026 : బయాలజీ
బ్యాక్‌లాగ్ : మేథమెటిక్స్ 1బి, జువాలజీ
7%-3-%2026 : ఎకనామిక్స్
బ్యాక్‌లాగ్ : ఎకనామిక్స్
10%-3-%2026 : ఫిజిక్స్
బ్యాక్‌లాగ్ : ఫిజిక్స్
12%-3-%2026 : కామర్స్
బ్యాక్‌లాగ్ : కామర్స్/సోషియాలజీ/ఫైన్ ఆర్ట్స్, మ్యూజిక్
14%-3-%2026 : సివిక్స్
బ్యాక్‌లాగ్ : సివిక్స్/మ్యాథమెటిక్స్ (బ్రిడ్జి కోర్సు)
17%-03-%2026 : కెమిస్ట్రీ
బ్యాక్‌లాగ్ : కెమిస్ట్రీ
20%-3-%2026 : పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్/లాజిక్ (రెగ్యులర్ అండ్ బ్యాక్‌లాగ్)
24%-3-%2026 : మోడ్రన్ లాంగ్వేజ్/జియోగ్రఫీ (రెగ్యులర్ అండ్ బ్యాక్‌లాగ్)

సెకండియర్ షెడ్యూల్ ఇలా..

24%-2-%2026 : సెకండ్ లాంగ్వేజ్
26%-2-%2026 : ఇంగ్లిష్
28%-2-%2026 : బోటనీ/హిస్టరీ
3%-3-%2026 : మేథమెటిక్స్ 2ఎ/సివిక్స్
6%-3-%2026 : జువాలజీ/ ఎకనామిక్స్
9%-3-%2026 : మేథమెటిక్స్ 2బి
11%-3-%2026 : కామర్స్/సోషియాలజీ/ ఫైన్ ఆర్ట్స్/మ్యూజిక్
13%-3-%2026 : ఫిజిక్స్
16%-3-%2026 : మోడ్రన్ లాంగ్వేజ్/ జియోగ్రఫీ/మ్యాథమెటిక్స్%-%2(బ్రిడ్జి కోర్సు)
18%-3-%2026 : కెమిస్ట్రీ
23%-3-%2026 : పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్/లాజిక్

# ఉత్తరాంధ్ర అతలాకుతలం

-మొదటిపేజీ తరువాయి

శ్రీకాకుళం జిల్లా పలాస%-%కాశీబుగ్గ పట్టణాలు చెరువుల్లా మారాయి. పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లోనూ పలుచోట్ల అతి భారీ వర్షాలు కురవడంతో ఆయా ప్రాంతాలు జలమయమయ్యాయి. శ్రీకాకుళం జిల్లా అంతటా కుండపోత వర్షాలతో అనేక ప్రాంతాలు జల దిగ్బంధంలో చిక్కుకున్నాయి. మెలియపుట్టి మండలం చుట్టూ నీరు చేరింది. మందసలో 13.9, హరిపురం (13.7), నందిగం (13.4), కంచిలి మండలం ఎంఎస్ పల్లె (13.1), టెక్కలి మండలం రావివలస (10.1), సోంపేట మండలం కొర్లాం (9.6), మెలియపుట్టి (9.3), కోట‘మ్మాళి (9), సంత‘మ్మాళి (8.9), పార్వతీపురం మన్యం సీతంపేటలో (8), సిరిగం (7.9), రాస్తకుంటబాయి (7.4), నిమ్మాడ (6.8), గార (6.7) వర్షపాతం నమోదైంది. చాలాచోట్ల విద్యుత్ లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాల కారణంగా పాఠశాలలకు స్థానికంగా ఎక్కడికక్కడ సెలవు ప్రకటించారు. అరటి, బొప్పాయి, మొక్కజొన్న పంటలకు భారీగా నష్టం వాటిల్లింది.

**పలు మండలాల్లో 5 సెం.మీ పైగా వర్షం**

శ్రీకాకుళం జిల్లా రణస్థలం, కవిటి, పొలాకి, బుర్జ, ఆమదాలవలస, పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు, కొమరాడ, కురుపాం, జియ్యమ్మవలస, లావేరు, నరసన్నపేట, అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయ, విజయనగరం జిల్లా మెరకముడిదం, గరివిడి, పైడి భీమవరం, రాజాపురం, పార్వతీపురం మన్యం జిల్లా పచ్చిపెంట ప్రాంతాల్లో 5 సెంటీమీటర్లకుపైగా వర్షం కురిసింది.

**విజయనగరం విలవిల**

విజయనగరం జిల్లాలో నదులు, వాగులు ఉప్పొంగాయి. పొలాలను వరద ముంచెత్తింది. ఈదురుగాలులకు విద్యుత్తు స్తంభాలు నేలకొరగడంతో గంటల తరబడి సరఫరాకు అంతరాయం కలిగింది. ఒడిశాలో భారీ వర్షాలతో నాగావళికి వరద పోటెత్తింది. పలు గ్రామాలు జల దిగ్బంధంలో చిక్కుకుని, బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. అరటి, చెరకు, వరి, మొక్కజొన్న, కూరగాయల పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. కురుపాం నియోజకవర్గం గరుగుబిల్లి మండలం ఏసూరిగెడ్డ ఉధృతికి రావుపల్లి, కొత్తపల్లి గ్రామాలకు చెందిన వంద ఎకరాల వరి ముంపునకు గురైంది. గొట్టా, భగీరథపురం, నీలాదేవిపురం, అంబావల్లి, పింద్రువాడ, రెల్లివలస, అక్కరాపల్లి, కిట్టాలపాడు, పాతహిరమండలం, జిల్లోడిపేట, కల్లట, గులుమూరు గ్రామాల్లో వందల ఎకరాలు ముంపులో చిక్కుకున్నాయి. పొట్ట, వెన్ను దశలో ఉన్న సమయంలో వరదతో పంటంతా పోయింది. వీరఘట్టం మండలంలో 850 ఎకరాల్లో అరటి, 100 ఎకరాల్లో మొక్కజొన్న, 250 ఎకరాల్లో వరిపంటకు నష్టం వాటిల్లింది. వట్టిగెడ్డ ఉధృతంగా ప్రవహించడంతో కురుపాం%-%రావాడ గ్రామాల మధ్య రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. తూర్పుముఠాలో ఉన్న సుమారు 30 గిరిజన గ్రామాలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి.

తీరం దాటిన వాయుగుండం

బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం గురువారం ఒడిశాలోని గోపాల్‌పూర్%-%పారదీప్ మధ్య తీరం దాటింది. శుక్రవారానికి అతి బలహీనపడడంతో వర్షాలు తగ్గుముఖం పట్టాయి.

**ఈపీడీసీఎల్‌కు రూ.1.78 కోట్ల నష్టం**

వాయుగుండం కారణంగా కురుస్తున్న భారీ వర్షాలు, ఈదురుగాలుల తీవ్రతతో ఈపీడీసీఎల్ పరిధిలోని విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అల్లూరి జిల్లాలలో రూ.1.78 కోట్ల నష్టం వాటిల్లిందని సంస్థ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి వెల్లడించారు. గాలుల కారణంగా ఆరు సర్కిళ్లలోని విద్యుత్ లైన్లపై భారీ వృక్షాలు, ఫ్లెక్సీ బ్యానర్లు, చెట్లకొమ్మలు విరిగిపడ్డాయని తెలిపారు. 33 మండలాలకు గాను 25 మండలాల్లో విద్యుత్ పునరుద్ధరించామని చెప్పారు.

**వంశధార ఉధృతి**

భీతిల్లిన పరివాహక గ్రామాల ప్రజలు

గొట్టాకు మూడో ప్రమాద హెచ్చరిక జారీ

వర్షాల దెబ్బకు నాగావళి, వంశధార నదులు ప్రమాద స్థాయిని మించి ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. వంశధార ఐదారేళ్లుగా చూడని స్థాయిలో ఉగ్రరూపం దాల్చింది. 1.05 లక్షల క్యూసెక్కుల ప్రవాహంతో నదీ తీర గ్రామాల ప్రజలు భీతిల్లారు. శుక్రవారం సాయంత్రం నుంచి వంశధార శాంతించింది. ఒడిశాలోని ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు గొట్టా బ్యారేజీలోకి నీటి మట్టం పెరగడంతో మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. వరద ధాటికి నదీ తీర ప్రాంత ప్రజలు రాత్రిళ్లు బిక్కుబిక్కుమంటూ కాలం గడిపారు. బాహుదా నది కూడా పొంగి ప్రవహించడంతో తీర గ్రామాలు, పొలాలు నీట మునిగాయి. మహేంద్రతనయకూ వరద ఉధృతి కొనసాగుతోంది.

**నేలకొరిగిన చెట్లు**

ఈదురుగాలులు విశాఖను వణికించాయి. దసరా రోజున భారీ గాలులతో కూడిన వర్షంతో పలుచోట్ల చెట్లు నేలకూలాయి. 80 ప్రాంతాల్లో 170 పైగా చెట్లు నేలకొరిగాయి. విద్యుత్ స్తంభాలు కూడా పడిపోయాయి.

**అల్లూరి జిల్లాలో కూలిన బడులు**

భారీ వర్షాలకు అల్లూరి జిల్లా జి.మాడుగుల మండలం పాలమామిడి పంచాయతీ వనభరంగిపాడులో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనం గురువారం తెల్లవారుజామున కుప్పకూలింది. ముంచంగిపుట్టు మండలం జర్జుల పంచాయతీ సింధుపుట్టులో పాఠశాల నిర్వహించే రేకుల షెడ్డు గురువారం సాయంత్రం పడిపోయింది.

మృతుల కుటుంబాలకు రూ.4 లక్షల ఎక్స్‌గ్రేషియా

ఉత్తరాంధ్ర జిల్లాల్లో భారీ వర్షాలు, వరదల కారణంగా దెబ్బతిన్న రహదారులు, విద్యుత్‌ను వెంటనే పునరుద్ధరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారులను ఆదేశించారు. సచివాలయంలో శు క్రవారం ఉత్తరాంధ్ర జిల్లాల్లో వర్షాలు, వరద ప్రవాహాలపై ఉన్నతాధికారులు, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ జిల్లాల కలెక్టర్లతో సీఎం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. భారీ వర్షాలు, ప్రమాదాల కారణంగా మూీడు జిల్లాల్లో నలుగురు మృతిచెందినట్లు అధికారులు చెప్పారు. విశాఖ నగరం కంచరపాలెంలో ఒకరు, శ్రీకాకుళం జిల్లా మందసలో ఇద్దరు, పార్వతీపురం మన్యం జిల్లాలోని కురుపాంలో ఒకరు మృతిచెందినట్లు అధికారులు తెలిపారు. దీనిపై స్పందించిన సీఎం.. మృతుల కుటుంబాలకు రూ.4 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని ఆదేశించారు.

**వృద్ధ దంపతులను బలిగొన్న గోడ**

మరో రెండు ఘటనల్లో ఇద్దరు దుర్మరణం

క్యాబేజీ పంటంతా పోవడంతో రైతు ఆత్మహత్యాయత్నం

శ్రీకాకుళం జిల్లా మందస మండలం హంసరాలి పంచాయతీ చిన్నటూరులో గురువారం రాత్రి మట్టి గోడ కూలి పెళ్లలు మీద పడడంతో వృద్ధ దంపతులు సవర బుద్దయ్య (65), రూపమ్మ(60) ప్రాణాలు కోల్పోయారు. హరిపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా శుక్రవారం చికిత్స పొందుతూ మృతి చెందారు. వీరి ఇద్దరు పిల్లలు ఉద్యోగ రీత్యా బయట ఉంటున్నారు. సీఎం ఆదేశాల మేరకు వీరి కుటుంబాలకు రూ.4 లక్షల చొప్పున పరిహారం ప్రకటించినట్లు ఎమ్మెల్యే గౌతు శిరీష తెలిపారు.

పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం మండలం ఉదయపురంలో వర్షాలకు నానిన గోడ కూలడంతో అరవింద్ మృతి చెందాడు. ఇతడి సోదరుడు వినయ్‌ను స్థానికులు రక్షించి ఆస్పత్రికి తరలించారు.

శ్రీకాకుళం జిల్లా పలాస మొగిలిపాడు గ్రామానికి చెందిన సైని గోపాలరావు (47) వరదలో కొట్టుకుపోయి మృతి చెందాడు. గురువారం జాతీయ రహదారి వెంట పెద్దఎత్తున వరద ప్రవహిస్తుండగా... అవతల ఉన్న పొలాన్ని చూసేందుకు వెళ్లిన గోపాలరావు తిరిగి రాలేదు. పొలం దగ్గర ఉన్న ఖానాలో పడిపోయి చనిపోయాడు. విజయనగరం జిల్లా బొబ్బిలి మండలం జె.రంగరాయపురంలో వేగావతి నదిలో యోగేశ్వరరావు (22) గల్లంతయ్యాడు.

పార్వతీపురం మన్యం జిల్లా కొమరాడ మండలం కళ్లికోటకు చెందిన కౌలు రైతు బి.రాంబాబు క్యాబేజీ పంట మొత్తం నీట మునగడంతో పురుగుమందు ఆత్మహత్యకు ప్రయత్నించాడు. స్థానికులు ఆస్పత్రికి తరలించారు.

## ఎమ్మెల్యేలను కట్టడి చేయాల్సిన బాధ్యత మంత్రులదే

-మొదటిపేజీ తరువాయి



ఉన్న అన్ని రిజర్వాయర్లలో వాటి సామర్థ్యంలో 93 శాతం మేర నీటిని నింపగలిగామని సీఎం మంత్రులతో అన్నారు. విజన్ 2047లో భాగంగా పెట్టుకున్న 10 ప్రధాన సూత్రాల్లో నీటిభద్రత ఒకటని, ఆ దిశగా అడుగులు వేయడంలో ఇది కీలక పరిణామమన్నారు. నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, అధికారులకు ఈ సందర్భంగా సీఎం అభినందనలు తెలిపారు. మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ అమలు చేస్తున్న కన్వెషనరీ హైబ్రిడ్ యాన్యుటి మోడ్ (సీహెచ్ఏఎం) బాగుందని సీఎం అభిప్రాయపడ్డారు. ఆ శాఖ పరిధిలో చేస్తున్న అభివృద్ధి పనులన్నింటినీ ఇదే విధానంలో చేస్తున్నారని, ఫలితంగా శాఖపై ఆర్థికభారం తగ్గిందని తెలిపారు. అదే సమయంలో కేంద్రం నుంచి, ఇతర ఏజెన్సీల నుంచి ఎక్కువ నిధులు రాబట్టుకునే వెసులుబాటు కలుగుతుందన్నారు. ఈ విధానాన్ని తమ తమ శాఖల్లోని అభివృద్ధి పనులకు అమలు చేసే విషయాన్ని పరిశీలించాలని సీఎం కోరారు. దేశంలోని తూర్పు ప్రాంత రాష్ట్రాల్లో కనెక్టివిటీ, పారిశ్రామిక ఉత్పత్తి, ఉపాధి అవకాశాలను మెరుగుపర్చేందుకు ఉద్దేశించిన పూర్వోదయ పథకంలో ఏపీని కూడా చేర్చారని, ఈ పథకాన్ని పూర్తి స్థాయిలో ఉపయోగించుకోవాలని సీఎం సూచించారు. మౌలిక సదుపాయాల అభివృద్ధి, రహదారులు, రైల్వేలు, జలమార్గాలు, విద్యుత్తు ఉత్పత్తి పెంపునకు పూర్వోదయ పథకం దోహదపడుతుందని, హార్టికల్చర్, ఆక్వాకల్చర్ వంటి రంగాలకు ఊపు తెస్తుందన్నారు. ఈ పథకం కింద రాష్ట్రానికి రానున్న రెండుమూడేళ్లలో సుమారు రూ.65 వేల కోట్లు వచ్చే అవకాశం ఉందని సీఎం మంత్రులకు వివరించారు. గోకులాల ఏర్పాటును వేగవంతం చేయాలని, మంత్రులందరూ ఈ దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో వీలైనన్ని ఎక్కువ గోకులాల ఏర్పాటుకు కృషి చేయాలని అన్నారు. వీటి ద్వారా స్థానికులకు ఆదాయం సమకూరేలా చూడాలని కోరారు. కడపలో జిందాల్ ఉక్కు కర్మాగారాన్ని 2028 కల్లా పూర్తి చేస్తామని మంత్రులకు సీఎం తెలిపారు.

## అమరావతి కోసం ఎస్పీవీ

-మొదటిపేజీ తరువాయి

ఉపసంహరించుకునేందుకు సీఆర్డీఏ కమిషనర్‌కు క్యాబినెట్ అనుమతిని ఇచ్చింది. నీటి సంఘాల సభ్యుల ఎంపికకు, అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులకు సంబంధించి ఇద్దరు పిల్లల నిబంధనను తొలగించింది. దీనికోసం రూపొందించిన ముసాయిదా బిల్లుకు ఆమోదం తెలిపింది. ఇద్దరుకన్నా ఎక్కువమంది పిల్లలున్నా, ఈ పదవుల్లో కొనసాగటానికి ఈ బిల్లు వీలు కల్పిస్తుంది. శుక్రవారం వెలగపూడిలోని సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన మంత్రిమండలి సమావేశంలో ఇలాంటి కీలక నిర్ణయాలెన్నింటినో తీసుకున్నారు. ఆ వివరాలను సమాచార, గృహ నిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసార?థి మీడియాకు వెల్లడించారు. మంత్రిమండలిలో వ్యక్తిగత ఎజెండాలేవీ లేవని, ప్రజా సమస్యలపైనా చర్చించామని పార్థసార?థి తెలిపారు. "రాజధాని ప్రాంతంలో రెండో దశ భూసేకరణ అంశంపై క్యాబినెట్‌లో చర్చ జరగలేదు. స్త్రీశక్తి, అన్నదాత సుఖీభవ, పెన్షన్ల పెంపు, దీపం-2 పథకం లబ్ధితోపాటు రాష్ట్రానికి వస్తున్న పెట్టుబడులు, జరుగుతున్న అభివృద్ధి గురించి ప్రజలకు వివరించాలని సీఎం సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నిర్దేశించారు. అర్హులైన ప్రతి పేదకూ ఇల్లు, ఇంటి స్థలం ఇస్తాం" అని మంత్రి తెలిపారు.

**ప్రధాన నిర్ణయాలు..**

ఏపీటూరిజం పాలసీలో కారవాన్ టూరిజాన్ని చేర్చడానికి మంత్రివర్గం ఆమోదం. అలాగే, హోమ్ స్టే/ బెడ్ అండ్ బ్రేక్‌ఫాస్ట్ విధానాన్ని ప్రోత్సహించడానికి ఫ్రేమ్ వర్క్‌ను ఈ పాలసీలో భాగం చేసేందుకు సమ్మతి.

ఏపీ అసైన్డ్ ల్యాండ్స్(బదిలీల నిషేధం) బిల్లు 2025ను సవరిస్తూ ముసాయిదా బిల్లుకు ఆమోదం.

ప్రకాశం బ్యారేజ్, దివిసీమ భద్రత, నిర్మాణ పటిష్టతకు రూ.4.49 కోట్లతో వరద మరమ్మతు పనులకు ఆమోదం.

హంద్రి-నీవా సుజలస్రవంతి ప్రాజెక్టు రెండోదశ కింద రాకెట్ల గ్రామం వద్ద అమిద్యాల ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించడానికీ, ప్యాకేజీ 52ఏ కింద మిగతా పనులను రూ.72.30కోట్లతో చేపట్టడానికీ అంగీకారం.

కడప జిల్లాలో మైలవరం ఆనకట్టకు రూ.3,19 కోట్లతో ప్లేట్లు, ఇతర అమరిక పనులు చేపట్టాలని నిర్ణయం.

తిరుపతి, తిరుమల తాగునీరు అవసరాల కోసం రూ.126.06 కోట్ల వ్యయానికి ఆమోదం.

అనంతపురం జిల్లా ఉరవకొండ, వజ్రకరూర్, విడపనకల్ మండలాలకు తాగునీరు, 10,500ఎకరాలకు సాగునీరు అందించే కొట్టాలపల్లి ఎత్తిపోతల ద్వారా హంద్రీనీవా ప్రధాన కాలువ నుంచి 100క్యూసెక్కుల నీరు ఎత్తి పోయడానికి రూ.55.60కోట్లతో పనులకు ఆమోదం.

అనంతపురం జిల్లా మిడ్ పెన్నార్ ప్రాజెక్టుకు రూ.5.20 కోట్లతో రబ్బర్ సీల్స్ మార్పిడి పనులకు ఆమోదం.

రాష్ట్ర జల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా అమృత్ 2.0 అమలుకు రూ.10,319కోట్లమేర పాలనా అనుమతి.

తిరుపతిలోని ఎస్వీ వెటర్నరీ వర్సిటీకి 16.19ఎకరాలు, గుంటూరు జిల్లా వెటర్నరీ ఆఫీసర్స్ హౌసింగ్ సొసైటీకి 10ఎకరాలు కేటాయింపు.

ఏపీ మార్క్‌ఫెడ్ ద్వారా రూ.వెయ్యికోట్ల వర్కింగ్ క్యాపిటల్ రుణంపొంది, దానిని పౌర సరఫరాల సంస్థకు ఇంటర్ కార్పొరేట్ రుణంగా బదిలీ చేసి.. ధాన్య కొనుగో లు బకాయిలను చెల్లించాలని నిర్ణయం.

నంద్యాల జిల్లా పాణ్యం మండలం పిన్నాపురంలో ప్రభుత్వ భూమి 174.10ఎకరాలను గ్రీన్కో లిమిటెడ్‌కు రూ.6.25 లక్షలకు ఇవ్వాలన్న ప్రతిపాదనకు ఆమోదం.

నిరంతరం పని చేసే రిఫరెన్స్ స్టేషన్(సీవోఆర్ఎస) నెట్‌వర్క్‌ను నేషనల్ ప్లాట్‌ఫాంతో అనుసంధానించేందుకుగాను కుదిరిన అవగాహన ఒప్పందానికి ఆమోదం.

హిందూమత సంస్థలు, దేవదాయ చట్టం 1987(నంబరు30) సెక్షన్ 19(1-బీ)లోని 'కుష్ఠు వ్యాధితో బాధపడుతున్నారు' అనే పదం తొలగింపు.. కాళంగి నది 'వరద' పనులు రద్దు

చిత్తూరు-నెల్లూరు జిల్లాల పరిధిలో కాళంగి నది వరద నివారణ కోసం 2009లో నిర్మించతలపెట్టిన ఫ్లడ్ బ్యాంక్ పనులను మంత్రిమండలి రద్దుచేసింది. కాళంగి నది నుం చి తనయాలి ఆనకట్ట వరకు దాదాపు 27.50 కిలోమీటర్లమేర ఫ్లడ్‌బ్యాంకును నిర్మించాలని భావించారు. దీనికోసం రూ.30.24 కోట్లతో పనులు చేసేందుకు చెన్నైకు చెందిన మెసర్స్ జీవీఆర్ ఇన్‌ఫ్రా ప్రాజెక్టు సంస్థకు పనులు అప్పగించారు. ఈ సంస్థ రూ. 19.05 కోట్లు ఖర్చుచేసి దాదాపు 62 శాతం మేర పనులు చేసింది. మరో రూ.11.29 కోట్ల విలువైన పనులు పెండింగ్‌లో ఉంచింది. భూసేకరణ అంశంలో కోర్టు కేసులు, అటవీ పర్యావరణ అనుమతులు రావడంలోని ఆటంకాల కారణంగా ఫ్లడ్‌బ్యాంక్ పనులు పూర్తికావడం లేదు. కాగా, శ్రీశైలం జలాశయం నుంచి 120 వరద రోజుల్లో రాయలసీమకు తాగునీటిని అందించేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది

# విశ్వం వాయిస్

అవినీతిపై- అక్షరసమరం...



కాకినాడ తూర్పు గోదావరి
డా బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ

శనివారం 4 అక్టోబర్ 2025





www.viswamvoice.com


# గోకులం పథకంతో పశుశాలలు నిర్మాణం..

### పిడింగొయ్యిలో గోశాల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గోరంట్ల..



**రాజమహేంద్రవరం రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** గోకులం పథకం ద్వారా వేగంగా పశువుల శాలలు నిర్మాణం జరుగుతున్నాయని, రూరల్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి పేర్కొన్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలలో భాగంగా, ఈ రోజు రాజమహేంద్రవరం రూరల్ మండలం పిడింగొయ్యి గ్రామ పంచాయతీ, కవలగొయ్యి గ్రామం నందు గోకులం పథకం ద్వారా 90 శాతం ఖర్చు ప్రభుత్వం భరిస్తూ కేవలం 10 శాతం సొమ్ము మాత్రమే లబ్ధిదారు ఖర్చుచేస్తూ పశువుల శాలలు నిర్మాణం చేసుకునేందుకు జరిగే శంఖుస్థాపన కార్యక్రమంలో రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి పాల్గొన్నారు. అలాగే ఈ పథకంలో రెండు పశువులకు షెడ్డు నిర్మాణం కొరకు యూనిట్‌కు రూ.1,15,000/- ఇందులో లబ్ధిదారు రూ. 11,500(10శాతం) మిగిలిన మొత్తం రూ. 1,03,500/-(90 శాతం) ప్రభుత్వం భరిస్తుంది. అలాగే నాలుగు పశువులకు షెడ్డు నిర్మాణానికి లబ్ధిదారు యూనిట్‌కు రూ. 18,500/- ఏర్పాటు చేసుకొంటే ప్రభుత్వం 1,66,500/-(90శాతం) మంజూరు చేస్తుంది. అదేవిధంగా ఆరు పశువులుకు షెడ్డు నిర్మాణానికి యూనిట్‌కు అయ్యే ఖర్చు రూ.2,00,000/-లకు గాను, రూ.20,000/-(10శాతం)లబ్ధిదారు ఏర్పాటు చేసుకొంటే మిగిలిన మొత్తం అనగా రూ. 1,80,000/-(90 శాతం) ప్రభుత్వం అందజేస్తుంది అని తెలుపుతూ ఈ పథకంలో రాజమహేంద్రవరం రూరల్ మండలానికి 50 యూనిట్స్ మంజూరు కాగా ఇప్పటి వరకూ 24 మంది అర్హులు లైన లబ్ధిదారులు ఎంపిక కాగా మిగిలిన యూనిట్లకు అర్హులైన పశువులు కలిగిన రైతులు దరఖాస్తు చేసుకొని ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏ.ఎం.సి చైర్మన్ మార్ని వాసుదేవ్, పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ మత్సటి ప్రసాద్, ఎంపీడీవో సునీల్ ఆర్మ్ స్ట్రాంగ్, గ్రామ అధ్యక్షులు మట్టా శ్రీనువాస్, సొసైటీ అధ్యక్షులు బొప్పన శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి డి.సూరిబాబు, బొప్పన నాగేశ్వరావు, మార్ని దొరయ్య,ముప్పిడి రాంబాబు, చిచ్చారి సుబ్బారావు, కోరాడ వెంకటేష్, పల్లెటి ఏసు రత్నం,కందిరెల్లి సత్తిబాబు, మరుకుర్తి వెంకటేశ్వరరావు, నక్కా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



### జీఎస్టీ సంస్కరణలతో

# పేద, మధ్యతరగతి ప్రజలకు ఊరట..

### సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ ప్రారంభించిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి



**రాజమహేంద్రవరం,విశ్వం వాయిస్ న్యూస్:** జీఎస్టీ సంస్కరణలతో పేద మధ్యతరగతి ఎగువ మధ్యతరగతి ప్రజలకు ఎంతో ఊరట లభించిందని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) అన్నారు. ప్రధాని నరేంద్రమోదీ జీఎస్టీ 2.0 సంస్కరణలకు మొట్టమొదటి సరిగా మద్దతు తెల్పిన ఘనత రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వమేనని ఆయన అన్నారు. కూటమి ప్రభుత్వం పేద, మధ్య తరగతి వర్గాలకు లబ్ధి చేకూర్చేలా ప్రారంభించిన సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ కార్యక్రమాన్ని స్థానిక 25వ వార్డు - నేతాజీ స్కూల్ వద్ద, అన్నపూర్ణ థియేటర్ ఏరియాలో శుక్రవారం ఉదయం ఎమ్మెల్యే వాసు, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ, కూటమి నాయకులు యర్రా వేణు గోపాల రాయుడు, కాశీ నవీన్ కుమార్, దొండపాటి సత్యంబాబు, అత్తి సత్యనారాయణ, మజ్జి రాంబాబు, బుడ్డిగ రాధా, వర్రే శ్రీనివాసరావు, వై.శ్రీను, రెడ్డి మణేశ్వరరావు, కురగంటి సతీష్, అడబాల రామకృష్ణ తదితర నాయకులు సదరు డివిజన్‌లోని షాపులు, ప్రజల వద్దకు వెళ్లి సూపర్ జీఎస్టీ -సూపర్ సేవింగ్స్ కర పత్రాలను అందచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని చిన్నా భిన్నం చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆర్థిక పరిస్థితిని చక్కదిద్దుతూ ఒక పక్క పక్క ఇచ్చిన హామీలు అమలు చేస్తూ, మరోపక్క అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతోందని ఆయన చెప్పారు. పేద మధ్యతరగతి వారికి నెలకు రూ 15వేలు అదా అయ్యేవిధంగా ప్రధాని మోడీ,ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తీసుకున్న నిర్ణయాన్ని యావత్ దేశంలోని ప్రజలు హర్షిస్తున్నారని ఎమ్మెల్యే వాసు చెప్పారు. డివిజన్ ఇన్‌ఛార్జ్ తవ్వా రాజా పర్యవేక్షణలో డివిజన్ ప్రెసిడెంట్ ముద్రగడ జయరామ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు నందు, అర్లపల్లి బబ్లు, శెట్టి జగదీష్, కడలి రామకృష్ణ, మొకమాటి సత్య నారాయణ, బుడ్డిగ రవి, దాస్యం ప్రసాద్, అక్కిరెడ్డి ప్రసాద్, దుర్గ, చాపల చిన్నరాజు, గౌతమి, కురగంటి త్రినాధ్,అమీర్ రాజా, గుత్తుల సత్యనారాయణ, ఆడారి లక్ష్మీ నారాయణ, అధిక సంఖ్యలో కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# స్వర్ణాంధ్రకు స్వచ్ఛ ఎన్జీవో అవార్డు

### గుబ్బల రాంబాబుకు నగర ప్రముఖుల అభినందనలు



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** గత 27 సంవత్సరాల నుండి రాజమహేంద్రవరం కేంద్రంగా వివిధ సామాజిక సేవలు అందిస్తూ నగర ప్రజల, దాతల ఆదరాభిమానాలు పొందింది.స్వచ్ఛ్ ఆంధ్ర మిషన్ చేపట్టిన కార్యక్రమాలను స్వర్ణాంధ్ర ప్రజలకు చేరువ చేయడానికి ఎంతగానో కృషి చేసినందుకు స్వచ్ఛ ఎన్జీవో అవార్డుకి ఎంపికైనట్లు ఈ మేరకు జిల్లా కలెక్టర్ ప్రకటించారు. ఈ సందర్భంగా అక్టోబర్ ఆరవ తేదీన గుబ్బల రాంబాబు ఈ అవార్డును అందుకోనున్నారు. స్వర్ణాంధ్ర సేవా సంస్థకు స్వచ్ఛ ఎన్జీవో అవార్డు రావడం చాలా ఆనందంగా ఉందని రాంబాబు తెలిపారు. 1998లో ప్రారంభించబడిన స్వర్ణాంధ్ర సేవా సంస్థ రాజమండ్రి నగరాన్ని సుందర రాజమండ్రి గా మార్చడానికి దోమల నిర్మూలనకు ఇంటింటా లేవటరి గొట్టాలకు నెట్టలు కట్టింది. నగరంలో పచ్చదనం కోసం మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణ బాధ్యతను ప్రజల్లోకి ఉధృతంగా తీసుకువెళ్లడానికి వేలాది కరపత్రాలను పంపిణీ చేసింది. తడి చెత్త పొడి చెత్త వేరువేరుగా వేయాలని చెప్పే కార్యక్రమం ద్వారా డస్ట్ బిన్లను పంపిణీ చేసింది. ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాలను చేపట్టింది. స్వర్ణాంధ్ర ప్రాంగణం నిత్యం ఎంతో పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రత్యేక ప్రణాళిక ద్వారా స్వర్ణాంధ్ర కృషి చేస్తుంది.ఇంటింటికి పరిసరాల పరిశుభ్రత పై అవగాహన కల్పించేందుకు స్టిక్కర్లను అంటించడం ద్వారా ప్రజలకు వారి బాధ్యతను నిత్యం గుర్తు చేసేందుకు స్వర్ణాంధ్ర కృషి చేస్తుంది. స్వర్ణాంధ్ర కుట్టు శిక్షణ విద్యార్థినుల చేత గుడ్డ సంచులు కుట్టించి వేలాదిగా ప్రజలకు, రైతు బజార్లో షాపుల వద్ద పంపిణీ చేసింది.స్వర్ణాంధ్ర సేవా సంస్థ పరిసరాల పరిశుభ్రత పర్యావరణ పరిరక్షణకు గత రెండున్నర దశాబ్దాలుగా నిర్మాణాత్మక కృషి చేసినందుకు ఈ అవార్డు కు ఎంపిక చేయడం పట్ల పట్ల స్వర్ణాంధ్ర నిర్వాహకులు రాంబాబు హర్షం వ్యక్తం చేశారు. స్వర్ణాంధ్ర బాధ్యతగల స్వచ్ఛంద సంస్థగా మరింత ఉత్సాహంతో స్వచ్ఛ్ ఆంధ్ర కోసం పనిచేస్తామని రాంబాబు తెలిపారు.స్వర్ణాంధ్రకు స్వచ్ఛ ఎన్జీవో అవార్డు రావడం పట్ల స్వర్ణాంధ్ర గౌరవ సలహాదారు సినీ హీరో సుమన్, అధ్యక్షులు రంకాని వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు సి పి రెడ్డి, వ్యవస్థాపకులు పడాల రామిరెడ్డి పలువురు నగర ప్రముఖులు రాంబాబుకు అభినందనలు తెలిపారు.

# ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణ ఆపాలి..

### వైద్య, విద్యను పేద విద్యార్థులకు దూరం చేయకూడదు..

### వైసీపీ రాజమండ్రి పార్లమెంట్ ఇన్‌ఛార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్:** ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణ ఆపాలి..అని రాజమండ్రి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజమండ్రి పార్లమెంట్ ఇన్చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ హెచ్చరించారు.ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం ఆయన మాట్లాడుతూ రాజమండ్రి పార్లమెంటు ప్రజలకు కష్టనష్టాలు కలగకుండా,సుఖ సంతోషాలతో ఎల్లవేళలా ఆ దుర్గామాత కాపాడాలని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వ నిర్ణయం వల్ల మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆశయాలకు తూట్లు పొడుస్తున్నారని విమర్శించారు. స్వతంత్రం వచ్చి 75 సంవత్సరాలు అయినప్పటికీ రాష్ట్రంలో ఒక్క మెడికల్ కాలేజీ కూడా లేదని వివరించారు. మెడికల్ విద్య పేద, మధ్య తరగతి విద్యార్థులకు అందుబాటులో ఉండాలని సదాశయంతో నాటి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కేంద్రం నుంచి రాష్ట్రానికి 17 మెడికల్ కాలేజీలు మంజూరు చేయించారని వివరించారు. సుమారు 5 మెడికల్ కాలేజీలు ఇప్పటికే పూర్తయి 150 సీట్లు తో విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీలు పూర్తి కాలేదంటూ దుష్ప్రచారం చేస్తుందని అన్నారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీలను సీఎం చంద్రబాబు తన బినామీలకు పీపీపీ విధానం ద్వారా దరాతత్త చేసేందుకే కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు.ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయడం లేదని ఆరోపించారు. సంక్షేమ పథకాలు 40 మందికి ఇచ్చి 100 మందికి ఇచ్చినట్లు ప్రచారం చేసుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాలన రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని తగిన సమయంలో వారు బుద్ధి చెబుతారని పేర్కొన్నారు. రాజకీయ కక్షలు లేవు అంటూనే లిక్కర్ స్కాం చేశారంటూ ఆరోపణ చేసి ఎంపీ మిధున్ రెడ్డిని ఎందుకు అక్రమ అరెస్టు చేసి జైల్లో పెట్టారని ప్రశ్నించారు. రాష్ట్రంలో నిబంధనలకు విరుద్ధంగా హైవేపై, బడి గుడి ఉన్న ప్రాంతాలలో మద్యం అమ్మకూడదని నిబంధనలు ఉన్నప్పటికీ మద్యం ఏరులై పారుతుందని విమర్శించారు. ప్రభుత్వానికి ప్రజలు తెగిన బుద్ధి చెప్పే రోజు వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

### ఆదిత్య డిగ్రీ కళాశాలలో

# ఘనంగా గాంధీజయంతి



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్:** గురువారం ఉదయం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపాన ఉన్న ఆదిత్య డిగ్రీ కళాశాలలో ఘనంగా గాంధీ జయంతి జరిగింది. ఎన్ఎస్ఎస్ మరియు యూత్ రెడ్ క్రాస్ వాలంటీర్ల ప్రేరణతో జరిగిన ఈ కార్యక్రమంలో వాలంటీర్లు గాంధీజీ గురించిన దేశభక్తి గీతాలు ఆలపించారు. ఈ సందర్భంగా రాజమండ్రి ఆదిత్య విద్యాసంస్థల డైరెక్టర్ ఎస్పీ గంగిరెడ్డి గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి దీపారాధన చేసి, అగరొత్తులు వెలిగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వారి సిద్ధాంతములైన సత్యం, అహింస, సంఘసంస్కరణ, దేశభక్తి, పట్టుదల, పోరాట పటిమ వంటి తదితర అంశాలను ప్రస్తుతించారు. ప్రిన్సిపాల్ సిహెచ్ ఫణికుమార్ మాట్లాడుతూ గాంధీని యువత అనుసరించాలని, నిజమైన నాయకుడు నిరాడంబరత కలిగినవారు తల్లిదండ్రులు గౌరవిస్తూ తన జీవితాన్ని సుసంపన్నం చేసుకున్నారని, అటువంటి నాయకులు నేడు చాలా తక్కువ మంది ఉంటారని ఈ సందర్భంగా చెప్పారు. ఎన్నో అంశాలలో అతను తనకు స్ఫూర్తి అని తెలియజేశారు. డాక్టర్ జి వి ఎస్ నాగేశ్వరరావు, కలకత్తాలో ప్లేగు వ్యాధి ప్రబలినప్పుడు గాంధీ దొడ్లను శుభ్రం చేసి, ఆ కార్మికులకు కూడా చలింపజేసి మరలా పనిలోకి వెళ్లే విధంగా సేవ చేసిన గొప్ప గుణం వారిదని, వారే తన వాలంటీర్లకు తనకు కూడా ఆదర్శనీయమని చెప్పారు. కాంపిటేటివ్ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ భగవద్గీతలో ఏ సమస్యకైనా వారికి సమాధానం దొరికేదని, నేటి యువతకు పుస్తక పఠనం కొరవడినదని ఆవేదన వ్యక్తం చేశారు.అంతర్జాలం అవసరానికి తప్ప ఎక్కువగా వాడకూడదని ఆయన చెప్పారు.ఈ కార్యక్రమంలో మేనేజ్మెంట్ కు చెందిన శ్రీరాం,ఎ.ఓ. దయానంద్,ఆఫీసు అసిస్టెంట్ కిరణ్, ఇన్చార్జిలు రాజబాబు,సుదర్శనం తదితర ఇన్చార్జిలు, ఎన్.ఎస్.ఎస్ వాలంటీర్లు పాల్గొని గాంధీజీకి నివాళులర్పించారు.

### బ్రహ్మకుమారిస్ ఆశ్రమంలో

# వైభవంగా విజయదశమి వేడుకలు



**కోరుకొండ విశ్వం వాయిస్ న్యూస్ :** ఓం శాంతి బ్రహ్మకుమారి పార్వతి ఆధ్వర్యంలో శరన్నవరాత్రి మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం శరన్నవరాత్రి మహోత్సవంలో భాగంగా తొమ్మిది రోజులు 9 దేవత మూర్తులుగా అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం శరన్నవరాత్రి మహోత్సవాలు ముగింపు సందర్భంగా చిన్నారులు వివిధ దేవత మూర్తుల వేషధారణ ధరించి, భక్తులకు కనువిందు చేశారు.అమ్మవారు మహిషాసుర మర్ధిని అవతారాలతో యుద్ధం చేసి, విజయదశమి రోజున విజయం సాధించిందని అదేవిధంగా అర్జునుడు జమ్మిచెట్టుపై గాండీవం దాచిపెట్టి, విజయదశమి రోజున పూజచేసి ఆయుధాలు స్వీకరించారన్నారు. విజయదశమి రోజున ఏ కార్యం చేపట్టిన, అమ్మ ఆశీస్సులతో తప్పక విజయం సిద్ధిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మకుమారి ఆశ్రమ నిర్వాహకులు రాజు, వరలక్ష్మి, భక్తులు పాల్గొన్నారు.

### బాలాత్రిపురసుందరి, శ్రీ సోమాలమ్మతల్లి ఆలయాలను

# దర్శించుకున్న పిల్లి సుబ్రహ్మణ్యం





**రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** విజయదశమి సందర్భంగా బాలా త్రిపుర సుందరి, శ్రీ సోమాలమ్మ తల్లి,శ్రీ రామదుర్గ ఆలయాలను సందర్శించిన రాష్ట్ర శెట్టిబలిజ సంక్షేమ సంఘం నాయకులు పిల్లి సుబ్రహ్మణ్యం. స్థానిక కొత్తపేటలో బాలాత్రిపుర సుందరి అమ్మవారి ఆలయ కమిటీ కోరిక మేరకు ఆలయాన్ని రాష్ట్ర శెట్టిబలిజ సంక్షేమ సంఘం నాయకులు పిల్లి సుబ్రహ్మణ్యం సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు ఆయనకు స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన భక్తులకు, ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ కొత్తపేటలో వేపచెట్టు, రావిచెట్టు కలసి పెరిగిన ప్రాంతంలో శ్రీ బాలా త్రిపుర సుందరి అమ్మవారు వెలసినందుకు మహిమాన్వితమైన తల్లి అని కోరిన కోర్కెలు తీర్చే శక్తి ఉన్న అమ్మవారని అన్నారు. గత ఇరవై ఆరు సంవత్సరాలుగా ఈ ఆలయంలో విజయదశమి వేడుకలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తపేట రాజా, గుడివాడ వెంకటేశ్వర రావు, శాసిపిల్లి హరిక్రిష్ణ, సిరికి రవి, కిలాడి శ్రీను, సంసాని కిట్టు, సానబోయిన గోవిందు, గిరజాల బుల్లి, అంబల రమణ, సోనా రాజు, అప్పారావు, యేసు, కొత్తపేట ఫ్రెండ్స్ సర్కిల్ సభ్యులు పాల్గొన్నారు.

# జీఎస్టీ తగ్గింపు వల్ల పేద, మధ్యతరగతి ప్రజలకు భారీ ఊరట..

### అవగాహన సదస్సులో చైర్మన్ కుడుపూడి సత్తిబాబు స్పష్టీకరణ



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్:** కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గించడం ద్వారా పేద, మధ్య తరగతి ప్రజలకు భారీ ఊరట లభించిందని రాష్ట్ర శెట్టి బలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు స్పష్టం చేశారు.శుక్రవారం స్థానిక సుబ్బారావు పేటలో ఏర్పాటు చేసిన జీఎస్టీ అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఇప్పటి వరకు 4 శ్లాబులలో ఉన్న జీఎస్టీ ని 2 శ్లాబులకు తగ్గించడం వల్ల సామాన్య ప్రజలకు ఎంతో మేలు జరిగిందని చెప్పారు. ప్రస్తుతం 12శాతం శ్లాబులో ఉన్న 99 వస్తువులు 5 శాతం శ్లాబులోకి వచ్చాయని అలాగే 28శాతం శ్లాబులో ఉన్న వస్తువులు 18 శాతం శ్లాబులోకి రావడం వల్ల తక్కువ రేటుకే నిత్య అవసర సరుకులు దొరుకుతున్నాయని వివరించారు.ఈ క్రమంలో బియ్యం,గోధుమలు, పప్పులు,తాజా కూరగాయలు,పండ్లు, జీరో శాతం జీఎస్టీ లోకి వచ్చి వినియోగదారులకు ఎంతో మేలు చేకూరుస్తు న్నాయని తెలిపారు. పాలు,పెరుగు,బ్రాండెడ్ బియ్యం, గోధుమపిండి, నెయ్యి వంటి ప్యాక్ చేయబడిన వస్తువులపై జీఎస్టీ 5 శాతం తగ్గిందని చెప్పారు.తగ్గిన పన్ను విషయంపై అవగాహన పొందాలని,కోరారు. ఆరోగ్యం, విద్య, ఆరోగ్య సంరక్షణ సేవలపై పన్ను లేకుండా చాలా తక్కువ రేటుకు లభిస్తాయని పేర్కొన్నారు. ఔషధాలు 12 శాతం నుంచి 5 శాతానికి,లేదా సున్నా శాతానికి తగ్గాయని చెప్పారు. అలాగే దుస్తుల ధరలు మరింత అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ కృషి వల్ల జీఎస్టీ తగ్గింపు జరిగిందని గుర్తు చేశారు. ఈ సందర్భంగా తగ్గిన జీఎస్టీ పై రూపొందించిన కరపత్రాలను ఆవిష్కరించి, వాటిని ఇంటింటికి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు బొమ్మనమైన శ్రీనివాస్, నక్కా చిట్టిబాబు, జక్కంపూడి అర్జున్, కొండపల్లి శ్రీదేవి, గూటాల సంజీవరావు, గుత్తుల రమేష్, యాళ్ళ శ్రీనివాస్, వేణుగోపాల కృష్ణ, పెందుర్తి నాగమణి తదితరులు పాల్గొన్నారు.

# ఎడిటర్ వాయిస్

## జీవవైవిధ్యంతోనే మానవ మనుగడ

పాతరాతి యుగం నుంచి నేటి వరకు కూడా ప్రపంచ మానవాళి ఆహారం, ఔషధాలు, గృహనిర్మాణం, ఇంధనం, వస్త్రాల కోసం వనాలపై లేదా అటవీ వృక్ష జంతుజాలాలపై ఆధారపడి ఉంటున్నాడు. ప్రకృతి సహజ అందాల విందులు ఆరబోస్తున్న అటవీ సంపద పర్యావరణ వ్యవస్థను కాపాడడం జరుగుతున్నప్పటికీ మానవ తప్పిదాలతో జంతువుల సంఖ్య తగ్గడం, జీవ వైవిధ్యానికి విఘాతం కలగడం జరుగుతున్నది. అన్ని రకాల వృక్ష జంతు జాతులతో మనిషి కలిసి స్నేహంగా జీవితాలను గడపని యెడల రాబోయే తరాలు భారీ మూల్యం చెల్లించాల్సి వస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. జంతు సంక్షేమ సమతుల్యత దెబ్బతినకుండా వాటిని రక్షించుకుంటూ, జీవవైవిధ్యానికి పట్టం కట్టవలసిన సమయం ఆసన్నమైనది. భూమిపై సహజంగా జీవితాలను గడుపుతున్న అనేక రకాల జీవరాసులను పరిరక్షించుకోని యెడల పలు జాతులు అంతరించే ప్రమాదంతో పాటు మానవ ఉనికి కూడా ప్రశ్నార్థకంగా మారుతుందని అందరం తెలుసుకోవాలి. మన పిల్లలకు అపార సంపదలను సంపాదించిపెట్టినప్పటికీ తాగడానికి చుక్క శుద్ధ నీరు, పోల్చడానికి పరిశుద్ధ గాలి లేనపుడు మనిషి వద్ద ఎన్ని ఉన్నా నిరర్థకమే అవుతాయని తెలుసుకోవాలి. పర్యావరణ వ్యవస్థను కాపాడడం, జీవ వైవిధ్యాలను సంరక్షించడం, సహజ ప్రక్రియలను నియంత్రించడం, మానవ జాతికి కనీస అవసరాలు తీర్చడం, సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను చేరడానికి వన్యప్రాణులు అమూల్య సేవలను అందిస్తున్నాయి. మనిషి అడక ముందే తనకు కావలసిన కనీస అవసరాలైన కూడు, గూడ, గుడ్డను ఇస్తున్న జంతువుల పరిరక్షణ అవసరాలను ప్రజల్లో ఏకరువు పెట్టడానికి, హెచ్చరికలు చేయడానికి "సెయింట్ ఫ్రాన్సిస్ ఆఫ్ అస్సిసీ ఫీస్ట్ డే" రోజు ప్రతి ఏట 04 అక్టోబర్ "ప్రపంచ జంతు సంక్షేమ దినోత్సవం లేదా వరల్డ్ ఆనిమల్ వెల్ఫేర్ డే" నిర్వహించడం జరుగుతున్నది. అడవుల్లో దాదాపు 60,000 వృక్ష జాతులు, 80 శాంతం ఉభయచర జాతులు, 75 శాతం పక్షి జాతులు ప్రపంచవ్యాప్త 1.6 మిలియన్ల ప్రజలకు నేరుగా నిత్యావసరాలను తీర్చుతున్నాయి. నేటి జీవజాతుల్లో దాదాపు ఒక్క మిలియన్ వరకు అంతరించే అంచున ఉన్నాయని భయంకర వాస్తవమే నిజమైతే మానవ శాంతియుత జీవనం బుగ్గిపాలు కావడం తప్పనిసరి. భూమిని, భూగ్రహంపై సహజంగా జీవిస్తున్న జీవరాశులను కాపాడకపోవడం మన కనీస కర్తవ్యం అని తెలుపులతో పాటు జీవవైవిధ్య పరిరక్షణకు అవసర నిధులు కూడా సహకరించడం ప్రధాన అంశమని ఐరాస పేర్కొంటున్నది. ప్రపంచ సగం జిడిపీ ప్రకృతి సంపద మీదనే ఆధారపడి ఉంటున్నది. జీవవైవిధ్య పరిరక్షణకు లేవదా పునర్నిర్మాణానికి ప్రతి ఏట 143 బిలియన్ల డాలర్ల నిధులను ప్రపంచ దేశాలు అందిస్తున్నాయని, ఈ సత్కార్య నిర్వహణకు 824 బిలియన్ డాలర్లు అవసరం అవుతాయని, కనీసం ఏడాదికి 500 బిలియన్ డాలర్లు అయినా ప్రపంచ దేశాలు వెచ్చించాలని ఐరాస ప్రధాన కార్యదర్శి పేర్కొనడం విశేషం. "ఇంటర్నేషన్ ట్రేడ్ ఇన్ ఎండేంజర్డ్ స్పీసీస్ ఆఫ్ వైల్డ్ ఫానా అండ్ ఫ్లోరా" అనే సంస్థ 50వ వర్షికోత్సవం సందర్భంగా అంతర్జాతీయ స్థాయిలో జంతు సంక్షేమ కార్యాలు పటిష్ట పథకాలతో నడవాలి. ప్రపంచ జంతు సంక్షేమ దినం-2025 ఇతివృత్తంగా "జంతు సంరక్షణతో భూగృహ పరిరక్షణ (సేవ్ ఆనిమల్స్, సేవ్ ది ప్లానెట్)" అనబడే అంశాన్ని తీసుకున్నారు. ప్రపంచ మానవాళి ఆయురారోగ్యాలకు జీవవైవిధ్యంతో పాటు పర్యావరణ వ్యవస్థల సమతుల్యత అవసరం అవుతాయని, వీటి సాధనకు అవసరమైన ఆర్థిక నిధులు అందించారని ప్రపంచ దేశాలను, ముఖ్యంగా అభివృద్ధి చెందిన దేశాలను కోరడం జరుగుతున్నది. ప్రపంచ జంతు సంక్షేమ దినం వేదికగా ప్రజలకు అవగాహన కల్పించడం, వన్యప్రాణులను కాపాడే సంస్థలు లేదా వ్యక్తులను గుర్తించడం, ఆర్థిక నిధుల సేకరణ, ప్రభుత్వాల చొరవ, ప్రజల సహకారం, ఎన్జీవోల చొరవ లాంటి వి నిర్వహిస్తేనే వన్యప్రాణుల



ఎడిటర్ : కె. సునీల్‌కుమార్

# వామపక్ష భావజాలానికి ప్రతీక

తెలుగు సినీ పరిశ్రమలో తనదైన ముద్ర వేసుకున్న నిర్మాతగా, సామాజిక చైతన్యం కలిగిన ఆలోచనాపరుడిగా, వామపక్ష భావజాలానికి ప్రతినిధిగా నిలిచిన అరుదైన వ్యక్తి తమ్మారెడ్డి గోపాల కృష్ణమూర్తి. 1920 అక్టోబరు 4న కృష్ణా జిల్లా ముదినేపల్లి మండలం చినపాలపర్రులో తమ్మారెడ్డి వెంకటాద్రి, సౌభాగ్యమ్మ దంపతులకు జన్మించిన ఆయన చిన్ననాటి నుంచే సామాజిక అసమానతలు, అన్యాయాలు తనను కలచివేసేవి. స్వాతంత్ర్యోద్యమం, కమ్యూనిస్టు ఉద్యమాలు, ప్రజా సాహిత్యం, అభ్యుదయ భావజాలం ఆయన వ్యక్తిత్వాన్ని మలిచాయి. గోరా ప్రభావంతో మత మౌఢ్యాలపై విమర్శనాత్మక దృక్పథం పెంచుకున్న ఆయన మాలపల్లిలో సహపంక్తి భోజనాలు చేసి సామాజిక సమానత్వానికి బహిరంగ మద్దతు తెలిపాడు. విద్యార్థి దశలోనే కమ్యూనిస్టు పార్టీలో చేరి, స్వతంత్ర భారత్ పత్రిక వ్రాత. ప్రతులను గ్రామాల గుండా సర్క్యులేట్ చేస్తూ ప్రజల్లో చైతన్యం కలిగించారు. ప్రజానాట్య మండలి కార్యక్రమాలకు సైతం ఆయన విశేష మద్దతు అందించారు. ఆయన జీవనంలో ఒక విశేషం వితంతు వివాహం. ఆ కాలంలో సామాజికంగా వివాదాస్పదంగా భావించిన వితంతు వివాహాన్ని స్వయంగా 1945లో కృష్ణవేణిని వివాహం చేసుకోవడం ద్వారా సమాజానికి కొత్త మార్గాన్ని చూపారు. ఆయనకు ఇద్దరు కుమారులు %-% సినీ నిర్మాత, దర్శకుడిగా పేరు గాంచిన తమ్మారెడ్డి భరద్వాజ్, మరో కుమారుడు లెనిన్ బాబు దర్శకుడిగా నాలుగు చిత్రాలు తెరకెక్కించారు. జీవితాంతం ఎవరికీ భారమవ్వకూడదని భావించిన ఆయన చివరి రోజులు వృద్ధాశ్రమంలో గడిపి, 2013 సెప్టెంబరు 16న హైదరాబాద్‌లో కన్నుమూశారు. సినీరంగంలో ఆయన ప్రవేశం మద్రాసులో సినీ కళాకారుల పిల్లలకు ట్యూషన్ టీచర్‌గా పనిచేసిన కాలం నుంచే ఆరంభమైంది. తరువాత ప్రొడక్షన్ విభాగంలో అడుగుపెట్టి తాతినేని ప్రకాశరావు దర్శకత్వంలో రూపొందిన 'పల్లెటూరు' (1952) తొలి చిత్రం కాగా, 'రోజులు మారాయి' (1955) వంటి చిత్రాల్లోనూ ప్రొడక్షన్



ఎగ్జిక్యూటివ్‌గా పనిచేశారు. సారథి సంస్థలో చీఫ్ ఎగ్జిక్యూటివ్, జనరల్ మేనేజర్ పదవుల్లో పనిచేస్తూ అనేక చిత్రాల నిర్మాణంలో పాలుపంచు కున్నారు. సారథి స్టూడియో ఏర్పాటుకు ఆయన కీలక పాత్ర పోషించారు. సారథినే తన విశ్వ విద్యాలయంగా భావించిన ఆయన, 'ఏరువాక సాగారో' పాటకు వహీదా రెహమాన్‌ను తెరపైకి తీసుకురావడం ద్వారా తన దూరదృష్టిని ప్రదర్శించారు. 1962లో రవీంద్ర ఆర్ట్ పిక్చర్స్ పేరుతో స్వంత నిర్మాణ సంస్థను స్థాపించిన ఆయన, రెండు దశాబ్దాల కాలంలో లక్షాధికారి (1963), జమీందార్ (1966), బంగారు గాజులు (1968), ధర్మాదాత (1970), సిసింద్రీ చిట్టిబాబు (1971), దత్తపుత్రుడు (1972), డాక్టర్ బాబు (1973), చిన్ననాటి కలలు (1975), అమ్మ నాన్న (1976), లవ్ మ్యారేజ్ (1978), ఇద్దరు కొడుకులు (1982) వంటి పలు ప్రఖ్యాత చిత్రాలను నిర్మించారు. తెలుగు, తమిళ సినీ తారలతో ఆయన చేసిన చిత్రాలు కళాత్మకత, సామాజిక చైతన్యం కలగలిపినవిగా నిలిచాయి. జూబ్లీహిల్స్‌లో ఫిల్మ్‌నగర్ స్థాపనలో ఆయన ముందుండి కృషి చేశారు. నంది అవార్డుల కమిటీలో సభ్యుడిగానూ, ఛైర్మన్‌గానూ వ్యవహరించి, చిత్ర పరిశ్రమాభివృద్ధి సంస్థలోనూ సేవలందించారు. సినిమాను వాణిజ్య ప్రయోజనాలకే పరిమితం చేయకుండా, సమాజ మార్పుకు దోహదపడే సాధనంగా వాడాలని ఆయన విశ్వసించారు. అందుకే ఆయన నిర్మాణాల్లో ప్రజా సమస్యలు, సమానత్వ భావజాలం, వామపక్ష ఆలోచనలు ప్రతిబింబించాయి. మూఢనమ్మకాలు, మతాంధత, కులవివక్షలను ఆయన చిత్రాల ద్వారా, ప్రసంగాల ద్వారా ధిక్కరించారు. కళను ప్రజల ఆయుధంగా మార్చగల సామర్థ్యం ఉందని ఆయన నమ్మకం. అదే విశ్వాసం ఆయన చలనచిత్రాల వైభవంలో ప్రతిఫలించింది. తమ్మారెడ్డి గోపాల కృష్ణమూర్తి కృషికి గుర్తింపుగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2007లో రఘుపతి వెంకయ్య అవార్డును ప్రదానం చేసింది. బంగారు గాజులు చిత్రానికి నంది అవార్డు, ధర్మాదాత చిత్రానికి ఫిల్మ్‌ఫేర్ అవార్డు లభించాయి. జీవితాంతం ఆయన కొనసాగించిన హేతువాద ధోరణి, వామపక్ష చింతన, ప్రజాస్వామ్య నిబద్ధత ఆయనను ఒక ప్రత్యేకమైన సాంస్కృతిక వ్యక్తిత్వంగా నిలిపాయి. ఆయన వారసత్వం కేవలం సినిమాల్లోనే కాకుండా తెలుగు సమాజంలోనూ సజీవంగా ఉంది. ఆయన చూపిన విలువలు, ఆయన నిలబెట్టిన హేతువాద%-%వామపక్ష దృక్పథం నేటికీ కొత్త తరాలను ప్రభావితం చేస్తున్నాయి. తమ్మారెడ్డి గోపాల కృష్ణమూర్తి జీవితం కళను ప్రజల కోసం అంకితం చేయవచ్చని, సమాజ మార్పు కోసం సృజనాత్మకతను ఆయుధంగా మలచవచ్చని సాక్షాత్కారంగా నిరూపించింది. ఆయన తెలుగు చలనచిత్ర చరిత్రలోనే కాకుండా ప్రజాస్వామ్య చరిత్రలోనూ చిరస్మరణీయుడు.

# అంతరిక్ష రంగంలో భారత్ ఘనత

ప్రపంచవ్యాప్తంగా 04 నుంచి 10 అక్టోబర్ వరకు "ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలు" లేదా "వరల్డ్ స్పేస్ వీక్" వేడుకలను ఘనంగా నిర్వహించుకుంటున్న శుభ సందర్భంగా ప్రపంచ మానవాళి, ముఖ్యంగా విద్యాలయాల్లో చదువుకుంటున్న విద్యార్థినీవిద్యార్థులు, యువతరం రేపటి అంతరిక్ష ఘన చరిత్రకు నేడు గట్టి పునాదులు వేయడానికి యువత పూనుకోవాలి. 04 అక్టోబర్ 1957 రోజున మానవ నిర్మిత తొలి ఉపగ్రహం 'స్పుత్నిక్-1' అంతరిక్ష కక్షలోకి ప్రవేశపెట్ట బడింది. అదే విధంగా 10 అక్టోబర్ 1967 రోజున ఐరాస చొరవతో అంతరిక్ష పరిశోధనలతో శాంతి స్థాపనకు మాత్రమే కృషి చేయాలని తీర్మానం చేయడం జరిగింది. ఈ రెండు చారిత్రాత్మక అంతరిక్ష ఘటనలకు గుర్తుగా 04 నుంచి 10 అక్టోబర్ వరకు ఈ వారోత్సవాలు పాటించడం ఆనవాయితీగా మారింది. ప్రపంచ అంతరిక్ష వారోత్సవాల్లో భాగంగా భారతదేశవ్యాప్తంగా డాక్టర్ సచిన్ బాంబా నేతృత్వంలో విద్యాలయాల్లో యువతకు అంతరిక్ష శాస్త్రం పట్ల అవగాహన కలిపిస్తూ భవిష్యత్తులో వారు అంతరిక్ష రంగాన్ని కెరీర్‌గా తీసుకునే విధంగా ప్రేరణ కల్పించడానికి కృషి జరుగుతున్నది. ప్రపంచ అంతరిక్ష వారోత్సవాల వేదికగా మన ఇస్రో సాధించిన ఘనకార్యాలను నేటి యువతకు వివరించడం, భారత అంతరిక్ష టెక్నాలజీలో వస్తున్న పెను ఆధునిక మార్పులను ఎక్కువుగా పెట్టడం, నేటి యువ తరాన్ని అంతరిక్ష రంగం వైపుకు ఆకర్షించడం, అంతరిక్ష రంగంలో వస్తున్న టెక్నాలజీ మార్పులను ఆసక్తికరంగా ప్రయోగ పూర్వకంగా వివరించడం లాంటి కార్యక్రమాలను నిర్వహించడం ఉచితంగా ఉంటుంది. భారతీయ యువతను 'స్టెమ్' కోర్సుల వైపు ఆకర్షించడానికి "స్పేస్ ఆన్ వీల్స్", "స్పేస్ ట్యూటర్స్"లను వినియోగించడం, అంతరిక్ష ఆవిష్కరణ గూర్చి విడమర్చి తెలుపడం, జాతీయ అభివృద్ధితో పాటు సమైక్యతను సాధించడం, విద్యాలయాల్లో అంతరిక్ష అంశాల్లో పలు పోటీలను నిర్వహించడం లాంటివి నిర్వహించాలి.



2025 ప్రపంచ అంతరిక్ష వారోత్సవాల ఇతివృత్తంగా "అంతరిక్షంలో ఆవాసం" లేదా "లివింగ్ ఇన్ స్పేస్" అనబడే అంశాన్ని తీసుకొని వివరించడం కొనసాగుతున్నది. సాంప్రదాయ ఖగోళ శాస్త్రంతో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అనుసంధానం చేస్తూ ముందుకు సాగడం ముఖ్యమని కూడా అవగాహన కల్పించడం జరుగుతోంది. అంతరిక్ష శాస్త్రం పట్ల యువత దృష్టిని ఆకర్షిస్తూ, వారిని అంతరిక్ష కోర్సుల వైపు మరల్చడం అనే ప్రధాన ఉద్దేశంతో పలు కార్యక్రమాలను పాఠశాలలు, కళాశాలల్లో నిర్వహించడం నేటి అవసరంగా భావించాలి. ఇస్రో శాస్త్రవేత్తలతో ముఖాముఖి, ప్లానిటోరియం సందర్శనం, శాస్త్రజ్ఞులతో ప్రసంగాలు, అంతరిక్ష అంశాల్లో పోటీలు, శుభాంశ్ శుక్లా లాంటి వ్యోమగాములతో ప్రసంగాలు లాంటివని ఏర్పాటు చేయడం వల్ల మంచి ఆశించిన ఫలితాలు సిద్ధిస్తాయని నమ్మాలి. మన ప్రతిష్టాత్మక ఇస్రో విభాగం మన జాతి గౌరవవేతనం చిహ్నంగా ప్రస్తుతించాలి. భారత అంతరిక్ష పరిశోధనలతో మానవాళికి ఎనలేని ప్రయోజనాలు ఒనగూరుతాయని తెలుసుకోవాలి. కమ్యునికేషన్స్, వాతావరణ మార్పులు, విపత్తుల ముందస్తు అంచనాలు, టెలివిజన్ ప్రసారాలు, వ్యవసాయరంగ ప్రయోజనాలు, విపత్తు నివారణ చర్యలకు ఉపక్రమించడం, దేశ ఆర్థికాభివృద్ధి, జీవన ప్రమాణాలు పెరగడం, స్మార్ట్‌ఫోన్,/ఆన్‌లైన్ లాంటి అనువర్తనాలను కలిగిస్తున్న ఇస్రో సేవలకు కృతజ్ఞతలు తెలియజేద్దాం, అంతరిక్ష శాస్త్రవేత్తలకు సలాం కొడదాం.

# జీవవైవిధ్య పరిరక్షణలో వన్యప్రాణులు

పాతరాతి యుగం నుంచి నేటి వరకు కూడా ప్రపంచ మానవాళి ఆహారం, ఔషధాలు, గృహనిర్మాణం, ఇంధనం, వస్త్రాల కోసం వనాలపై లేదా అటవీ వృక్ష జంతుజాలాలపై ఆధారపడి ఉంటున్నాడు. ప్రకృతి సహజ అందాల విందులు ఆరబోస్తున్న అటవీ సంపద పర్యావరణ వ్యవస్థను కాపాడడం జరుగుతున్నప్పటికీ మానవ తప్పిదాలతో వన్యప్రాణుల సంఖ్య తగ్గడం, జీవ వైవిధ్యానికి విఘాతం కలగడం జరుగుతున్నది. అన్ని రకాల వృక్ష జంతు జాతులతో మనిషి కలిసి స్నేహంగా జీవితాలను గడపని యెడల రాబోయే తరాలు భారీ మూల్యం చెల్లించాల్సి వస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. వన్యప్రాణుల సమతుల్యత దెబ్బతినకుండా వాటిని రక్షించుకుంటూ, జీవవైవిధ్యానికి పట్టం కట్టవలసిన సమయం ఆసన్నమైనది. భూమిపై సహజంగా జీవితాలను గడుపుతున్న అనేక రకాల జీవరాసులను పరిరక్షించుకోనిఎడల పలు జాతులు అంతరించే ప్రమాదంతో పాటు మానవ ఉనికి కూడా ప్రశ్నార్థకంగా మారుతుందని అందరం తెలుసుకోవాలి. మన పిల్లలకు అపార సంపదలను సంపాదించిపెట్టినప్పటికీ తాగడానికి చుక్క శుద్ధ నీరు, పోల్చడానికి పరిశుద్ధ గాలి లేనపుడు మనిషి వద్ద ఎన్ని ఉన్నా నిరర్థకమే అవుతాయని తెలుసుకోవాలి. పర్యావరణ వ్యవస్థను కాపాడడం, జీవ వైవిధ్యాలను సంరక్షించడం, సహజ ప్రక్రియలను నియంత్రించడం, మానవ జాతికి కనీస అవసరాలు తీర్చడం, సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను చేరడానికి వన్యప్రాణులు అమూల్య సేవలను అందిస్తున్నాయి. మనిషి అడక ముందే కూడు, గూడ, గుడ్డను ఇస్తున్న వన్యప్రాణుల పరిరక్షణ అవసరాలను ప్రజల్లో ఏకరువు పెట్టడానికి, హెచ్చరికలు చేయడానికి ప్రతి ఏట 02 -08 అక్టోబర్ "జాతీయ వన్యప్రాణి వారోత్సవాలు" లేదా నేషనల్ వైల్డ్‌లైఫ్ వీక్" నిర్వహించడం జరుగుతున్నది. అడవుల్లో దాదాపు 60,000 వృక్ష జాతులు, 80 శాంతం ఉభయచర జాతులు, 75 శాతం పక్షి జాతులు ప్రపంచవ్యాప్త 1.6 మిలియన్ల ప్రజలకు నేరుగా నిత్యావసరాలను తీర్చుతున్నాయి. నేటి జీవజాతుల్లో దాదాపు ఒక్క మిలియన్ వరకు అంతరించే అంచున ఉన్నాయని భయంకర వాస్తవమే నిజమైతే మానవ శాంతియుత జీవనం బుగ్గిపాలు కావడం తప్పనిసరి. భూమిని, భూగ్రహంపై సహజంగా జీవిస్తున్న జీవరాశులను కాపాడకపోవడం మన కనీస కర్తవ్యం అని తెలుపులతో పాటు జీవవైవిధ్య పరిరక్షణకు అవసర నిధులు కూడా సహకరించడం ప్రధాన అంశమని ఐరాస పేర్కొంటున్నది. ప్రపంచ సగం జిడిపీ ప్రకృతి సంపద మీదనే ఆధారపడి ఉంటున్నది. జీవవైవిధ్య పరిరక్షణకు లేవదా పునర్నిర్మాణానికి ప్రతి ఏట 143 బిలియన్ల డాలర్ల నిధులను ప్రపంచ దేశాలు అందిస్తున్నాయని, ఈ సత్కార్య నిర్వహణకు 824 బిలియన్ డాలర్లు అవసరం అవుతాయని, కనీసం ఏడాదికి 500 బిలియన్ డాలర్లు అయినా ప్రపంచ దేశాలు వెచ్చించాలని ఐరాస ప్రధాన కార్యదర్శి పేర్కొనడం విశేషం. భారతీయ "డిపార్ట్‌మెంట్ ఆఫ్ మ్యూజియమ్స్ అండ్ జూస్" అనే సంస్థ జాతీయ స్థాయిలో వన్యప్రాణుల పరిరక్షణ కార్యాలు పటిష్ట పథకాలతో నడవాలి. భారత ప్రజలు, భూగోళం పరిరక్షణకు పెట్టుబడులు పెట్టడానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. దేశ జనాభా ఆయురారోగ్యాలకు జీవవైవిధ్యంతో పాటు పర్యావరణ వ్యవస్థల సమతుల్యత అవసరం అవుతాయని, వీటి సాధనకు అవసరమైన ఆర్థిక నిధులు అందించాలని కోరడం జరుగుతున్నది. జాతీయ వన్యప్రాణి వారోత్సవాల వేదికగా ప్రజలకు అవగాహన కల్పించడం, వన్యప్రాణులను కాపాడే సంస్థలు లేదా వ్యక్తులను గుర్తించడం, ఆర్థిక నిధుల సేకరణ, ప్రభుత్వాల చొరవ, ప్రజల సహకారం, ఎన్జీవోల చొరవ లాంటి వి నిర్వహిస్తేనే వన్యప్రాణుల పరిరక్షణ ఆవశ్యతకతను వివరించే కార్యశాలలు, సెమినార్లు, ఆన్‌లైన్ లేదా ఆఫ్-లైన్ అవగాహనలు, నిధుల సేకరణ కార్యక్రమాలు, ప్రపంచ దేశాల సమన్వయ సహకారాలు, విజ్ఞాన వితరణలు లాంటివి నిర్వహించడం మంచిది. పర్యావరణ సమతుల్యతకు గొడుగు పట్టడం, జీవవైవిధ్యానికి ఊపిరులూదడం, సహజ అందాలను ఆస్వాదిస్తూ కాపాడుకోవడం లాంటివి నిరంతరం కొనసాగాలి. జీవవైవిధ్య పరిరక్షణతో ఆహార భద్రత, ఔషధాల లభ్యత, శుద్ధ జలాలు/పీల్చే గాలులు, వాతావరణ సానుకూల మార్పులు సమకూరుతాయి. ఈ విషయాలను నేటి మనిషి పెడచెవిన పెట్టి విధ్వంసానికి పాలుపడితే రేపటి తరం మనుగడ ప్రశ్నార్థకం అవుతుందని, మనం కూర్చున్నా కొమ్మను మనమే నరుక్కోవద్దని గుణపాఠం నేర్చుకోవడంతో పాటు జీవవైవిధ్య దీపం ఉండగానే భూగృహాన్ని లేదా ఇల్లును చక్కదిద్దుకుందాం.



### వాహన మిత్ర పథకం ద్వారా

# లబ్ధిదారుల ఖాతాలకు నగదు జమ

**ఆటో టాక్సీ మ్యాక్సీ క్యాబ్ డ్రైవర్లకు - సంవత్సరానికి 15000 ఆర్థిక సహాయం**

**జిల్లావ్యాప్తంగా 7709 మంది లబ్ధిదారులు - కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్**



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం ఆటో డ్రైవర్ల సేవలో పథకం పేరిట ఆటో, టాక్సీ, మ్యాక్సీ క్యాబ్ డ్రైవర్ల కోసం ప్రతి సంవత్సరం రూ.15,000 ఆర్థిక సహాయం ప్రకటిం చిందని ఈ మేరకు ఈ నెల 4వ తేదీ రాష్ట్ర ముఖ్యమంత్రి నిధులను ప్రత్యక్ష నగదు బదిలీ విధానంలో నేరుగా ఆటో డ్రైవర్ల బ్యాంకు ఖాతా కు జమ చేస్తారని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ నుండి మండల స్థాయి వరకు వీడియో కాన్ఫరెన్స్ ఎంపీడీవోలు తాసిల్దార్లు మండల నియోజకవర్గ ప్రత్యేక అధికారులతో నిర్వహించి ఆటో డ్రైవర్ల సేవలో పథకం విధి విధానాలపై దిశా నిర్దే శం చేశారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 7,709 మంది 15 వేల రూపాయలు చొప్పున లబ్ధి పొందనున్నా న్నారు సంవత్సరానికి ఒక్కసారి రూ.15,000 నేరుగా లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో జమచేస్తారన్నారు. పథకం ద్వారా ఆటో, టాక్సీ, మ్యాక్సీ క్యాబ్స్‌తో జీవనం సాగిస్తున్న డ్రైవర్లు ప్రయో జనం పొందుతార న్నారుఈ సాయం ప్రధానం గా వాహన నిర్వహణ ఖర్చులు, తిరుగుబాటు ఖర్చులు, బీమా, రిపేర్, ఫిట్‌నెస్ వంటి అవసరాలకు ఉపయోగించు కోవచ్చునన్నారు. డ్రైవర్ అదే వాహనం యజమాని అయి ఉండాలనీ మరియు వాహనం ఆంధ్రప్రదేశ్‌లో రిజిస్టర్ అయి ఉండాలన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరన్నారు. ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఆధార్ కార్డు, వైట్ రేషన్ కార్డు ఉండాలన్నారు ఒక్క కుటుంబానికి ఒకే వాహనానికి అర్హత ఉంటుందన్నారు. ఆదాయ పన్ను ఉండరాద న్నారు. ప్రభుత్వ ఉద్యోగి, పెన్షన్‌దారులు కాకూడదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన ఆటో డ్రైవర్లు సేవలో పథ కం కింద డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వ్యాప్తంగా మొత్తం 7,709 మంది ఆటో డ్రైవర్లుకు . ఒక్కొ క్క ఆటో డ్రైవర్‌కు రూ.15, 000 చొప్పున నేరుగా వారి బ్యాంకు ఖాతాకు ప్రత్యక్ష నగదు బదిలీ ద్వారా జమ చేయబడుతుందన్నారు, జిల్లాలో మొత్తం రూ.11 కోట్ల,56 లక్షల 35 వేల మేర ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు ఆయన తెలిపారు.ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అమరావతి నుంచి ప్రారంభించి ఆటో డ్రైవర్లు ఖాతాలో జమ చేయడం జరుగుతోందని వెల్లడించారు. జిల్లాస్థాయి లో కలెక్టరేట్ నందు గోదావరి భవన్లో ఆటో డ్రైవర్ల సేవా పథకం ఈనెల 4వ తేదీ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమం లో జిల్లా రవాణా అధికారి దేవుశెట్టి శ్రీనివాసరావు, జి ఎస్ డబ్ల్యూ ఎస్ కోఆర్డినే టర్ సువిజయ్ తదితరులు పాల్గొన్నారు

### డిగ్రీ కళాశాల సాధించిన

# ఎమ్మెల్యే ఆనందరావును సత్కరించిన దళిత ఐక్యవేదిక



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** అమలాపురంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుకు అవిరామంగా కృషిచేసి పేద వర్గాల విద్యార్థుల అభ్యున్నతి కొరకు పట్టుదలతో డిగ్రీ కళాశాల సాధించిన అమలాపురం శాసనసభ్యులు అయితా బత్తుల ఆనందరావు అహర్నిశలు అమలాపురం అభివృద్ధికి పాటుపడుతున్నారని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా దళిత ఐక్యవేదిక నాయకులు ఆయన కృషిని కొనియాడారు ఎమ్మెల్యే ఆనందరావు సాధించిన డిగ్రీ కళాశాల పేద విద్యార్థులకు వరంగా మారిందని పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థులందరికీ ఉపయోగపడుతుందని తెలిపారు. శుక్రవారం ఎమ్మెల్యే ఆనందరావు అభినందిస్తూ దళిత ఐక్యవేదిక ఆధ్వర్యంలో దుస్సాలువా కప్పి ఘనంగా సత్కరించారు ఈ సందర్భంగా జిల్లా దళిత ఐక్యవేదిక చైర్మన్ డిబి లోక్ మాట్లాడుతూ విద్య యొక్క విలువ తెలిసిన ఎమ్మెల్యే ఆనందరావు పేద విద్యార్థులకు ఉన్నత విద్య కల్పించడానికి నియోజకవర్గ ప్రజల చిరకాల వాంఛ అయిన ప్రభుత్వ డిగ్రీ కళాశాలను అమలాపురంలో ఏర్పాటు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు అమలాపురంలో అన్ని విధాల అభివృద్ధి చేయాలనే దృక్పథంతో అన్ని వర్గాలను కలుపుకొని అభివృద్ధి సాధకుడుగా ఎమ్మెల్యే ఆనందరావు ముందుకు వెళు తున్నారని అభినందిస్తూ అశోక విజయదశమి సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు అభివృద్ధి సాధనలో ఆయన చేస్తున్న కృషికి దళిత ఐక్యవేదిక ఎల్లప్పుడూ అండగా ఉంటుందని పేద వర్గాలకు విద్య వైద్య రంగాలను ప్రజలకు మరింత చేరువ చేయాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా దళిత ఐక్యవేదిక చైర్మన్ డిబి లోక్ కన్వీనర్ జంగా బాబురావు కార్యదర్శి ఇసుకపట్ల రఘుబాబు కోకన్వీనర్ పిడిఎస్‌యు విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు రేవు తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

### బడుగువానిలంకలో

# మళ్లీ మొదలైన నదీ కోత

### గ్రోయిన్స్‌కు గండి పడింది - అక్టోబరులోనూ వెంటాడుతున్న వరదలు



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** ఎప్పుడు వరదలు వచ్చినా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం బడుగువానిలంక గ్రామం పైనే ప్రధానంగా ప్రభావం చూపుతుంది. ఇక్కడ శ్రేష్టమైన లంక భూములు నదీ గర్భంలో కలిసిపోతుంటాయి. ఇప్పటివరకు అలా నదిలో కొట్టుకుపోయిన భూములు ఈ ఒక్క గ్రామంలోనే సుమారు 800 ఎకరాలు ఉన్నాయంటే ఆశ్చర్యం కలగక మానదు. అయితే వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో 2006లో ఈ గ్రామంలో నదీకోత అధికంగా ఉండే చోట గ్రోయన్స్(నీటి వేగాన్ని అడ్డుకునేది),రివిట్మెంట్ నిర్మించారు. అప్పటినుంచి ఆ ప్రాంతంలో నది కోత తగ్గింది. అయితే ఈ రివిట్మెంటు లేని ప్రాంతాల్లో కోతకు గురవుతుంది.దీంతో రెండేళ్ళ క్రితం రిలయన్స్ గ్యాస్ పైపు లైన్ సంస్థ వారు సుమారు రూ 42 కోట్లతో మరి కొంతమేర రీవిట్మెంట్ పనులు చేపట్టారు. అయితే గత మూడు రోజులుగా ఈ కొత్త పాత రివెట్మెంట్లు మధ్యన కోత మొదలైంది. పాత రెవిట్మెంట్ కు గండిపడి పొలాల్లోకి చొచ్చుకు పోతుంది. బర్మా సొసైటీ(రెడ్లు లంక) కు చెందిన రెండు చోట్ల ఇప్పుడు నదీ కోత విపరీతంగా ఉంది. కేవలం ఈ మూడు రోజుల వ్యవధిలోనే అరటి,దొండ, గులాబీ వంటి పంటలతో ఉన్న ఈ భూములు కళ్ళముందే కొట్టిపోతుంటే రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇదిలా కొనసాగితే లంక భూములు తర్వాత జిరాయితీ భూములతో పాటు బడుగువానిలంక గ్రామానికి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. అందుకనే వరద తగ్గుముఖం పట్టిన తర్వాత ఈ ప్రదేశంలో మళ్లీ రివిట్మెంట్ పనులు చేపట్టాలని రైతులు,గ్రామస్థులు కోరుతున్నారు. ఈ ఏడాది అక్టోబర్ మొదటివారంలో కూడా వరదలు కొనసాగడం ఆశ్చర్యం కలిగిస్తుంది. ఎందుకంటే జూలైలో ప్రారంభమయ్యే వరద నీరు సెప్టెంబర్ మూడో వారానికి పూర్తిగా తగ్గుముఖపడుతుంది. ఒక్కొక్క సందర్భంలో నీరు తెల్లబడిపోవడం కూడా జరుగుతుంది. కాని ఈ ఏడాది మూడవ ప్రమాద స్థాయికి వరద నీరు చేరుకోలేదు కాని ఒకటి,రెండు ప్రమాద హెచ్చరికల స్థాయిలోనే రోజులు తరబడి ఉండిపోయింది.శుక్రవారం కూడా ధవళేశ్వరం బ్యారేజి వద్ద 11.50 అడుగుల నీటిమట్టం ఉంది. తొమ్మిది లక్షల 41 వెల 775 క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి వదిలి పెట్టారు.ఈ ఏడాది సరాసరిన రోజుకు ఎనిమిది లక్షల క్యూసెక్కుల నీటిని ఆగష్టు మూడవ వారం నుండి ఇప్పటి వరకూ సముద్రంలోకి వదిలిపెడుతూనే ఉన్నారు. ఇలా ఇన్ని రోజులు పాటు నిండు గోదావరి ప్రవహించిన సందర్భాలు చాలా అరుదుగా ఉన్నాయని చెప్పవచ్చు.అందుకునే ఈ రివెట్మెంట్ వద్ద ఊబ ఏర్పడి గండి కొట్టేసి ఉంటుందని రైతులు వాపోతున్నారు.

### దళితులపై జరుగుతున్న దాడులకు

# ప్రభుత్వమే బాధ్యత వహించాలి

### దళిత చైతన్య వేదిక రాజోలు



**రాజోలు, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్ర వ్యాప్తంగా దళితులపై జరుగుతున్న దాడులకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని దళిత చైతన్య వేదిక నాయకులు డిమాండ్ చేశారు.ఈ మేరకు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమజిల్లా రాజోలు మండలం తాటిపాక పంచాయతీ రోడ్డులో దళిత చైతన్య వేదిక అత్యవసర కార్యవర్గ సమావేశం మండల అధ్యక్షులు మందపాటి మధు అధ్యక్షతన జరిగింది.ఈ సమావేశంలో పాల్గొన్న వేదిక జిల్లా అధ్యక్షులు లిఖితపూడి బుజ్జి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా దళితులపై దాడులు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మదురుపూడి ఎయిర్ పోర్ట్ రోడ్డు సమీపంలో గాడాల గ్రామంలో దళిత యువకుడిపై హత్యాయత్నానికి ప్రయత్నించిన కుల దురహంకారులను వెంటనే అరెస్టు చేసి రిమాండ్ కు పంపించాలని,దళిత చైతన్య వేదిక నాయకులు ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు తెలిపారు.దళితులపై జరుగుతున్న దాడులపై కఠినమైన చర్యలు తీసుకోకుండా సంబంధిత అధికారులు ఉదాసీనంగా వ్యవహరించడం వల్లే దళితులపై దాడులు పునరావృతం అవ్వుతున్నాయని దళిత చైతన్య వేదిక నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. చిత్తూరు జిల్లా దేవళ్ళం పేటలో భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని దగ్ధం చేసిన సంఘటనపై దళిత చైతన్య వేదిక నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సంఘటనపై సీబీఐ చేత దర్యాప్తు చేయించి సంబంధిత దోషులను వెంటనే అరెస్టు చేయ్యాలన్నారు. ఈ కార్యక్రమంలో దళిత చైతన్య వేదిక వ్యవస్థాపకులు బత్తుల మురలీకృష్ణ, ఉపాధ్యక్షులు చిలకపాటి శ్రీధర్,రాష్ట్ర కోఆర్డినేటర్ చింతా శ్రీనివాస్ సభ్యులు పొన్నమాటి భాస్కర్, గోగి మోహన్, కారుపల్లి గోపాలం, బొడ్డపల్లి ప్రసాద్, బుంగ శ్రీనివాస్, చొప్పల ప్రసాద్, ఇంజేటి రాము, కడలి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### శ్రీ అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠలో

# పాల్గొన్న ఎమ్మెల్యే వేగుళ్ళ



**మండపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** మండపేట పట్టణంలోని 23వ వార్డులో వాణిమహాల్ సెంటర్ వద్ద శుక్రవారం జరిగిన శ్రీ అభయాంజనేయస్వామి వారి విగ్రహ ప్రతిష్ఠ కార్యాక్రమంలో రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.స్వామి వారికి ఎమ్మెల్యే వేగుళ్ల ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆ స్వామివారి కటాక్షాలు ప్రజల అందరి మీద కరుణించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ చుండ్రు శ్రీవర ప్రకాష్, జొన్నపల్లి సూర్యారావు, గడి రాంబాబు, బోరింగ్ పిల్లర్స్, రాడ్ బైండింగ్ వర్కర్స్ తదితరులు పాల్గొన్నారు.

# అభయాంజనేయ స్వామి విగ్రహం ఏర్పాటు



**అంబాజీపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** అంబాజీపేట మండలం ముక్కామల గ్రామంలో శ్రీశ్రీశ్రీ లంకాలమ్మ తల్లి మినీగూడ్స్ ఆటో యూనియన్ వారి ఆధ్వర్యంలో శుక్రవారం సొసైటీ వద్ద శ్రీ అభయాంజనేయ స్వామి విగ్రహాన్ని బండారు మల్లిబాబు ప్రారంభోత్సవం చేయడం జరిగినది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దసరా మహోత్సవాలలో భాగంగా అభయ ఆంజనేయ స్వామి విగ్రహాన్ని ప్రతిష్టించడం శుభ పరిణామం అని అన్నారు. అనంతరం భక్తులకు అఖండ అన్న సమాధాన ఏర్పాటు చేశారు.

# నూతన ఉపాధ్యాయులకు సత్కారం



**ఆత్రేయపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం ర్యాలి అన్నపూర్ణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నూతనంగా ఎంపిక కాబడిన ఉపాధ్యాయులు ఆకాశం సూర్య ప్రకాష్, మణి కుమారి,హిమ బిందు, దుర్గ దేవి, మౌనిక లను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ సూర్య చంద్ర రావు, డాక్టర్ గౌరీష్ బాబు, డాక్టర్ మోహిత్ కృష్ణ, డాక్టర్ సీత,శ్యామ్ జాదూగర్, అన్నపూర్ణ, తేజ శ్రీలు పాల్గొన్నారు.

# చమురు సంస్థల ద్వారా నిరుద్యోగభృతి ఇవ్వాలి

### ఎమ్మెల్సీ కుడిపూడి డిమాండ్



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** గోదావరి బేసిన్ పరిధిలో ఓఎన్జిసి, గెయిల్, రిలయన్స్ చమురు సంస్థలు కోనసీమ ప్రాంతంలో వేలాది కోట్లు విలువగల నిక్షేపాలను వేలాది కోట్లు విలువగల నిక్షేపాలను తరలించకపోతున్నారని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్య నారాయణ అన్నారు. అమలాపురంలో మీడియాతో శుక్రవారం మాట్లాడుతూ 1989 లో నూతన గ్యాస్ పాలసీ అమల్లోకి వచ్చిందన్నారు. అయినప్పటికీ కోనసీమ ప్రాంతంలో నిక్షేపాలను తరలించకపోతున్నా రాష్ట్ర ప్రయోజనాలను పట్టించుకోవడంలేదని అన్నారు. దాదాపు 50 వేల కోట్ల రూపాయలు ఏపీ ప్రభుత్వానికి చమురు సంస్థలు ఇవ్వవలసి ఉన్నప్పటికీ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం వల్ల నిధులు విడుదల కావడం లేదని అన్నారు.2016 సంవత్సరంలో అనకాపల్లి జిల్లా పంగిలి గ్రామంలో పెట్రోలియం యూనివర్సిటీ ఏర్పాటు చేసేందుకు ప్రయత్నం చేసినప్పటికీ. ఆనాటి పాలకుల నిర్లక్ష్యం యూనివర్సిటీ నిర్మాణం కారణంగా ఉత్తర ప్రదేశ్ తరలిపోయిందని అన్నారు. బీసీ సెల్ అధ్యక్షులు మట్టపర్తి నాగేంద్ర. టౌన్ బీసీ సెల్ అధ్యక్షులు ముంగర ప్రసాద్. లీగల్ సెల్ నాయకులు కుడుపూడి త్రినాథ్. దండుమేను రూపేష్. బాబి గాబ్రియల్ పాల్గొన్నారు.

## చిన్నారులకు దగ్గుమందు వాడకండి

ఇటీవల మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో దగ్గుమందు వికటించి 11 మంది చిన్నారుల వరకూ మృత్యువాత పడటంతో కేంద్రం అప్రమత్తమైంది. దగ్గుమందును రెండేళ్ల లోపు పిల్లలకు దగ్గుమందు వాడొద్దని తెలిపిన కేంద్రం.. అలాగే ఐదేళ్ల లోపు చిన్నారులకు సైతం దగ్గమందును డాక్టర్లు సిఫార్సు చేయకూడదని స్పష్టం చేసింది. ఈ మేరకు అన్ని రాష్ట్ర హెల్త్ డిపార్ట్‌మెంట్‌లకు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ లేఖ ద్వారా వెల్లడించింది. కొన్నిరోజుల క్రిత మధ్యప్రదేశ్‌లో 9 మంది చిన్నారులు, రాజస్థాన్‌లో 2 చిన్నారులు మృత్యువాత పడ్డారు. దగ్గమందు వికటించే ఇలా జరిగిందని ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో  కేంద్ర పలు మార్గదర్శకాలు జారీ చేసింది.

**చిన్నారులకు దగ్గు మందులపై మార్గదర్శకాలు**

2 ఏళ్ల లోపు పిల్లలకు దగ్గు సిరప్ ఇవ్వొద్దు: ఈ వయస్సులో శరీరం మందుల ప్రభావానికి అధికంగా స్పందించవచ్చు. 5 ఏళ్ల లోపు పిల్లలకు దగ్గు మందులు సిఫార్సు చేయరాదు: సాధారణ దగ్గు, జలుబు పరిస్థితుల్లో సహజ చికిత్సలు, డాక్టర్ సూచనలతో ముందుకు వెళ్లాలి.
డెక్స్ట్రోమెథోర్ఫాన్ ఆధారిత ఫార్ములా: ఇది చిన్నారులకు సురక్షితంగా ఉండదని కేంద్రం స్పష్టం చేసింది.
కిడ్నీ ఫెయిల్యూర్‌కు కారణమైన మందులు: 'కోల్డ్రిఫ్' వంటి కొన్ని సిరప్‌లపై అనుమానాలు వ్యక్తమయ్యాయి, అయితే కేంద్రం నిర్వహించిన పరీక్షల్లో విష రసాయనాలు కనుగొనబడలేదు.

**గతంలోనే ఎగుమతులపై చర్యలు**

దగ్గు మందు ఎగుమతులకు ప్రభుత్వ ల్యాబ్ అనుమతి తప్పనిసరి: 2023 జూన్ 1 నుంచి అమల్లోకి వచ్చిన నిబంధనల ప్రకారం, ఎగుమతికి ముందు ల్యాబ్ పరీక్షలు తప్పనిసరి చేశారు.
డబ్ల్యూహెచ్‌వో  హెచ్చరికల నేపథ్యంలో చర్యలు: గాంబియా, ఇండోనేషియా, ఉజ్బెకిస్థాన్ వంటి దేశాల్లో భారతీయ దగ్గు మందుల వల్ల చిన్నారుల మరణాలు సంభవించడంతో ఈ చర్యలు తీసుకున్నారు.

**ప్రజలకు సూచనలు**

చిన్నారులకు దగ్గు వచ్చినప్పుడు తక్షణమే డాక్టర్‌ను సంప్రదించాలి.
%ౌజ% (ఓవర్ ది కౌంటర్) దగ్గు మందులు దయచేసి వాడకూడదు.
సహజ చికిత్సలు (తేనె, తులసి, గోరువెచ్చని నీరు) డాక్టర్ సూచనతో మాత్రమే వాడాలి.
ఈ మార్గదర్శకాలు పిల్లల ఆరోగ్యాన్ని కాపాడేందుకు తీసుకున్న కీలక చర్యలు. మీ ఇంట్లో చిన్నారులు ఉంటే, దగ్గు మందుల వాడకంపై అత్యంత జాగ్రత్తగా వ్యవహరించండి.

## ఏ క్షణంలోనైనా షెడ్యూల్

బిహార్ అసెంబ్లీ ఎన్నికలకు త్వరలో నగారా మోగనుంది. రాష్ట్రంలో ఎన్నికల సన్నద్ధతను పరిశీలించేందుకు శనివారం అధికారులు ఆ రాష్ట్ర పర్యటనకు వెళుతున్నారు. ఎన్నికల సంఘం ప్రధానాధికారి జ్ఞానేశ్ కుమార్, ఎన్నికల కమిషనర్లు వివేక్ జోషి, ఎస్ఎస్ సంధు శనివారం నుంచి రెండ్రోజుల పాటు పట్నాలో పర్యటించనున్నారు. రాష్ట్రంలో ఎన్నికలు నిర్వహించేందుకు తగిన వాతావరణం ఉందా? లేదా? అనేది సమీక్షిస్తారు. ఎన్నికల అధికారుల పర్యటన పూర్తయ్యాక ఏ క్షణంలోనైనా బిహార్ అసెంబ్లీ ఎన్నికలకు షెడ్యూల్ వెలువడే అవకాశం ఉంటుంది. 243 స్థానాలు కలిగిన బిహార్ అసెంబ్లీకి గడువు 2025 నవంబర్ 22తో ముగియనుంది. ఆ గడువులోగా కొత్త ప్రభుత్వం కొలువుదీరాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో అక్టోబర్ నెలాఖరు, నవంబర్ నెలల్లో వివిధ దశల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. 2020లో మూడు విడతల్లో పోలింగ్ జరగ్గా.. 2015లో మాత్రం ఐదు విడతల్లో పోలింగ్ జరిగింది. ఎన్నికల అధికారులు తమ పర్యటనలో భాగంగా రాజకీయ పార్టీల ప్రతినిధులతో పాటు, పోలీసు, ప్రభుత్వ ఉన్నతాధికారులతో సమీక్షలు నిర్వహిస్తారు. ఇప్పటికే 425 మంది అబ్జర్వర్లను ఎన్నికల సంఘం నియమించింది. భాజపా– జేడీయూ–ఎల్జేపీతో కూడిన ఎన్డీయే కూటమి, ఆర్జేడీ– కాంగ్రెస్‌తో కూడిన ఇండియా కూటమి మధ్య ఈ సారి గట్టి పోటీ ఉండనుంది. ప్రశాంత్ కిశోర్ నేతృత్వంలోని జన్ సురాజ్ పార్టీ కూడా తన అదృష్టాన్ని పరీక్షించుకోనుంది. బిహార్‌తో పాటు దేశవ్యాప్తంగా 7 అసెంబ్లీ స్థానాలకూ ఉప ఎన్నికలు జరగనున్నాయి.

## ముంచుకొస్తున్న 'శక్తి'..
## అరేబియా తీరంలో తుపాను ముప్పు



ఇంటర్నెట్‌డెస్క్: దేశ పశ్చిమ తీరంలో 'సైక్లోన్ శక్తి' ముంచుకొస్తోంది ఈ ఏడాది అరేబియా సముద్రంలో తొలి తుపాను ఏర్పడనుందని భారత వాతావరణశాఖ శుక్రవారం వెల్లడించింది. ద్వారకకు నైరుతి దిశగా 240 కి.మీ , పోర్‌బందర్‌కు పశ్చిమం వైపు 270 కి.మీ దూరంలో అరేబియా సముద్రం (%ూతీఖఎఖఅ వాఖ%)లో ఈ అల్పపీడనం ఏర్పడింది. అది వాయుగుండంగా బలపడి గంటకు 12కి.మీ. వేగంతో పశ్చిమ–వాయవ్య దిశగా కదులుతోంది. మరో మూడుగంటల్లో ఇది తుపానుగా మారే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. రానున్న 24 గంటల్లో తీవ్ర తుపానుగా మారవచ్చని అంచనా వేసింది. ఈ తుపానుకు 'శక్తి' అని పేరు పెట్టారు.
ప్రపంచ వాతావరణ సంస్థ ఆదేశాల ప్రకారం హిందూ మహాసముద్రం తీరప్రాంతంగా కలిగిన 13 దేశాలు తుపాను పేర్లను నిర్ణయిస్తాయి. భారత్, బంగ్లాదేశ్, ఇరాన్, మాల్దీవులు, మియన్మార్, ఒమన్, పాకిస్థాన్, ఖతార్, సౌదీ అరేబియా, శ్రీలంక, థాయిలాండ్, యూఏఈ, యెమెన్ ఆ దేశాలు. కొన్ని తుపానుల ప్రభావం వారం కన్నా ఎక్కువ రోజులు ఉంటుంది. అదే సమయంలో మరో తుపాను వస్తే ఎలా అని ఆలోచించి వాటికి పేర్లు పెట్టడం ప్రారంభించారు. ఈ సారి శక్తిపేరును శ్రీలంక పెట్టింది. ఒక్కో తుపానుకు ఒక్కో పేరు పెడితే డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌కు, మీడియాకు, సాధారణ ప్రజలకు ఇది ఫలానా తుపాను అని గుర్తుండిపోతుంది. అంతేకాకుండా ఆ పేరుతో ప్రజలను అప్రమత్తం చేసే అవకాశం ఉంటుంది. ఈ పేర్లు వీలయినంత చిన్నగా.. సులభంగా పలికే విధంగా ఉండాలనే నిబంధన ఉంది.

**ఎవరు నిర్ణయిస్తారంటే..?**

ప్రపంచ వ్యాప్తంగా ఆరు ప్రాంతీయ ప్రత్యేక వాతావరణ కేంద్రాలు, నాలుగు ప్రాంతీయ ఉష్ణమండల తుపాను హెచ్చరిక కేంద్రాలున్నాయి. ఈ కేంద్రాలు తుపానుల గురించి సలహాలు, సమాచారం ఇస్తుంటాయి. అలాగే వాటికి పేర్లు పెడుతుంటాయి. ఆరు ప్రాంతీయ ప్రత్యేక వాతావరణ కేంద్రాల్లో భారత వాతావరణశాఖ ఒకటిగా పనిచేస్తోంది. ఇది ఉత్తర హిందూ మహా సముద్రంపై గరిష్ఠంగా గంటకు 60 కిలోమీటర్ల ఉపరితల వేగంతో గాలులు వీచే తుపాన్లకు పేర్లు పెడుతుంది. అక్షర క్రమం ఆధారంగా ఒక్కో దేశం ఓ తుపానుకు పేరును సూచిస్తుంది. ప్రతి సారి ఆ పేరు కొత్తగా.. మళ్లీ పునరావృతం కాకుండా ఉండాలి. పేరు 8 అక్షరాలకు మించరాదు. అది ఏ సభ్య దేశానికీ అభ్యంతరకరంగా ఉండకూడదు. ఏ వర్గం ప్రజల మనోభావాలను దెబ్బతీయకూడదు.

# ప్రపంచపటం నుంచి తుడిచేస్తాం

న్యూఢిల్లీ/భుజ్



ఉగ్రవాదానికి ఊతమిచ్చే చర్యలను నిలిపివేయకపోతే ప్రపంచపటం నుంచి తుడిచేస్తామంటూ దాయాది పాక్‌ను ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది హెచ్చరించారు. రాజస్థాన్‌లోని అనూపగఢ్‌లోని సైనిక పోస్టును శుక్రవారం ఆయన సందర్శించారు. 'ఈసారి వెనక్కి తగ్గేది లేదు. ఆపరేషన్ సిందూర్ రెండో దశ ఎంతో దూరంలో లేదు. అది 1.0లా ఉండదు. భౌగోళిక పటంలో తన దేశం ఉండాలా వద్దా అనేది పాక్ నిర్ణయించుకోవాల్సి వస్తుంది. ఒకవేళ భౌతికంగా అస్తిత్వంలో ఉండాలనుకుంటే రాజ్య ప్రోత్సాహిత ఉగ్రవాదాన్ని తక్షణం కట్టిపెట్టాలి' అని స్పష్టం చేశారు. భగవంతుడు కోరుకుంటే త్వరలోనే ఆ 'అవకాశం' వస్తుందంటూ... ఆపరేషన్ సిందూర్ 2.0 కోసం సిద్ధంగా ఉండాలని సైనికులను ఆయన కోరారు.

**ఖబడ్దార్: రాజ్‌నాథ్ సింగ్**

రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ గురువారం గుజరాత్‌లోని భుజ్ సరిహద్దు ప్రాంతంలో సైనికులతో కలిసి దసరా వేడుకలు జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఆయన పాక్‌పై విరుచుకుపడ్డారు. సర్ క్రీక్ వద్ద దుస్సాహసానికి పాల్పడితే తీవ్ర పరిణామాలు తప్పవని, చరిత్రను..భౌగోళిక స్వరూపాన్నీ మార్చివేస్తామని హెచ్చరించారు. వివాదాస్పద సర్ క్రీక్ ప్రాంతంలోకి తన సైనిక నిర్మాణాలను పాక్ విస్తరిస్తున్నట్టు వస్తున్న వార్తలపై ఆయన ఇలా స్పందించారు. "1965 యుద్ధంతోపాటు సిందూర్‌ను కూడా పాకిస్థాన్ గుర్తుపెట్టుకోవాలి. రెండు సందర్భాల్లోనూ లాహోర్ వరకు వెళ్లి మన వాయుసేన తన సత్తా చాటింది. కరాచీకి వెళ్లే రహదారి సర్ క్రీక్ గుండానే పోతుందనేది దాయాది దేశం మరవొద్దు" అని రాజ్‌నాథ్ హెచ్చరించారు. కాగా, సైనికులతో కలిసి ఆయుధ పూజలో పాల్గొన్న ఆయన, సర్ క్రీక్ ప్రాంతాన్ని శక్తివంతం చేస్తూ నెలకొల్పిన జాయింట్ కంట్రోల్ సెంటరును, టైడల్ బెర్తింగ్ వ్యవస్థను ప్రారంభించారు.

**ఏమిటీ సర్ క్రీక్ వివాదం?**

భారత్, పాకిస్థాన్ మధ్య దశాబ్దాలుగా కొనసాగుతున్న సరిహద్దు వివాదాల్లో 'సర్ క్రీక్' ఒక ముఖ్యమైన అంశం. వ్యూహాత్మక, ఆర్థిక, భద్రత దృష్ట్యా ఇరు దేశాలకూ ప్రాధాన్యం కలిగిన ప్రాంతం. గుజరాత్‌లోని రాణ్ ఆఫ్ కచ్, పాకిస్థాన్ మధ్య ఉండే సముద్ర తీర ఉప్పు నీటి కాలువనే 'సర్ క్రీక్'గా పిలుస్తారు. ఇది 100 కిలోమీటర్ల కంటే తక్కువ పొడవు ఉంటుంది. 'సర్ క్రీక్'లో సగం తమదని భారత్ వాదిస్తోంది. పాకిస్థాన్‌లో అతిపెద్ద వాణిజ్య కేంద్రమైన కరాచీకి, అక్కడి పోర్టుకు నేరుగా చేరుకొనేందుకు సర్ క్రీక్ గుండానే ప్రయాణించాల్సి ఉంటుంది.

**పది పాక్ జెట్లను ధ్వంసం చేశాం**

**కూల్చినవాటిలో ఎఫ్–16, ఎస్‌జే–17లు**
**వాయుసేన చీఫ్ ఏపీ సింగ్ ప్రకటన**

ఆపరేషన్ సిందూర్ సమయంలో త్రివిధ దళాల సమన్వయంతో దాయాది పాక్‌ను చావుదెబ్బ కొట్టగలిగామని వాయుసేన చీఫ్ అమర్ ప్రీత్ సింగ్ తెలిపారు. ఈ ఆపరేషన్‌లో భాగంగా పాకిస్థాన్‌లోకి 300 కిలోమీటర్ల మేర దూసుకెళ్లామని, ఇంత విస్తారమైన భూభాగంలోకి చొచ్చుకెళ్లడం ఇదే తొలిసారి అని (లాంగెస్ట్ కిల్) తెలిపారు. 93వ వాయుసేన ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా తొలిసారి ఆయన పాక్‌కు కలిగిన యుద్ధ నష్టాలను లెక్కలతోసహా వివరించారు. "పాక్‌కు చెందిన పది ఫైటర్ జెట్లను ధ్వంసం చేశాం. కూల్చివేసిన ఆరేడు జెట్లలో ఎఫ్–16లు (అమెరికా), జేఎఫ్–17( చైనా) కూడా ఉన్నాయి. 11 వైమానిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుని భారత్ దాడులు మొదలుపెట్టడంతో పాకిస్థాన్ కాళ్ల బేరానికి వచ్చింది" అని అమర్ ప్రీత్ సింగ్ తెలిపారు. 4రోజులు సాగిన యుద్ధంపై పాక్ కథనాలు 'మనోహరం'గా ఉన్నాయని, వాటితోనే వారిని సంతృప్తి పడనీయండంటూ ఆయన ఎద్దేవా చేశారు. మనవి 15 ఫైటర్ జెట్లను కూల్చివేశామన్న భ్రమల్లోనే బతికేస్తామంటే, అలాగే వారు చేయవచ్చునన్నారు.

# రెండేళ్ల జీతమిచ్చి.. ఉద్యోగుల తొలగింపు

న్యూఢిల్లీ

దేశంలోని అతి పెద్ద ఐటీ సేవల సంస్థ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) 'సిబ్బంది పునర్వ్యవస్థీకరణ కార్యక్రమం' కింద.. ఉద్యోగుల తొలగింపు ప్రక్రియ చేపట్టింది. సంస్థ అవసరాలకు అనుగుణమైన నైపుణ్యాలు లేని, నైపుణ్యాలను పెంచుకోని ఉద్యోగులను ఇంటికి పంపిస్తోంది. ఇలా తొలగించే ఉద్యోగులకు 3నెలల వేతనాన్ని 'నోటీస్ పే'గా అందిస్తోంది. దానికి అదనంగా... ఉద్యోగులు టీసీఎసలో ఎంతకాలంగా పనిచేస్తున్నారనే అంశం ఆధారంగా ఆరు నెలల నుంచి రెండేళ్ల వేతనాన్ని తొలగింపు ప్యాకేజీ కింద ఇస్తోంది. ఏ ప్రాజెక్టులోనూ లేనివారికి/ఎనిమిది నెలలకు పైగా బెంచ్‌పై ఉన్నవారికి కేవలం మూడు నెలల వేతనం మాత్రమే ఇచ్చి సాగనంపుతోంది. 10 నుంచి 15 ఏళ్లు సంస్థలో పనిచేసినవారికి ఏడాదిన్నర వేతనం.. 15 ఏళ్లకు పైగా సంస్థలో ఉన్నవారికి రెండేళ్ల వేతనం ఇస్తోంది. పదవీ విరమణ వయసుకు దగ్గరలో ఉన్నవారికి 'టీసీఎస్ కేర్స్' పథకం కింద ముందే పదవీ విరమణ చేసే అవకాశాన్ని కల్పిస్తోంది. అందులో భాగంగా వారికి పూర్తిస్థాయి పదవీ విరమణ ప్రయోజనాలు, బీమా, అదనంగా తొలగింపు ప్యాకేజీ కింద ఆర్నెల్ల నుంచి రెండేళ్ల వేతనాన్ని అందిస్తోంది. నానాటికీ పెరుగుతున్న ఏఐ ప్రభావం, క్లైంట్ల డిమాండ్ల మేరకు.. 2025–26 ఆర్థిక సంవత్సరంలో తన సిబ్బందిలో 2% మందిని (దాదాపు 12 వేల మందిని) తగ్గించుకోనున్నట్టు ఈ ఏడాది జూలైలో ప్రకటించిన సంగతి తెలిసిందే.

**వివరాలు చెప్పండి..**

ప్రపంచవ్యాప్తంగా తన సిబ్బందిని టీసీఎస్ తొలగిస్తున్న నేపథ్యంలో.. అమెరికాలో నియామకాలకు సంబంధించి టీసీఎస్ అనుసరిస్తున్న విధానాలపై యూఎస్ సెనెటర్లు 9 ప్రశ్నలు సంధించారు. ఈమేరకు సెనెట్ జ్యుడిషియరీ కమిటీ చైర్మన్ చార్లెస్ గ్రాస్‌లే, ర్యాంకింగ్ మెంబర్ రిచర్డ్ డర్బిన్ టీసీఎస్ సీఈవో కె.కృత్తివాసన్‌కు సెప్టెంబరు 24న లేఖ రాశారు. ఇటీవలికాలంలో అమెరికాలోని జాక్సన్ విల్లేలో దాదాపు 60 మంది ఉద్యోగులను టీసీఎస్ తొలగించిన విషయాన్ని అందులో పేర్కొన్నారు. 2025లో టీసీఎస్ సంస్థ 5,505 మంది హెచ్–1బీ ఉద్యోగులను నియమించుకోవడానికి అనుమతి పొందిన నేపథ్యంలో.. ఒకవైపు అమెరికన్లను తొలగిస్తూ.. ఇలా హెచ్–1బీ ఉద్యోగుల కోసం వేలాది పిటిషన్లు దాఖలు చేయడమేమిటని ప్రశ్నించారు. టీసీఎస్ తన కార్యాలయాల్లో ఉద్యోగాలకు తగిన అర్హతలున్న అమెరికన్ ఉద్యోగులను గుర్తించలేకపోవడం నమ్మదగినదిగా లేదని వ్యాఖ్యానించారు. వయసు మళ్లిన అమెరికన్ ఉద్యోగులను తొలగించి.. వారి స్థానాలను దక్షిణాసియా దేశాలకు చెందినవారిని హెచ్–1బీ వీసాలపై తెచ్చి భర్తీ చేస్తోందన్న ఆరోపణలు టీసీఎసపై ఉన్నాయి. దీనిపై 'ఈక్వల్ ఎంప్లాయ్‌మెంట్ ఆపర్చునిటీ కమిషన్' దర్యాప్తు జరుపుతోంది. ఇలాంటి సమయంలో.. అమెరికన్లను హెచ్–1బీ వీసాపై వచ్చినవారితో భర్తీచేయడం సంస్థకు ఏవిధంగానూ మేలు చేయదని సెనెటర్లు తమ లేఖలో పేర్కొన్నారు. హెచ్–1బీ వీసాపై తెచ్చినవారితో అమెరికన్ ఉద్యోగుల స్థానాన్ని భర్తీ చేస్తున్నారా? హెచ్–1బీ వీసాలపై వచ్చినవారికి అమెరికన్ ఉద్యోగులకు చెల్లించే వేతనాల్లో తేడాలు ఎంత? వంటి ప్రశ్నలు అడిగి.. 10వ తేదీలోగా వాటికి పూర్తివివరాలతో సమాధానాలు ఇవ్వాలని కోరారు.

# పరీక్ష రాసాక ప్రశ్నాపత్రం.. జవాబులు చూసుకోవచ్చు!

న్యూఢిల్లీ

కేంద్ర ప్రభుత్వ శాఖలు, వివిధ విభాగాల్లో నాన్ గెజిటెడ్ పోస్టులను భర్తీ చేసే స్టాఫ్ సెలెక్షన్ కమిషన్(ఎసఎససీ) తాను నిర్వహించే పరీక్షలకు సంబంధించి కీలక సంస్కరణలు చేసింది. పరీక్ష అనంతరం అభ్యర్థులు తమ ప్రశ్న, జవాబు పత్రాలు చూసుకునే అవకాశం కల్పించిన ఎస్ఎసీ... ఇకపై మార్కుల ఆధారంగా కాక పర్సంటైల్ విధానంలో అభ్యర్థుల మెరిట్ జాబితాను నిర్ణయించనుంది. ప్రశ్నపత్రం లికేజీలు నిరోధానికి డిజిటల్ వాల్ట్‌ల వినియోగించనున్న ఎస్ఎసీ.. పరీక్ష కేంద్రాల్లో ఆధార్ గుర్తింపు ఆధారంగా అభ్యర్థుల హాజరు తీసుకోనుంది. పరీక్షల నిర్వహణ మరింత పకడ్బందీగా, అభ్యర్థుల ఎంపిక మరింత పారదర్శకంగా జరిగేలా ఈ సంస్కరణలను అమలులోకి తెచ్చామని ఎస్ఎసీ శుక్రవారం ప్రకటించింది. ప్రశ్నపత్రాన్ని బహిర్గతం చేయడం, అందరికీ అందుబాటులో ఉండేలా చేయడం తాము అమలులోకి తెచ్చిన సంస్కరణల్లో అత్యంత కీలకమైనదని ఎస్ఎసీ పేర్కొంది. ఇకపై, అభ్యర్థులు పరీక్ష రాసిన వెంటనే తమకు వచ్చిన ప్రశ్నపత్రం, దానికి తామిచ్చిన సమాధానాలతోపాటు కీని కూడా చూసుకోవచ్చునని, వాటిని డౌన్‌లోడ్ కూడా చేసుకోవచ్చని ఎస్ఎసీ అధికారులు పేర్కొన్నారు. వాటి ఆధారంగా అభ్యర్థులు ఏదైనా ప్రశ్నపై బోర్డును సవాలు చేయవచ్చని వివరించారు. అయితే, ఏదైనా పరీక్ష వేర్వేరు షిఫ్ట్‌ల్లో జరుగుతుంటే మాత్రం.. ఆ పరీక్షలన్నీ పూర్తయిన తర్వాతే ప్రశ్నపత్రాలు, సమాధానాలు కనిపిస్తాయని, ఆ తర్వాతే సవాలు చేసుకోవాల్సి ఉంటుందని వివరించారు. పరీక్ష జరుగుతున్న సమయంలో ప్రశ్నపత్రం బహిర్గతం కాకూడదనే ఈ నిబంధన అని తెలిపారు. ఓ ప్రశ్నను సవాలు చేసేందుకు గతంలో రూ.100గా ఉన్న రుసుమును కూడా ఎస్ఎసీ రూ.50కి తగ్గించింది. అంతేకాక, ఎంపిక చేసిన పలు పరీక్షల పాత ప్రశ్నపత్రాలను ఇక నుంచి అభ్యర్థులకు అందుబాటులో ఉంచుతామని ఎస్ఎసీ ప్రకటించింది. దీని ద్వారా పరీక్ష సిలబస్, మోడల్ ప్రశ్నపత్రం తదితర అంశాలపై అభ్యర్థులకు స్పష్టమైన అవగాహన ఏర్పడుతుందని తెలిపింది.

**పర్సంటైల్ విధానం..**

ఎస్ఎసీ అమలులోకి తెచ్చిన సంస్కరణల్లో భాగంగా ఇకపై అభ్యర్థుల ర్యాంకింగ్ లేదా మెరిట్ జాబితాను నిర్దేశిత పరీక్షలో వారు సాధించిన మార్కుల ఆధారంగా కాక పర్సంటైల్ విధానంలో నిర్ణయించనున్నారు. ప్రస్తుతం ఏదైనా ఉద్యోగానికి వేర్వేరు షిఫ్ట్‌ల్లో నిర్వహించే పరీక్షలకు వేర్వేరు ప్రశ్నపత్రాలు ఇస్తున్నారు. పరీక్షలో సాధించిన మార్కుల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తున్నారు. ఓ షిఫ్ట్‌లో ప్రశ్నపత్రం సులువుగా ఉందని, మరో షిఫ్ట్‌లో ఇచ్చిన ప్రశ్నపత్రం కఠినంగా ఉందని అలాంటప్పుడు మార్కుల ఆధారంగా ఎంపిక ఎలా చేపడతారని విమర్శలు ఎదురవుతున్నాయి. ఇప్పుడు పర్సంటైల్ విధానంతో ఆ విమర్శలకు ముగింపు పలకవచ్చని ఎస్ఎసీ అధికారులు పేర్కొన్నారు. ఇక, ఒకరి బదులు మరొకరు పరీక్ష రాయడం, ఒక అభ్యర్థి ఒకే పరీక్షను పలుమార్లు రాయడం వంటి వాటిని నిరోధించేందుకు ఆధార్ అథెంటికేషన్ హాజరు విధానాన్ని కూడా అమలులోకి తెచ్చామని బోర్డు ప్రకటించింది. ప్రశ్నపత్రాల లీకేజీ సమస్యకు చెక్ పెట్టేందుకు ఇకపై డిజిటల్ వాల్ట్‌ల ద్వారా ప్రశ్నపత్రాలను ట్రాన్స్‌ఫర్ చేయనున్నామని ఎస్ఎసీ పేర్కొంది. డిజిటల్ వాల్ట్‌లో ఉన్న ప్రశ్నపత్రాలు హ్యాకింగ్ లేదా వేరే ఏదైనా మార్గంలో లీక్ అవ్వకుండా చూసేందుకు ఐటీ ఏజెన్సీల సేవలను వినియోగించుకుంటామని వెల్లడించింది. కాగా, అభ్యర్థుల సందేహాల నివృత్తి, ఫిర్యాదుల స్వీకరణకు ప్రస్తుతం 1800 309 3063 టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ నెంబర్ అందుబాటులో ఉండగా.. దీనికి అదనంగా ఆన్‌లైన్‌లో ఫిర్యాదుల స్వీకరణకు ప్రత్యేక పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చామని ఎస్ఎసీ తెలిపింది. అలాగే, అభ్యర్థులకు అందుబాటులో ఉండేందుకు గాను ఎక్స్(ట్విటర్)లో తమ అధికారిక ఖాతాను కూడా ప్రారంభించామని ఎస్ఎసీ శుక్రవారం ప్రకటించింది. ఆ ఖాతా ద్వారా అభ్యర్థులు ఎస్ఎసీకి సంబంధించిన కచ్చితమైన సమాచారాన్ని తెలుసుకోవచ్చునని పేర్కొంది.

**వాళ్లకి 14న పునఃపరీక్ష**

ఎస్ఎసీ ఇటీవల నిర్వహించిన సీజీఎల్ఈ–2025(కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవల్ ఎగ్జామినేషన్) పరీక్షకు 125 నగరాల్లోని 255 కేంద్రాల్లో 13.5 లక్షల మంది హాజరయ్యారు. సాంకేతిక సమస్యలు తలెత్తడం వల్ల ఇందులో కొన్ని పరీక్ష కేంద్రాల్లో అభ్యర్థులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇందుకు సంబంధించి అభ్యర్థుల నుంచి అందిన విజ్ఞప్తులకు స్పందించిన ఎస్ఎసీ.. సమస్య తలెత్తిన కేంద్రాల్లో పరీక్ష రాసిన వారికి అక్టోబరు 14న మళ్లీ పరీక్ష నిర్వహిస్తామని ప్రకటించింది. అభ్యర్థులకు ఎస్ఎంఎస్, ఈ మెయిల్ ద్వారా సమాచారం అందిస్తామని వెల్లడించింది. ఈ పరీక్ష రాసిన అభ్యర్థులు కొత్త విధానం ప్రకారం అక్టోబరు 15 నుంచి ప్రశ్నలను సవాలు చేయవచ్చు. ఇక, 2025 అక్టోబరు నుంచి 2026 మార్చి మధ్యలో తాము నిర్వహించే పలు ముఖ్యమైన పరీక్షల ప్రణాళికలను కూడా ఎస్ఎసీ శుక్రవారం విడుదల చేసింది.



# దేశ ఆర్థిక స్వావలంబన కోసం స్వదేశీ ఉద్యమం..

**- స్వదేశీ అంటే పాత చింతకాయ పచ్చడి కాదు.. నిత్య నూతనం.. - విదేశీ సవాళ్లు ఎదుర్కొంటున్నా జీఎస్టీని కేంద్రం తగ్గించింది..**
**- కూటమి ప్రభుత్వం సూపర్ జీఎస్టీ, సేవింగ్స్ కార్యక్రమం నిర్వహించడం అభినందనీయం**
**- ఖాదీ సంత సందర్శనలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** నాడు దేశ స్వాతంత్ర్యం కోసం మహాత్మాగాంధీ నడిపిన స్వదేశీ ఉద్యమాన్ని స్ఫూర్తిగా తీసుకుని ప్రస్తుతం దేశ ఆర్థిక స్వావలంబన కోసం మరోసారి స్వదేశీ ఉద్యమానికి ప్రధాని మోదీ పిలుపునిచ్చారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ చెప్పారు. స్వదేశీ అంటే అదేదో పాత చింతకాయ పచ్చడి కాదని, ఇది నిత్య నూతనం అని ఆయన వ్యాఖ్యానించారు. స్థానిక సుబ్రహ్మణ్య మైదానంలో బిజెపి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ద్విదిన ఖాదీ సంత రెండవ రోజు శుక్రవారం ఆయన సందర్శించారు. స్టాల్స్ అన్నీ కలియదిరిగి పరిశీలించారు. అనంతరం అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు తదితరులతో కల్సి మీడియాతో మాట్లాడారు. 2014లో మోదీ అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి ఆత్మనిర్భర్ భారత్, మేకిన్ ఇండియా వంటి నినాదాలతో స్వయం సమృద్ధి దిశగా అడుగులు వేస్తున్నారని మాధవ్ అన్నారు. రక్షణ రంగం, విదేశాంగ విధానం, మన దేశ ఆర్థిక విధానం, విదేశీ పెట్టుబడులు, ఇలా అన్ని విషయాల్లో దేశం స్వయం సమృద్ధి వైపు నడిపించే చర్యలు తీసుకుంటున్నారని ఆయన అన్నారు. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించడం కోసం మేకిన్ ఇండియా లో భాగంగా ముద్ర లోన్స్ ప్రవేశ పెట్టారని, అందరినీ బ్యాంకింగ్ రంగానికి చేరువ చేసే విధంగా జన్ ధన్ ఖాతాలు తెచ్చారని మాధవ్ వివరించారు. రక్షణ రంగంలో మనం ఎవరిపై ఆధార పడకూడదన్న ఉద్దేశ్యంతో స్వదేశీ పరిజ్ఞానంతో పరికరాలు తయారుచేసే దిశగా అడుగులు వేయడం వలన ఆపరేషన్ సిందూర్ సమయంలో మన రక్షణ వ్యవస్థ గురించి ప్రపంచానికి చాటగలిగామని ఆయన చెప్పారు. ఆపరేషన్ సింధూర్ తర్వాత రక్షణ రంగంలో విదేశాలకు ఎగుమతులు పెరిగాయన్నారు. ఎవరేమనుకున్నా రష్యా, ఇరాన్‌ల నుంచి ఆయిల్ కొంటున్నామని, అమెరికా ఎన్ని ఆంక్షలు పెట్టినా బెదిరేదిలేదని మోడీ చాటిచెప్పారని ఆయన అన్నారు. విదేశీ సవాళ్లు ఎదుర్కొంటున్నా సరే, పేద మధ్యతరగతి ప్రజలను దృష్టిలో ఉంచుకుని జిఎస్టిని కేంద్రం తగ్గించిందని మాధవ్ చెబుతూ జీఎస్టీ 2.0ని కాంగ్రెస్ రాష్ట్రాలు కూడా అంగీకరించిన విషయం రాహుల్ గాంధీకి తెలియకపోవడం శోచనీయమన్నారు. కాంగ్రెస్ అబద్ధాల కొట్టు నిర్వహిస్తోందని ఆయన ఎద్దేవా చేసారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. పెట్రోల్‌పై జిఎస్టి తగ్గించడానికి రాష్ట్ర ప్రభుత్వాలు అంగీకరించట్లేదని ఒక ప్రశ్నకు సమాధానంగా మాధవ్ చెప్పారు. ఎందుకంటే పెట్రోల్ పై కేంద్రం విధిస్తున్న జిఎస్టి 18 శాతమేనని, రాష్ట్ర ప్రభుత్వాలు విధించే జిఎస్టీ దీనికి రెండు రెట్లు అదనంగా ఉంటోందని, అయినప్పటికి దేశవ్యాప్తంగా పెట్రోల్‌పై కూడా ఒకే రేటు తీసుకురావాలనే ఆలోచన కేంద్రానికి ఉందని ఆయన వివరించారు. జిల్లా బిజెపి అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు తపన చౌదరి, ఖాదీ సంత కన్వీనర్ క్షత్రియ బాలసుబ్రహ్మణ్యం సింగ్, బిజెపి నాయకులు కోదూరి లక్ష్మీనారాయణ, అడబాల రామకృష్ణ, రొంగలి గోపి, నర్సిపల్లి హారిక, కురగంటి సతీష్, కరుటూరి శ్రీనివాసరావు, శెట్టిపల్లి శివ నాగరాజు, బోడపాటి ముత్యాలరావు, వీర వీరాంజనేయులు, మాట్ల ఆంజనేయులు, కాలేపు సాయిరామ్, అడపా వరప్రసాద్, పన్నాల లక్ష్మి సంతోషి, తదితరులు పాల్గొన్నారు.

# పవన్ కళ్యాణ్ సంస్కరణలు దేశానికి ఆదర్శం..

**పర్యాటక మంత్రి కందుల దుర్గేష్ - అనుశ్రీ సత్యనారాయణ ఆధ్వర్యంలో దసరా పండుగ సంబరాలు**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్:** సమర్థవంతమైన సీఎం చంద్రబాబు,పేదల కన్నీరు తుడవడానికి రాజకీయాల్లోకి వచ్చిన పవన్ కళ్యాణ్ నేతృత్వంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలతో రాష్ట్రంలో ప్రజలు విజయదశమిని ఆనందంగా జరుపుకుంటున్నారని కందుల దుర్గేష్ అన్నారు.స్థానిక అనాల వెంకట అప్పారావు రోడ్‌లో ఉన్న జనసేన పార్టీ కార్యాలయంలో సిటీ ఇన్‌చార్జ్ అనుశ్రీ సత్యనారాయణ ఆధ్వర్యంలో గురువారం విజయదశమి (దసరా) సంబరాలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్, కాకినాడ ఎం.పీ తంగెళ్ల ఉదయ శ్రీనివాస్ (బాలు), డిసిసిబి చైర్మన్ తుమ్మల బాబు, వేగుళ్ల లీలాకృష్ణ, ఏపి హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ ప్రియా సౌజన్య తదితరులు హాజరయ్యారు.వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలు ఆనందంగా పండుగ జరుపుకుంటున్నారన్నారు. పవన్‌కళ్యాణ్ తాను నిర్వహిస్తున్న ప్రభుత్వ శాఖల్లో చేపడుతున్న సంస్కరణలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని కొనియాడారు. పవన్ కళ్యాణ్ నాయకత్వంలో రాష్ట్రంలో జనసేన పార్టీని మరింత బలోపేతం చేసేందుకు జనసైనికులు, వీర మహిళలతో కలిసి కృషిచేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు గెద్దం నాగరాజు, సుబ్రహ్మణ్య స్వామి దేవస్థానం చైర్మన్ వైవిడి ప్రసాద్, బయ్యపినీడి సూర్య,అల్లటి రాజు,విన్న వాసు, కురం అప్పారావు, పాలెపు కళ్యాణి,గౌతమీ, ఇంద్ర,జనసేన నాయకులు పాల్గొన్నారు.

# విజయభారతి చెస్ట్ ఇన్స్టిట్యూట్ హాస్పిటల్లో నూతన విభాగం ప్రారంభం..



**దివాన్ చెరువు, విశ్వం వాయిస్ న్యూస్:** విజయభారతి చెస్ట్ ఇన్స్టిట్యూట్ హాస్పిటల్‌లో నూతన విభాగాన్ని గురువారం యాజమాన్యం ప్రారంభించింది. ఆధునిక విభాగాన్ని ఏర్పాటు చేసేందుకు ఈ బ్లాక్‌ని ప్రారంభించినట్టు యాజమాన్యం తెలియజేసింది. వేద మంత్రోచ్చరణల మధ్య ప్రముఖ వైద్య నిపుణులు యాజమాన్య ప్రధాన వైద్యులు డాక్టర్ గూడురి శ్రీనివాస్ ఆయన సతీమణి విజయభారతి చెస్ట్ ఇనిస్టిట్యూట్ సీఈవో రాధిక గూడూరి, తనయులు డాక్టర్ భరత్ బాబు ప్రత్యేక పూజలు నిర్వహించారు. విజయదశమి ప్రత్యేక పూజలు నూతన విభాగంలో నిర్వహించారు. విజయ భారతి చెస్ట్ ఇనిస్టిట్యూట్ జనరల్ మేనేజర్ పెండ్యాల కోదండరామయ్య, వైద్య నిపుణులు డాక్టర్ సోమనాథ్ దాష్,డాక్టర్ అన్వేష్ క్యానామ్, డాక్టర్ హితేష్ చెరణ్, డాక్టర్ లక్ష్మణ్ కొల్లూరి, డాక్టర్ వంశీకృష్ణరాజు, డాక్టర్ సాహితీ, డాక్టర్ భారతిరామ్ గూడూరి, డాక్టర్లు రమ్య, శ్రావణి, స్పందన, వినీత,ప్రసాద్ హేమాంజలి, విశ్రాంత ఎడిషనల్ ఎస్పీ గోపాలకృష్ణ దంపతులు, న్యాయవాది వైవిఎస్ శ్యామల, ప్రసాద్ గూడూరి దంపతులు, జవహర్ గూడూరి దంపతులు, అభిమానులు శ్రేయోభిలాషులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. వివిధ విభాగాలను యాజమాన్యం ప్రారంభించింది.

# స్వర్గీయ గొందేశి పూర్ణ చంద్రారెడ్డి జయంతి

**వేడుకల్లో పేదలకు చెక్కులు పంపిణీ.. - బాలాజీపేటలో ఘనంగా అభిమానులు సంబరాలు**
**పి జి ఆర్ చారిటబుల్ ట్రస్ట్ తరపున సేవలు - నేటి రాజకీయాలకు ఆయన ఆదర్శం..!**





**బొమ్మూరు, విశ్వంవాయిస్ న్యూస్:** బాలాజీపేట సెంటర్లో ఉన్న కీర్తిశేషులు గొందేశి పూర్ణ చంద్రారెడ్డి విగ్రహం వద్ద గురువారం ఉదయం 85వ జయంతి వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి.ఈ వేడుకకు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, ఆయన అభిమానులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, స్థానిక ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చారు. గొందేశి పూర్ణ చంద్రారెడ్డి తనయుడు, గొందేశి శ్రీనివాసులు రెడ్డి ఈ కార్యక్రమాన్ని దగ్గరుండి పర్యవేక్షించారు. ముందుగా పూర్ణచంద్రారెడ్డి క్యాంస విగ్రహానికి ఆయన కుటుంబ సభ్యులు, అభిమానులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో పలువురు వక్తలు ఆయన సేవలను, నిస్వార్థ రాజకీయ జీవితాన్ని కొనియాడారు. గొందేశి శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ నాన్న ఆశయ సాధనే మా లక్ష్యం..!"ఈసందర్భంగా ముఖ్య అతిథిగా, నిర్వాహకునిగా వ్యవహరించిన గొందేశి శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ ఉద్వేగానికి లోనయ్యారు. ఆయన ప్రసంగంలోని ముఖ్యాంశాలు ఇవి: "ఈ రోజు మా నాన్న కీర్తిశేషులు గొందేశి పూర్ణ చంద్రారెడ్డి 85వ జయంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహం వద్దకు ఇంత పెద్ద సంఖ్యలో తరలివచ్చిన బంధువులకు, మిత్రులకు, అభిమానులకు నా కృతజ్ఞతలు. మీ అందరి గుండెల్లో ఆయన ఇంకా సజీవంగా ఉన్నారనడానికి ఇదే నిదర్శనం.

**సమాజ సేవలో ఆదర్శప్రాయుడు:**

మా నాన్న కేవలం ఒక రాజకీయ నాయకుడిగానే కాదు, సేవకుడిగా, నిస్వార్థపరుడిగా, సామాన్య ప్రజల పక్షపాతిగా ఆయన చరిత్రలో నిలిచిపోయారు. పదవుల కోసం, అధికారాల కోసం వెంపర్లాడకుండా, చివరి శ్వాస వరకు ఆయన ప్రజల మధ్యే జీవించారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఆయన చేసిన కృషి, ముఖ్యంగా విద్యా, వైద్య రంగాలకు ఆయన అందించిన చేయూత ఎప్పటికీ మరువలేనివి. నేటి యువత, రాజకీయ నాయకులు ఆయన జీవితాన్ని ఒక పాఠంగా తీసుకోవాలి. నేటి రాజకీయాలకు ఆయన ఆదర్శం..ఆయన రాజకీయ విలువలు, నిబద్ధత నేటి రాజకీయాలకు ఒక దారిదీపం. మా నాన్న ఎప్పుడూ వ్యక్తిగత దూషణలకు తావివ్వకుండా,కేవలం ప్రజల సమస్యలపైనే దృష్టి పెట్టేవారు. ఆయన చూపిన మార్గంలో నడవడమే, ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే మేమిచ్చే నిజమైన నివాళి.

**ఆశయ సాధనే మా లక్ష్యం:**

మా కుటుంబం తరపున, ఈ బాలాజీపేట సెంటర్ నుంచే ప్రమాణం చేస్తున్నాం - మా నాన్న సమాజం కోసం కలలు కన్న ఆశయాలన్నిటినీ, ముఖ్యంగా నిరుపేదల సేవ, విద్య, వైద్యం వంటి విషయాల్లో ఆయన ఆశయాలన్నిటినీ సాధించేందుకు మా శాయశక్తులా కృషి చేస్తాం. మీ ఆశీస్సులు,సహకారం మాకు నిరంతరం కావాలి. ఈ పుణ్యదినాన, ఆయన సేవలను స్మరించుకుందాం, ఆయన స్ఫూర్తితో ముందుకు సాగుదాం,"అని శ్రీనివాసులురెడ్డి అన్నారు. అనంతరం జయంతి వేడుకల్లో గొందేసి పూర్ణ చంద్రారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ తరపున జయంతి వేడుకల్లో పేద ప్రజలకు వారి విద్యార్థికి విద్య నిమిత్తం, మొత్తం ముగ్గురికి వైద్యం నిమిత్తం చెక్కులు పంపిణీ చేశారు. వృద్ధ ఆశ్రమంలో పేదలకు భోజన,పళ్ళు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సీపి నాయకులు, ప్రముఖులు యువనేత జక్కంపూడి గణేష్, ప్రముఖులు బాక్స్ ప్రసాద్, రాయుడు ప్రసాద్, వడ్డీ మురళి, ఎన్.సుధాకర్, సూరంపూడి ప్రకాష్, పూడి ప్రకాష్,రెడ్డి ప్రసాద్, నగేష్, విజయానంద్, మురళి, సీతారాం చరణ్, కైఫ్ ఫ్రెండ్ సర్కిల్ ,రూపేష్ ఫ్రెండ్ సర్కిల్, ఓంప్రకాష్ ఫ్రెండ్ సర్కిల్ ,నాగేంద్ర,మరిడాపు శేఖర్, కాకులపార్టీ కుమార్, తడాల విష్ణుచక్రవర్తి, తాటికొండ విష్ణు, ముత్యాల పోసి కుమార్, ఖాన్ భాయ్ , నర్సింగ్ శ్రీను, సురేంద్ర, వంశీ, భీమశంకర్, మురళి,ముద్దాల తిరుపతి రావు (అను), నూకరాజు, కాకినాడ రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు, రూరల్ రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు, వివిధ స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు, కార్మిక నేతలు బాక్స్ ప్రసాద్, ఆటో యూనియన్ నాయకులు, కన్నా రెడ్డి, పెయింటర్స్ అసోసియేషన్ సభ్యులు, వడ్రంగి అసోసియేషన్ సభ్యులు, ఆటో యూనియన్ నాయకులు, టెక్క హౌసెస్ యూనియన్ నాయకులు, బాలాజీ పేట కనకదుర్గమ్మ తల్లి గుడి కమిటీ సభ్యులు, వెంకటేశ్వరనగర్ వెంకటేశ్వర స్వామి గుడి కమిటీ సభ్యులు, బాలాజీ పేట వర్కర్స్ యూనియన్ నాయకులు, నమీరా, ఎస్కే సత్తార్,జి ఎస్ ఆర్ ఫ్రెండ్స్ సర్కిల్, కేత నాగేశ్వరరావు, గిరిబాబు,న్యాయవాదుల సంక్షేమ సంఘం నాయకులు సభ్యులు, నర్సింగ్ శ్రీను, ఆనంద్, మరక శ్రీను, శిల్పి శివ, అహ్మద్,దొంగ శ్రీను, ఎర్రం శెట్టి సునీల్,ఎంకన్న, పిలకపండు, సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

# శ్రీశీలా వీరభద్రుడు సెంటినరీ డిపాజిట్ పథకం ప్రారంభం



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** జాంపేట కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంకులో శ్రీ శీలా వీరభద్రుడు సెంటినరీ డిపాజిట్ పథకాన్ని విజయదశమి నాడు బ్యాంకు చైర్మన్ బొమ్మన జయకుమార్ ప్రారంభించారు. దేవాంగ ప్రముఖుడు, ప్రముఖ వస్త్ర వ్యాపారి కీ.శే.శీలా వీరభద్రుడు ఆధ్వర్యంలో 1926 ఆగస్టు 22 వ తేదీన జాంపేట బ్యాంకు స్థాపించిన సంగతి తెల్సిందే.ఈ ఏడాది మొత్తం శతాబ్ది వేడుకలు చేయాలని పాలకవర్గం నిర్ణయించిన నేపథ్యంలో ఈ డిపాజిట్ పథకాన్ని ప్రారంభించారు.వైస్ చైర్మన్ రొబ్బి విజయశేఖర్, డైరెక్టర్లు ప్రసాదుల హరినాథ్,ద్వారా పార్వతి సుందరి, జామిశెట్టి గాంధీ,మహంతి లక్ష్మణరావు,జామి కృష్ణ, గుంటముక్కల సత్యనారాయణ ప్రసాదరావు,యాండ్రపు రామకృష్ణ, కనకం నాగేశ్వరరావు, బూర రామచంద్రరావు, బీర శ్రీనివాసరావు, పల్లా వెంకటేశ్వరరావు, వేదాంతం వెంకట్ నారాయణ, ఇన్చార్జి సెక్రటరీ, సీఈవో మద్దాల విజయ ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు. ఈ డిపాజిట్ పథకంలో లక్ష రూపాయలు పథకం కింద రూ 45, 300డిపాజిట్ చేస్తే, 10ఏళ్లకు 8శాతం వడ్డీతో రూ 1,00,024లు, అలాగే రూ 50వేల పథకం కింద రూ 22,650డిపాజిట్ చేస్తే, 8శాతం వడ్డీతో పదేళ్లకు రూ 50, 012లు అందించనున్నట్లు బొమ్మన జయకుమార్ తెలిపారు. 12.08శాతం వార్షిక దిగుబడి వడ్డీరేటు లభించే ఈ పథకంలో మీ మీ ఆత్మీయులు, పిల్లల పేరుతో పెట్టుబడి వారి భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ఏర్పాట్లు చేసుకోవాలని ఆయన కోరారు.

# దళితుల ప్రాణాలకు రక్షణ లేదు..

**ఈ కూటమి ప్రభుత్వంలో దాడులు ఎక్కువ అయ్యాయి...**
**ఎస్సీ యువకుడిపై కులపరమైన దాడి దారుణం - తక్షణ చర్యలకై బర్రే ఆనంద్ కుమార్ డిమాండ్**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కూటమి ప్రభుత్వంలో దళితుల ప్రాణాలు రక్షణ లేకుండా పోయిందని స్వతంత్ర జనతా పార్టీ రిపబ్లిక్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు బర్రే ఆనంద్ కుమార్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా బర్రె ఆనంద్ కుమార్ మాట్లాడుతూ వైయస్సార్ కాంగ్రెస్ నుంచి కూటమి పార్టీలకు ఆంధ్ర రాష్ట్రంలో అధికార బదలాయింపు జరిగిన నాటి నుంచి ఎస్సీల పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలో పడినట్లుగా ఉందని అన్నారు. గాడాల గ్రామం ప్రధాన కూడలిలో స్టేట్ హైవే పై నడిరోడ్డు మీద ఎస్సీ యువకుడిని స్తంభానికి కట్టి విచక్షణారహితంగా కొట్టడం వంటి సంఘటనలతో రాష్ట్రంలో ఎస్సీలకు ఎటువంటి సంకేతాలు ఇస్తున్నారో అర్థమవుతుందని తెలిపారు. వివరాల్లోకి వెళితే మధురపూడి గ్రామంలో ఉన్న ఎస్సీ యువకులకు గాడాల గ్రామంలో ఉన్న కాపు యువకులకు మధ్య రెండు రోజుల క్రితం జరిగిన ఘర్షణలో తాము అనుకున్న ఎస్సీ యువకుడు దొరకకపోవడంతో ఆ గ్రామానికి చెందిన ఎవరో ఒక ఎస్సీ యువకుడిని చంపి మొత్తం ఎస్సీ లందరికీ భయం కల్పించాలన్న దుర్మార్గమైన కుల పరమైన ద్వేషంతో మంగళవారం రాత్రి 10 గంటల సమయంలో మధురపూడి గ్రామానికి చెందిన పాము శ్రీను ను దారి కాచి విచక్షణ రహితంగా కొట్టడమే కాకుండా నడిరోడ్డుపై స్తంభానికి కట్టేసి ముఖంపై ఉమ్ము వేస్తూ ఇనుప రాడ్లతో ముక్కు వెంట నోటి వెంట రక్తం వచ్చేలా విపరీతంగా కొట్టారు. ఇద్దరు పోలీసులు అక్కడికి చేరుకున్నప్పటికీ వారికి కూడా భయపడకుండా తమ దాడిని కొనసాగించడంతో పోలీసులే భయపడి మరింత మంది పోలీసులను రక్షణ కోసం రప్పించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. అనంతరం ప్రభుత్వాసుపత్రికి వెళ్లిన తర్వాత ఒంటినిండా రక్తాలతో తీవ్రమైన గాయాలతో వచ్చినప్పటికీ కేవలం ప్రాథమిక చికిత్స చేసి ఆసుపత్రిలో అడ్మిషన్ ఇవ్వకుండా బలవంతంగా బయటికి పంపి వేయడంతో రాత్రంతా నెత్తుటి గాయాలతో ఆసుపత్రి బయట చెట్టు కింద బాధితులు పడి ఉండవలసిన దుస్థితి ఏర్పడిందన్నారు. ఈ విధంగా ఎస్సీలపై కర్కసంగా వ్యవహరిస్తున్న అధికారులపై కూడా ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. అయితే జరిగిన సంఘటనపై వేగంగా స్పందించి కేసు నమోదు చేసిన కోరుకొండ పోలీస్ స్టేషన్ అధికారులకు ధన్యవాదాలు తెలుపుతున్నామని, అయితే కేసులు నమోదు చేసి వదిలిపెట్టకుండా నిందితులందరినీ తక్షణమే అరెస్టు చేసి బాధితులకు ప్రాణ రక్షణ కల్పించవలసిందిగా కోరుకొండ సిఐకి ఫోన్ ద్వారా తెలియజేసినట్లు పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా దళితులపై జరిగే దాడులను ప్రతిఘటించాలన్నా, శాశ్వత పరిష్కారం కావాలన్నా అణగారిన వర్గాల ప్రజలంతా ఏకమై తమ ఐక్యత శక్తిని పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు.

# జాతిపిత మహాత్మాగాంధీ ఆశయాలు నేటి యువతకు ఆదర్శం కావాలి : రొంగల



**కోరుకొండ విశ్వం వాయిస్ న్యూస్:** జాతిపిత మహాత్మాగాంధీ ఆశయాలు నేటి యువతకు ఆదర్శం కావాలని పశ్చిమగోనగూడెం సర్పంచ్ రొంగల దేవిక శ్రీనివాస్ అన్నారు. గురువారం గాంధీ జయంతిని పురస్కరించుకుని పశ్చిమ గోనగూడెం సచివాలయం వద్ద జాతిపిత మహాత్మాగాంధీ విగ్రహానికి రొంగల దంపతులు, తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రొంగల మాట్లాడుతూ మనకు స్వాతంత్రం తేవడానికి ఎందరో మహానుభావులు ప్రాణత్యాగం చేశారని, వారి ఆశయాలు నేటి యువతకు ఆదర్శం కావాలన్నారు. మహాత్మాగాంధీ సత్యాగ్రహం నిరాకరణ ఉద్యమం, ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమాలలో ప్రముఖ పాత్ర పోషించాలన్నారు. ఆయనకు మహాత్మా, జాతిపిత, బాపు, వంటి బిరుదులు ఉన్నాయన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం పేద,మధ్యతరగతి ప్రజల అభ్యున్నతికి అన్ని వస్తువులపై జిఎస్టిని భారీగా తగ్గించరని , వ్యవసాయ రంగానికి మరింత ప్రాధాన్యత ఇచ్చారన్నారు. దీనివల్ల రాష్ట్ర ప్రభుత్వానికి సుమారు 13వేల కోట్ల రూపాయలు భారం పడుతుందన్నారు. ఇంటింటికి వెళ్లి మహిళలకు, వ్యాపారస్తులకు సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్ పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ నాయకులు కొయ్యే సామ్యూల్, చింతపల్లి శేఖర్, బోజంకి రాజు, సెక్రెటరీ నదీషా, సచివాల సిబ్బంది, అంగన్వాడి, ఆశ, ఉపాధి హామీకూలీలు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీవారి ఆశీస్సులతో సమాజ ప్రగతి

## శ్రీ వేంకటేశ్వరుని విగ్రహం ఆవిష్కరణ కార్యక్రమంలో 'రౌతు'

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** శ్రీవారి ఆశీస్సులతో అందివచ్చే చైతన్యం సమాజ ప్రగతికి ఎంతగానో దోహదం చేయగలదని మాజీ శాసనసభ్యులు, రుడా మాజీ చైర్మన్,వైఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు రౌతు సూర్యప్రకాశరావు అన్నారు. కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వరుని జన్మ నక్షత్రం సందర్భంగాను, అలాగే విజయదశమి పర్వదినం సందర్భంగాను అరుదుగా వచ్చే ఈ సంయుక్త పండుగ సందర్భంగా గురువారం స్థానిక రంభ, ఊర్వశి, మేనక థియేటర్ల ప్రాంగణంలో నిలువెత్తు శ్రీ వేంకటేశ్వరుని విగ్రహాన్ని ఆ థియేటర్ల యాజమాన్యంఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీ వేంకటేశ్వరునికి విశేష పూజలు నిర్వహించారు. శ్రీవారు, కనకదుర్గ అమ్మ వారి కృపా కటాక్షాలు ఈ జగతికి మూలాధారమని రౌతు తన ప్రసంగంలో పేర్కొన్నారు. ఆధ్యాత్మిక అమృతవాహిని ద్వారా మనిషి తనను తాను సమున్నతంగా తీర్చిదిద్దుకోగలడని అన్నారు.ఈ కార్యక్రమంలో రౌతు వెంకట అప్పారావు, రౌతు శ్రీనివాస్ రావు,రౌతు కిరణ్, ఇయ్యపు మురళి, ఇయ్యపు మాధవ్, వాకచర్ల కృష్ణ, పెద్దిరెడ్ల



శ్రీనివాస్, తలుపూరి ప్రసాద్, చెక్కా వెంకటేశ్వరరావు, గాడాల శ్రీనివాస్, అందనాపల్లి సత్య నారాయణ, రచయిత శ్రీపాద శ్రీనివాస్, దింటకుర్తి సత్యనారాయణ, తల్లా ప్రగడరాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# అన్నం పరబ్రహ్మ స్వరూపం - వాకపల్లి సూరిబాబు

**సీతానగరం విశ్వం వాయిస్ న్యూస్ :** అన్ని దానాల్లో అన్నదానం గొప్పదంటారు. కడుపు నిండా అన్నం తిన్నవారి ముఖంలో వెలిగే ఆ తృప్తి ఎంతో సంతోషాన్ని అందిస్తుంది. అలా ఎన్నో అన్నదానాల్లో తన వంతు సహకారం అందిస్తూఅన్నం పెడుతూ స్ఫూర్తిదాయకంగా మారారు. చిన్నకొండేపూడి గ్రామానికి చెందిన సీతానగరం మండల రేషన్ డీలర్ల ప్రెసిడెంట్ వాకపల్లి సూరిబాబు. గత 25 సంవత్సరాల నుండి తిరుపతి వెంకన్నబాబు గుడికి బియ్యం, గుమ్మడికాయలు పంపిస్తున్నారు. అలాగే వాడపల్లి వెంకన్నబాబు గుడికి బియ్యం, కూరగాయలు అలాగే తంటికొండ వెంకన్నబాబు గుడికి కూరగాయలు, బియ్యం, రంపచోడవరం వెంకన్నబాబు గుడికి 600 మందికి అన్నదాన కార్యక్రమానికి కావలసిన వస్తువులను సూరిబాబు పంపిస్తున్నారు. అలాగే కోరుకొండ మండలం గుమ్మళ్లదొడ్డి వెంకన్నబాబు గుడికి ఈనెల 4న జరిగే మహా అన్నదాన కార్యక్రమానికి 3500 మందికి చిన్నకొండేపూడి గ్రామ ప్రజల సహకారంతో అక్టోబర్ 4న జరిగే మహా అన్నదాన కార్యక్రమానికి అవసరమైన కూరగాయలు, బియ్యం,పలు కిరాణా సరుకులు పంపించడమైనదని సూరిబాబు అన్నారు. అదేవిధంగా అంతర్వేది నరసింహస్వామి గుడి అన్నసంతర్పణ కార్యక్రమానికి బియ్యం అలాగే గోవులకు




నాలుగు లారీల దాణాను పంపించడ మైనదని వాకపల్లి సూరిబాబు సీతానగరం మండల కేంద్రం స్వర్ణాంధ్ర ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రెస్ క్లబ్ నందు తెలియజేశారు. అన్నదాన కార్యక్రమాలకు ప్రతీ సంవత్సరం సహకరిస్తున్న సీతానగరం మండల రేషన్ డీలర్లను, సహకరిస్తున్న భక్తులను ఆవేంకటేశ్వరస్వామి ఎల్లవేళలా కాచి కాపాడాలని ఆ భగవంతుడు అష్టైశ్వర్యాలు నిండుగా మెండుగా కలగజేయాలని ఆ భగవంతుని కోరుకుంటున్నామని సూరిబాబు అన్నారు. ఆ ప్రాంతాల్లో జరిగే అన్న సమారాధన కార్యక్రమానికి సహకరించిన భక్తులకు ప్రత్యేక ఆశీర్వాదాలు కలిగే లాగున ప్రత్యేక పూజలు చేయిస్తున్నామని అన్నారు. ఆ భగవంతుడు సన్నిధి అన్న సమారాధన కార్యక్రమానికి సహకరించాలనుకునే వారు ఈ ఫోన్ నెంబర్కు 9063621885 సంప్రదించవచ్చునని తెలియజేశారు. అన్నదాన కార్యక్రమాలు కేవలం భోజనం పెట్టడమే కాకుండా ఒకరి కడుపు నింపితే ఆ సంతృప్తి మిగతా దానాల కంటే ఎంతో విభిన్నంగా ఉంటుందని కష్టాల్లో ఉన్నవారికి సహాయం చేయడం వారి ఆకలిని తీర్చడం వంటి సామాజిక బాధ్యతలను స్వీకరించడం ద్వారా వాకపల్లి సూరిబాబు అందరికీ ఆదర్శంగా నిలిచారని మండల రేషన్ డీలర్లు,యువత అంటున్నారు. భాగ్యవంతులుపేదలకు, దివ్యాంగులకు,యాచకులకు ఆహారాన్ని అందించుటలో ఒక అడుగు ముందుకు వేసి పుణ్యాన్ని దక్కించుకోవాలని సూరిబాబు కోరుతున్నానని అన్నారు. దాతలూ సహకారం అందిస్తున్నారని బియ్యం,కూరగాయలు, సరకులు సమకూరుస్తున్నారని అందుకే ఆయా ప్రాంతాల్లో జరిగే అన్న సమారాధన కార్యక్రమాలకు సీతానగరం మండల తరపున నా వంతుసహకారం అందించగలుగుతున్నానని వాకపల్లి అన్నారు.

### గాడాల ఘటనలో

# నలుగురు వ్యక్తులు అరెస్టు : డీఎస్పీ శ్రీకాంత్

### డ్రగ్స్‌పై అవగాహన - సోషల్ మీడియాపై నిఘా



**కోరుకొండ విశ్వం వాయిస్ న్యూస్ :** గాడాలలో ఘటనలో నలుగురు ముద్దాయిలను అరెస్టుచేసి రిమాండ్ కు పంపిస్తున్నట్లు రాజమహేంద్రవరం ఉత్తర మండల డిఎస్పి వై శ్రీకాంత్ తెలిపారు. గురువారం ఆయన కోరుకొండ పోలీస్ స్టేషన్ వద్ద పాత్రికేయులతో మాట్లాడుతూ గాడాల పాముల శ్రీను దాడి ఘటనలో గంధం నాగేంద్ర, ఈలి నగేష్, ఆకుల నాగబాబు, అడ్డాల మణికుమార్ లపై కేసు నమోదు చేసి, రిమాండ్ కు తరలిస్తున్నామన్నారు. దర్యాప్తులో దోషులు తేలితే, అరెస్టులు ఉంటాయన్నారు. ఉత్తర మండల పరిధిలో రౌడీయిజం చేస్తే సహించేది లేదని,విద్యార్థిని,విద్యార్థులకు డ్రగ్స్ పై అవగాహన, వాటి వల్ల అనర్థాలు తెలియజేస్తున్నామన్నారు. నాటుసారా తయారీ, విక్రయాల పైన కఠిన చర్యలు చేపడుతున్నామన్నారు. మహిళల భద్రతకు ప్రతిష్ట చర్యలు చేపడుతున్నామని, ఉత్తర మండల పరిధిలో ఎటువంటి సాంఘిక కార్యక్రమాలు జరిగిన పరిధిలోని పోలీస్ స్టేషన్ దృష్టికి తీసుకురావాలన్నారు. అదేవిధంగా సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు, రెచ్చగొట్టే పోస్టులు పెట్టిన కఠిన చర్యలు ఉంటాయన్నారు.ఈ కార్యక్రమంలో సర్కిల్ స్పెక్టర్ సత్య కిషోర్, ఎస్సై నాగార్జున, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పుట్టా వారి వివాహ వేడుకలో పాల్గొన్న బొడ్డు వెంకటరమణ చౌదరి



**సీతానగరం, విశ్వంవాయిస్ న్యూస్:** తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం పురుషోత్తపట్నం గ్రామంలో పుట్ట గోపి కుమార్తె వివాహ వేడుకలో రుడా చైర్మన్ తెలుగుదేశం పార్టీ రాజానగరం నియోజకవర్గ ఇన్చార్జ్ రాష్ట్ర కార్యదర్శి బొడ్డు వెంకటరమణ చౌదరి పాల్గొని పెండ్లి కుమార్తెను ఆశీర్వదించారు.

### జీఎస్టీ తగ్గింపుతో రైతులకు

# అందుబాటులో వ్యవసాయ పరికరాలు

### లొల్ల గ్రామంలో సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ కార్యక్రమం

### సోమేశ్వరంలో వరి కోత ప్రయోగాలపై రైతు సేవా కేంద్ర సిబ్బందికి శిక్షణ కార్యక్రమం



**రాయవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** దేశ వ్యాప్తంగా ప్రజలకు ఆర్థిక ఉపశమనం కలిగిస్తూ, కేంద్ర ప్రభుత్వం నూతనంగా తగ్గించిన జి.ఎస్.టి ధరలతో అన్ని వస్తువులతో పాటు వ్యవసాయ పరికరాల ధరలు సైతం తగ్గాయని రాయవరం మండల వ్యవసాయ అధికారి కెవిఎన్ రమేష్ కుమార్ తెలిపారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జిల్లా, రాయవరం మండలం, లొల్ల గ్రామంలో జరిగిన సూపర్ జీఎస్టి, సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ పరికరాల పై తగ్గిన పన్ను వివరాలను రైతులకు వివరిస్తూ, జీఎస్టి తగ్గింపు ద్వారా వ్యవసాయ పరికరాల ధరలలో మార్పులు సంతరించుకోవడం ద్వారా వ్యవసాయానికి ఉపయోగించే డ్రోన్ ధర సుమారు రూ.50,000 వరకూ తగ్గిందని, ట్రాక్టర్ల ధరతో పాటు ఇంజన్ ఆయిల్ ధరలు కూడా తగ్గాయని ఎమ్.ఎ.ఒ రమేష్ కుమార్ వివరించారు. ఈ సందర్భంగా లొల్ల గ్రామ సర్పంచ్ చాట్రాతి జానకి రాంబాబు మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపు కారణంగా ప్రజల్లో కొనుగోలు చేసేవారి శాతం పెరిగిందని తెలిపారు. అనంతరం డిప్యూటీ స్టాటిస్టికల్ ఆఫీసర్ వీరభద్రరావు పంట కోత ప్రయోగాల నిర్వహణ గూర్చి రాయవరం మండలం లోని రైతు సేవా కేంద్రం సిబ్బందికి, సోమేశ్వరంలో గల రైతు సేవా కేంద్రంలో శిక్షణ ఇచ్చారు. పంట కోత ప్రయోగాలు దిగుబడి ఆధారంగా రైతులకు నష్ట పరిహారం చెల్లిస్తారని, అందుకు గత 5 సంవత్సరాల పంట కోత ప్రయోగాలు దిగుబడిని ప్రామాణికంగా తీసుకుని నష్ట పరిహారం నిర్ధారిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ టిడిపి అధ్యక్షులు సుంకవల్లి గంగరాజు, నీటి సంఘం అధ్యక్షులు లంక శ్రీను, రైతులు, గ్రామ వ్యవసాయ సహాయకులు, ఎ.ఎస్.ఒ గాయత్రి దేవి, ఎ.ఇ.ఒ ఎ. శివ శంకర్ పాల్గొన్నారు.



### ఉమా కోప్పేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్‌గా

# మైలవరపు సుబ్బారావు

### బాధ్యతలు స్వీకరించిన పాలకవర్గం సభ్యులు





**కొత్తపేట పలివెల, విశ్వం వాయిస్ న్యూస్ :** కొత్తపేట మండలం పలివెల గ్రామానికి చెందిన శ్రీ ఉమా కోప్పేశ్వర స్వామి దేవస్థానం పాలకమండలి సభ్యులు గురువారం బాధ్యతలు స్వీకరించారు. చైర్మన్‌గా మైలవరపు సుబ్బారావును ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో కొత్తపేట మండలం నాయకులు పాల్గొన్నారు. తోట కళ్యాణ చక్రవర్తి, యర్రంశెట్టి శ్రీనివాసరావు, బయ్యే వెంకన్న, పిప్పర షణ్ముఖ ధర్మమిత్ర, జంప కృష్ణ కుమార్, నక్క శైలజ, శిరంగి అనంతలక్ష్మి, కంకటాల లత, పిల్లంగోరు నాగమణి, గుత్తుల నాగమణి సభ్యులుగా దేవస్థానం ఈవో ప్రమాణస్వీకారం చేయించారు.అనంతరం జరిగిన సమావేశంలో కొత్తపేట నియోజకవర్గంలో ప్రాముఖ్యత సంతరించుకున్న శివాలయంగా ఎంతో విశిష్టత కలిగిందని చుట్టుపక్కల ప్రాంతాల వారికి ఎంతో నమ్మకం కలిగిన శివాలయంగా గుర్తింపు పొందిందన్నారు. నూతనంగా ఎన్నికైన చైర్మన్ మరియు పాలకవర్గ సభ్యులకు అభినందనలు తెలియజేస్తూ ఎమ్మెల్యే సందేశం పంపించారు.ఈ కార్యక్రమంలో బూసి జయలక్ష్మి, ముత్యాల బాబ్జి, కంఠంశెట్టి శ్రీనివాస్, సాదే శ్రీనివాస్, గుబ్బల మూర్తి, చవల జగన్నాథం, యల్లమెల్లి జగన్మోహన్, నల్ల రమణ, యర్రంశెట్టి కృష్ణ, పిప్పర బాలాజీ, కముజు తాతాజీ, చీకట్ల నరసింహమూర్తి, కరెడ్ల మురళి, షేక్ మస్తాన్, గోశాల భాస్కర రామం, తదితర కూటమి నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు.

# 13వ తేదీన ఐటీడీఏ ముట్టడి విజయవంతం చేయండి

### - ఆదివాసులు అందరూ తరలిరండి

### - ఆదివాసి హక్కుల ఉద్యోగాల సాధన కమిటీ పిలుపు



**దేవీపట్నం, విశ్వంవాయిస్ న్యూస్ :** ఆదివాసులు ఎదుర్కొంటు న్న అనేక సమస్యల పరిష్కారణకై ఈనెల 13వ తేదీన రంపచోడవరం ఐటిడిఏ ముట్టడి కార్యక్రమానికి ఆదివాసు లందరూ తరలిరావాలని ఆదివాసీ హక్కుల ఉద్యోగాల సాధన కమిటీ డివిజన్ ప్రెసిడెంట్ మడి మురళి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మడి మురళి మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు జిల్లా,రంపచోడవరం నియోజకవర్గం, దేవీపట్నం మండలం పరిధిలోని పెద్ద భీంపల్లి-2, పెద్ద భీంపల్లి -3 మరియు మడిపల్లి ఆర్ అండ్ ఆర్ కాలనీలలో సమావేశాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ సమావేశాల్లో మాట్లాడుతూ 2025 మెగా డీఎస్సీలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు చేయడంతో ఆదివాసి నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు.ఈ విషయంపై గతంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఐటీడీఏల వద్ద ధర్నాలు, రాస్తారోకోలు, ర్యాలీలు, రిలే నిరాహార దీక్షలు చేపట్టి 2025 మెగా డీఎస్సీలో ఉన్న షెడ్యూల్డ్ ప్రాంత టీచర్ పోస్టులు మినహాయించి ప్రత్యేక డిఎస్సి ప్రకటించాలని డిమాండ్ చేసినప్పటికీ ఎటువంటి ప్రయోజనం లేదన్నారు.ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి ఆదివాసి నిరుద్యోగుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని అదివాసీ ప్రజా ప్రతినిధులు తక్షణమే స్పందించి ట్రైబల్ అడ్వైజరీ కౌన్సిల్ లో తీర్మానం చేసి షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగాల నియామకాల చట్టం తక్షణమే ప్రకటించి ఆదివాసి ప్రత్యేక డీఎస్సీ నోటిఫికేషన్ ప్రకటించాలని, ఆదివాసీ యువతకు ఐటీడీఏ ద్వారా ట్రైకార్ రుణాలు తక్షణమే మంజూరు చేయాలని, ఎస్టీ బ్యాక్ లాగ్ పోస్టులు 100 శాతం ఆదివాసీ నిరుద్యోగు లతో భర్తీ చేయాలని, ఎన్నికల ముందు ఏపీ సీఎం అరకులో ఆదివాసీ నిరుద్యోగులకు జీఓ నెంబర్ 3ని పునరుద్ధరించి వంద శాతం ఉద్యోగాలు స్థానిక ఆదివాసీ నిరుద్యోగులతో భర్తీ చేస్తామని ఇచ్చిన హామీని తక్షణమే అమలుచేయాలని,ఆశ్రమ పాఠశాలలో ఏఎన్ఎం పోస్టులు భర్తీ చేయాలని మరియు 1/59,1/70,పెసా చట్టం,అటవీ హక్కుల చట్టం,2013 పోలవరం ప్రాజెక్టు భూ సేకరణ చట్టం పటిష్టంగా అమలు చేయాలని మొదలైన సమస్యలను పరిష్కరించాలని శాంతియుతంగా ఈ నెల 13 వ,తేదీన రంపచోడవరం ఐటీడీఏ ముందు జరిగే ముట్టడి,ర్యాలీ కార్యక్రమాన్నికి అదివాసీ ప్రజానీకం అందరూ తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి హక్కుల ఉద్యోగాల సాధన కమిటీ మండల ప్రధాన కార్యదర్శి మిర్తివాడ సాయికిరణ్ రెడ్డి,శారపు నవీన్ కుమార్,మడకం సూర్య కుమారి,మిర్తి వాడ సూరారెడ్డి,రమాదేవి,వరలక్ష్మి, సర్పంచ్ తోకల నాగరత్నం, ఏపీ ఆదివాసి జేఏసీ రాష్ట్ర కార్యదర్శి కారం రామన్న దొర మొదలైన వారు పాల్గొన్నారు.

# పేరూరు పంచాయతీలో సర్పంచ్ అధ్యక్షతన గ్రామ సభ సమావేశం




**అమలాపురం రూరల్ విశ్వం వాయిస్ న్యూస్ :** పేరూరు గ్రామపంచాయతీలో సర్పంచ్ దాసరి అరుణ డేవిడ్ అధ్యక్షతన గ్రామసభ సమావేశం జరుపబడినది ఈ సమావేశానికి వార్డు మెంబర్లు ఎంపీటీసీ సభ్యులు అంగన్వాడీ టీచర్లు డ్వాక్రా యానిమేటర్లు సెక్రటరీ ఆర్ ఎస్ ఎస్ సూరప రాజు సచివాలయ సిబ్బంది ఫీల్డ్ అసిస్టెంట్ దాసరి నాగలక్ష్మి ఉపాధి హామీ శ్రామికులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# వెదురుపాకలో వైభవంగా దుర్గమ్మ బోనాలు

## ముగిసిన నవరాత్రి మహోత్సవాలు



**కోరుకొండ విశ్వం వాయిస్ న్యూస్ :** గోకవరం మండలం వెదురుపాకలో శరన్నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకొని భవానీ భక్తులు పెద్ద ఎత్తున వైభవంగా బోనాలు నిర్వహించారు. శుక్రవారం భవాని భక్తులు ముగింపు సందర్భంగా అమ్మవారిని వివిధ ఫల, పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి, భవానీలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామస్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్ధ ప్రసాదాలు స్వీకరించారు. దీంతో గ్రామమంతా దుర్గ నామస్మరణలతో ఆధ్యాత్మిక వాతావరణ సంతరించుకుంది. భవానీ భక్తులు బోనాలు ఎత్తుకొని, జై దుర్గా జైజై దుర్గా అంటూ నినాదాలు చేస్తూ గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భవానీలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ

# శ్రామికులతో ఎమ్మెల్యే బత్తుల మాటామంచి



**సీతానగరం వాయిస్ న్యూస్ :** సీతానగరం మండలం కాటవరం గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ శ్రామికులతో రాజానగరం నియోజకవర్గం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ కాసేపు ముచ్చటించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ శ్రామికులు, శాసనసభ్యులు బత్తుల రామకృష్ణతో మాట్లాడుతూ కూటమిపాలన మాకు ఎంతగానో సంతృప్తినిచ్చిందని, కూటమి పాలన వచ్చిన తర్వాతనే మా జీవితాలు బాగున్నాయని హర్షం వ్యక్తం చేశారు.గతంలో కంటే ప్రస్తుతం మెరుగైన జీవనం సాగిస్తునామన్నారు.

# మద్యం షాపు తరలింపుపై ఫిర్యాదు

## పీజీఆర్ఎస్ ఫిర్యాదుపై ఎక్సైజ్ సీఐ విచారణ



**సీతానగరం విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం రఘుదేవపురం గ్రామంలో ఉన్న ఎస్.వి. వైన్ షాపు కారణంగా స్థానికులకు కలుగుతున్న ఇబ్బందులపై అందిన పీజీఆర్ఎస్ ఫిర్యాదు మేరకు బుధవారం ఎక్సైజ్ అధికారులు విచారణ చేపట్టారు. ఎక్సైజ్ శాఖ సీఐ శ్రీనివాస్ బాలాజీ రఘుదేవపురం గ్రామంలోని వైన్ షాపు వద్ద, ముఖ్యంగా దాని సమీపంలో ఉన్న షెడ్యూల్డ్ కులాల (ఎస్సీ) స్మశాన వాటిక వద్ద పరిశీలన జరిపారు. వివరాల ప్రకారం వైన్ షాపు దగ్గర మద్యం సేవించే వ్యక్తులు ప్లాస్టిక్ గ్లాసులు, గాజు సీసాలు, ప్లాస్టిక్ వాటర్ ప్యాకెట్లు, వాటర్ బాటిళ్లను స్మశానవాటికలో పారవేసి తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నారని ఫిర్యాదు. ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ బాలాజీ విచారణలో ఈ ఆరోపణలు నిజమని తేలింది. ముఖ్యంగా మద్యం సేవించిన వ్యక్తులు గాజు సీసాలను పగలగొట్టి ఆ పెంకులను స్మశానవాటికలో పారవేయడం వల్ల ప్రజలకు గాయాలయ్యే ప్రమాదం ఉందని గుర్తించారు. స్మశానవాటిక ప్రక్కన ఉన్న తొర్రిగడ్డ ఇరిగేషన్ కాలువలో కూడా ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లు, ప్యాకెట్లు, మద్యం సీసాలు, గ్లాసులు పడేయడం వల్ల ఆ ప్రాంతం పూర్తిగా కలుషితం అయ్యిందని, పరిశుభ్రత ధ్వంసం అయ్యిందని సీఐ నిర్ధారించారు. ఈ మొత్తం పరిస్థితిపై పూర్తి నివేదికను డీపీఓకి తెలియజేయనున్నట్లు ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ బాలాజీ తెలిపారు. మద్యం షాపు తరలింపు, కాలుష్యంపై తదుపరి చర్యలు డీపీఓ మరియు ఎక్సైజ్ కమిషనర్ ఆధ్వర్యంలో ఉన్నాయని తెలిపారు.

# అమ్మవారి ప్రత్యేక పూజలో పాల్గొన్న మార్కెట్ యాడ్ చైర్మన్



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రాపురం పట్టణం శివాలయం వీధిలో పార్క్ వద్ద గల కనకదుర్గ అమ్మవారిని విజయదశమి సందర్భంగా అమ్మవారిని దర్శించుకున్న మార్కెట్ కమిటీ చైర్మన్ అక్కల రిస్వంత్ రాయ్.ఆలయ కమిటీ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికితీర్ధ ప్రసాదములు అందించారు.ఈ సందర్భంగా రిశ్వంత్ రాయ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం తరుపున నియోజకవర్గం ప్రజలుకు దశిమి శుభాకాంక్షలు తెలిపారు .ఆలయ అభివృద్ధికి సహాయ సాకారాలు అందిస్తానని అన్నారు.

## సాహితీ వేత్త నల్లా నరసింహమూర్తికి లభించిన ఇంటర్నేషనల్ కల్చరల్ టాలెంట్ బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డును

# అందజేసిన ఎంపీ గంటి హరీష్ మాధుర్



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కేంద్రమైన అమలాపురం పట్టణానికి చెందిన ప్రముఖ సాహితీవేత్త, సీనియర్ తెలుగు లెక్చరర్ శ్రీశ్రీ కళావేదిక జిల్లా అధ్యక్షులు నల్లా నరసింహ మూర్తికి నాలుగు దశాబ్దాలుగా తెలుగు సాహిత్యానికి తెలుగు భాషకు చేస్తున్న సేవలను గుర్తించి అంతర్జాతీయ కల్చలర్ టాలెంట్ బుక్ ఆఫ్ రికార్డ్స్ టాలెంట్ అవార్డు లభించింది. అవార్డును శుక్రవారం సాయంత్రం అమలాపురం పార్లమెంట్ సభ్యులు గంటి హరీష్ మాధుర్ అమలాపురం కార్యాలయంలో ఆయన కార్యాలయంలో నరసింహా మూర్తికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు దశాబ్దాలుగా తెలుగు సాహిత్యానికి తెలుగు భాషకు అంకితభావంతో కృషి చేస్తున్నందుకు అంతర్జాతీయ స్థాయిలో అవార్డు రావడం ఆనందదాయకమని ఆయన చేస్తున్న కృషిని ప్రశంసించారు. ఈ సందర్భంగా కవి నరసింహమూర్తిని ఎంపీ హరీష్ మాధుర్ సన్మానించారు .అంతర్జాతీయ సాహిత్య సంస్కృతిక సేవా సంస్థ శ్రీశ్రీ కళా వేదిక జాతీయ అధ్యక్షులు డాక్టర్ కత్తిమండ ప్రతాప్ మాట్లాడుతూ తెలుగు సాహిత్య సాంస్కృతిక రంగంలో సుజనాత్మకతతో సామాజిక అంశాలను జోడించి ప్రతిరోజూ రచనలు చేస్తున్న కొద్దిమంది కవుల్లో నరసింహమూర్తి ఒకరినిఆయన అన్నారు. ఆధునిక తెలుగు సాహిత్యంలో 2016 నుండి నాలుగు లఘు ప్రక్రియను రూపొందించి సాహిత్య చరిత్రలో తనదైన ముద్ర వేసుకున్నారని డాక్టర్ కత్తిమండ కవిని ప్రత్యేకంగా ప్రశంసించారు. కార్యక్రమంలో కోనసీమ రచయితల సంఘం అధ్యక్షులు బి.వి. వి.సత్యనారాయణ, ముమ్మిడివరం మదర్ థెరీసా మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు మెండి కమల పాల్గొని కవిని అభినందించారు.

# రిసోర్స్ పర్సన్‌కి ముందుగా ట్రైనింగ్ ఇవ్వాలి

## అధికారులను ఆదేశించిన కలెక్టర్ మహేష్‌కుమార్



**అమలాపురం, విశ్వం వాయిస్ :** కెరీర్ గైడెన్స్‌పై ముందుగా రిసోర్స్ పర్సన్‌కి ట్రైనింగ్ ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ అధికారు లను ఆదేశించారు శుక్ర వారం స్థానిక కలెక్టరేట్ నందు రిసోర్స్ పర్సన్స్ మామిడికుదురు పూర్వపు విద్యార్థులతో సమావేశం నిర్వహించి కెరీర్ గైడెన్స్ కౌన్సిలింగ్ అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముందుగా రిసోర్స్ పర్సన్స్‌కు శిక్షణ పూర్తి చేసి తరువాత జిల్లాలో ఉన్న ఒక్కో హైస్కూల్‌కి ఒక స్కూల్ అసిస్టెంట్‌కి మొత్తంగా ఒక నెలలోనే కలెక్టరేట్‌లో ట్రైనింగ్ ఇవ్వాలన్నారు. తదుపరి శిక్షణ పొందిన వారు తమ స్కూళ్ళలో నెలకి రెండు మార్లు కెరీర్ గైడెన్స్ పై శిక్షణ ఇవ్వాల న్నారు కెరీర్ బుక్ లెట్ విద్యార్థులతో పాటు పేరెంట్స్కి అందించడం. ఈ నెలాఖరు నాటికి కెరీర్ ట్రీ అన్ని ప్రభుత్వ పాఠశాలలో పెయింటింగ్ వేయించా లన్నారు మోడల్ మెగా అల్యూమినియం మీట్ జిల్లా పరిషత్ హై స్కూల్ మామిడి కుదురు నందు జనవరి 17 జరిపించా లన్నారు ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి షేక్ సలీం భాష, సమగ్ర శిక్ష అసిస్టెంట్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ జి మమ్మీ పి నవీన్, మామిడి కుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యా యులు బి చిరంజీవి, జి సత్యనారాయణ మాకే భీమారావు డి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# పవిత్రమైన ఆలయం దగ్గర దుష్ట రాజకీయాలా..?




**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం పట్టణం 3,4వ వార్డు అంకం వారి వీధి,పిల్లావారివీధి ఆరాధ్య దైవమైన శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారు శరన్నవరాత్రులు మహోత్సవ శుభసందర్భంగా నియోజవర్గంలో పలువురి రాజకీయ నాయకులను ఆలయ కమిటీ పెద్దలు ఆహ్వానించడం జరిగింది. అందులో భాగంగా బుధవారం ఆలయ కమిటీ పెద్దలు ఆహ్వానం మేరకు వైసీపీ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు దర్శనానికి రావడం జరిగింది.దీనిపై కొందరు వ్యక్తులు సోషల్ మీడియా వేదికగా రామచంద్రపురం నియోజకవర్గం ప్రజలకు తప్పుడు సంకేతాలు ఇస్తూ పోస్ట్ పెట్టడంతో ఆలయ కమిటీ వారు మనోభావాలు దెబ్బ తిన్నాయని అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక పోలీస్ స్టేషన్ లో కంప్లైంట్ ఇచ్చారు. ఈ సందర్భంగా కమిటీ పెద్దలు మీడియాతో మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా గుడి పెద్దలమైన మేము నియోజకవర్గం అధికారులుకు, నాయకులుకు స్వాగతం పలికి దర్శనం నిమిత్తం అన్ని ఏర్పాట్లు చేసాము.అయితే అ సందర్భంలో వచ్చిన అధితిలతో ఫోటో దిగడం జరిగింది.ఆవిధంగా దిగిన గ్రూప్ ఫోటోను తోట త్రిమూర్తులు వైయస్సార్సీపి కండువా కప్పినట్లుగా, మార్ఫింగ్ చేసి సోషల్ మీడియా ప్రచారాల్లో పెట్టడం జరిగింది. పవిత్రమైన ఆలయం దగ్గర దుష్ట రాజకీయాలు చేయడం ఆలయ కమిటీ సభ్యులుగా మనోభావాలు దెబ్బతీసే విధంగా ఫోటోలు పెట్టడంతో ఆలయ ప్రతిష్ట భంగం కలిగించే విధంగా ఉన్నాయని రామచంద్రపురం పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశామని తెలిపారు. ఈ కుట్ర వెనకాల ఉన్న వ్యక్తులను బహిర్గతం చేసి రామచంద్రపురం నియోజకవర్గం ప్రజలకు నిజ నిజాలు తెలియజేయాలని పోలీస్ వారిని కోరడం జరిగిందని అన్నారు.

# జెడ్పీ బాలికోన్నత పాఠశాలకు బీరువా బహుకరణ

## దివంగత మెర్ల తాతారావు మాస్టారు జ్ఞాపకార్థం...



**మండపేట టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** మండపేట డాక్టర్ పాలడుగు సత్యవతి చంద్రమౌళి జిల్లా ప్రజా పరిషత్ బాలికొన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో దివంగత మెర్ల తాతారావు మాస్టారు జ్ఞాపకార్థంగా వారి మనవరాళ్లు గుండపునీడి రవళి, గుండపునీడి రేణుక చౌదరిలు పాఠశాలకు రెండు గోద్రెజ్ బీరువాలు రెండు సింక్ లు అందజేశారు. సుమారు రూ.40 వేలు విలువైన వస్తువులు పాఠశాల హెచ్ఎం ముంగర వెంకటరాజుకు అందజేశారు. ఈ బీరువాలను మండల విద్యాశాఖ అధికారి నాయుడు రామచందర్రావు ప్రధానోపాధ్యాయులు ముంగర వెంకటరాజు ఉపాధ్యాయులు సమక్షంలో రిబ్బన్ కట్ చేసి పాఠశాల రికార్డులు భద్రపరిచేందుకు ప్రారంభించారు.ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ పాఠశాలలో పూర్వ విద్యార్థిని తిరిగి ఇక్కడే ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న మెర్ల సుధారాణి తన తండ్రి పేరిట వారి చిన్నారులచే బహుకరించడం చాలా గొప్ప విషయం అన్నారు. పూర్వపు విద్యార్థులు పాఠశాలకు సహాయం చేయాలనే మంచి సంకల్పాన్ని కొనియాడారు.ఈ కార్యక్రమంలో బి సాయిరాం, సాయిబాబా,సుధారాణి, మేక సునీత,తదితరులు పాల్గొన్నారు.

# రిక్షా స్టాండ్ బోర్డును యధా స్థానంలో పెట్టించండి..

## చైర్ పర్సన్ రాణిని కలిసిన రిక్షా కార్మికులు



**మండపేట టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** మండపేట పట్టణంలో బస్టాండ్ లో గల రిక్షా స్టాండ్ కార్మికులు మున్సిపల్ చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గారాణి ను శుక్రవారం ఆమె ఛాంబర్ లో కలిశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల కాలంలో తమ రిక్షాస్టాండ్ బోర్డ్ ను మున్సిపల్ అధికారులు తొలగించారని తిరిగి యధా స్థానంలో పెట్టించాలని కోరారు.తమకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా రిక్షా స్టాండ్ షెడ్ కొలతలు తీసుకుంటున్నారని వాపోయారు. అటువంటి చర్యలు ద్వారా తాము ఆందోళనకు గురవుతున్నామని ఫిర్యాదు చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎమ్మార్పీఎస్ నాయకులు ధూళి జయరాజు మాదిగ, కౌన్సిలర్ మందపల్లి రవి కుమార్,వైస్సార్సీపీ నాయకులు ఎర్రగుంట అయ్యప్ప,రిక్షా యూనియన్ టౌన్ ప్రెసిడెంట్ అయినవల్లి రమణ,చాపల సత్తియ్య,మడికి ఆనందరావు,అడ్డాల సత్తిబాబు,వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# పాలకూర, మెంతి కూర.. ఆరోగ్యానికి ఏది బెస్ట్..



ఆకుకూరలు ఆరోగ్యానికి ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయి.వీటిని తినడం వల్ల మనకు అనేక ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయి. వీటిలో చాలా మంది ఎక్కువగా పాలకూర, మెంతులు, ఆవాలు ఆకుకూరలు వంటికి ఎక్కువగా వాడుతారు. అయితే వీటి మూడింటిలో దేనిలో ఎక్కువ పోషకాలు ఉంటాయి. ఆకు కూరలు మన ఆరోగ్యానికి ప్రయోజనకరంగా భావిస్తారు.. ఎందుకంటే అవి అమితమైన పోషకాలను కలిగి ఉంటాయి. అయితే కొన్ని ఆకుకూరలు రుచికి కొంచెం బాగోలేక పోవడం వలన పిల్లలు వాటిని తినడానికి వెనకాడుతారు. కానీ పాలకూర, మెంతులు, ఆవాలు వంటి ఆకుకూరలు మనకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయి. ఈ ఆకుకూరల్లో కొన్నింటిలో ఇనుము సమృద్ధిగా ఉంటే, మరికొన్నింటిలో ప్రోటీన్లు అద్భుతంగా ఉంటాయి. దీనివల్ల ఏ ఆకుకూరలు ఎక్కువ పోషకాలు అందిస్తాయి.. వేటిని తినాలని చాలా మంది ప్రజలు ఆలోచిస్తారు. హెల్త్‌లైన్ ప్రకారం, పాలకూరలో మనకు ఇనుము పుష్కలంగా లభిస్తుంది. ఇవి మన శరీరంలో రక్తహీనతకు సహాయపడుతుంది. ఇనుముతో పాటు, పాలకూరలో కేలరీలు, ప్రోటీన్, కార్బోహైడ్రేట్లు, ఫైబర్, కొవ్వు వంటి వివిధ విటమిన్లు కూడా ఉంటాయి, ఇవి శరీరానికి అనేక ప్రయోజనాలను అందిస్తాయి. పాలకూరలో ఉండే ఫైబర్ కంటెంట్ జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. ఇంకా, దాని యాంటీఆక్సిడెంట్లు ఒత్తిడి స్థాయిలను తగ్గిస్తాయి. పాలకూర తినడం కళ్ళకు ప్రయోజనకరంగా ఉంటుందని ఆరోగ్యనిపుణులు చెబుతున్నారు. అంతేకాకుండా ఇది మన శరీరంలో రక్తపోటును కూడా తగ్గించేందుకు సహాయపడుతుంది.

మన ఆరోగ్యానికి ఆవాల ఆకుకూరలు కూడా ఒక మంచి ఎంపిక. వీటిలో పోషకాలతో కూడా సమృద్ధిగా ఉంటాయి. అంతేకాకుండా కేలరీలు, ప్రోటీన్, కొవ్వు,

బాగా

కార్బోహైడ్రేట్లు, విటమిన్ ఎ, విటమిన్ బి6, విటమిన్ సి, విటమిన్ ఇ విటమిన్ కె కూడా ఉంటాయి. వాటిలో కాల్షియం, ఐరన్, పొటాషియం కూడా ఉంటాయి. యాంటీఆక్సిడెంట్‌గా, ఆవాల ఆకుకూరలు వివిధ ఆరోగ్య పరిస్థితులకు ప్రయోజనకరంగా ఉంటాయి.ఇవి మన శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచేందుకు దోహదపడుతాయి.వీటిలో ఉండే బీటా-కెరోటిన్ మన గుండె ఆరోగ్యాన్ని కాపాడుతుంది. మెంతి ఆకుకూరను ఆరోగ్యానికి చాలా ప్రయోజనకరంగా భావిస్తారు.ఎందుకంటే వీటిలో విటమిన్లు ఎ, సి, కె ఉంటాయి. ఇవి ఇనుము, కాల్షియం, ఫైబర్, ప్రోటీన్,యాంటీఆక్సిడెంట్లు కూడా ఉంటాయి.ఇవన్నీ మన శరీరభాగాల పనితీరును మెరుగుపరుస్తాయి.వీటిలో ఫైబర్ కంటెంట్ అధికంగా ఉండటం వల్ల, అవి జీర్ణక్రియను మెరుగుపరుస్తాయి.

## నిద్రపోవాలంటే..



ప్రస్తుత రోజుల్లో చాలా మంది నిద్రలేమి సమస్యతో ఇబ్బందిపడుతున్నారు. నిద్రలేకపోవడం వల్ల చాలా సమస్యలు వస్తాయి. రాత్రుళ్ళు సరైన నిద్ర లేకపోతే, ఆ మరుసటి రోజంతా చాలా చిరాగ్గా ఉంటుంది. ఏ పనిపైన కాన్సంట్రేట్ చేయలేరు. చాలా ఇబ్బందిగా అనిపిస్తుంది. మీరు కూడా రాత్రి సరిగా నిద్ర రావటం లేదని బాధపడుతున్నారా? అయితే, ఈ చిన్న చిట్కాతో హాయిగా నిద్రపోవచ్చు. రాత్రి పడుకునే ముందు ఒక గ్లాసు పాలు తాగితే హాయిగా ప్రశాంతంగా నిద్రపోవచ్చు. పాలలో ట్రిప్టోఫాన్ అనే అమినో యాసిడ్ పుష్కలంగా ఉంటుంది. ఇది మంచి నిద్ర రావడానికి సహాయపడుతుంది. పాలలో ప్రోటీన్, విటమిన్లు, కాల్షియం వంటి అవసరమైన పోషకాలు కూడా ఉన్నాయి. ఇవి మొత్తం ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడతాయి. పాల పదార్థలలో మెగ్నీషియం, జింక్ ఉంటుంది. ఇవి మెదడు రసాయనాల ఉత్పత్తిలో కీలక పాత్ర పోషిస్తాయి. ఇవి సరైన మోతాదులో అందితే శరీరం ఆరోగ్యమైన నిద్రను పొందుతుంది. పాలు తాగడం వలన బలమైన ఎముకలు, కండరాలను నిర్మించడంలో సహాయపడతాయి. మంచి నిద్రను పొందేల చేసి ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. పాలు, పాల పదార్ధాల్లో ట్రిప్టోఫాన్ అనే సహజమైన అమినో ఆమ్లం ఉంటుంది. సెరోటోనిన్ , మెలటోనిన్ లాంటి మెదడు రసాయనాల నిర్మాణానికి అవసరమైన ముఖ్యమైన మూలకంగా పనిచేస్తుంది. ఇది మన మనస్సు ను విశ్రాంతి చెందేలా చేసి హాయిగా నిద్ర పోయేలా సహాయపడతాయి. పలు పరిశోధనల ప్రకారం పాలు, ఇతర పాల ఆహారాల్లో ఉండే యాంటీఆక్సిడెంట్లు, యాంటి ఇన్ఫ్లమేటరీ సమ్మేళనాలు శరీరాన్ని ప్రశాంతంగా ఉంచడంలో సహాయపడతాయి. దీని వలన మంచి నిద్రను పొందవచ్చు. పాలలో అధిక నాణ్యత గల ప్రోటీన్లు కండరాల పునరుద్ధరణకు సహాయ పడతాయి. దీనిలోని ప్రోటీన్ నెమ్మదిగా జీర్ణమవుతుంది. విశ్రాంతి తీసుకుంటున్న సమయంలో కండరాలు బలంగా తయారు అవుతాయి.

## సూర్య నమస్కారాలతో ఇన్ని లాభాలా?



నేటి బిజీ బిజీ లైఫ్‌లో చాలా మంది ప్రజలు తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తారు. కానీ, మీ రోజును కేవలం 10 నిమిషాల సూర్య నమస్కారంతో ప్రారంభించడం వల్ల మీ శరీరానికి శక్తివంతం కావడమే కాకుండా అనేక ఆరోగ్య సమస్యలను దూరం చేసుకోవచ్చు అంటున్నారు నిపుణులు.. సూర్య నమస్కారం అనేది 12 యోగా భంగిమలను కలిపి పూర్తి శరీర వ్యాయామంగా పరిగణించబడే యోగాభ్యాసం. ప్రతిరోజు ఉదయాన్నే సూర్యనమస్కారాలు చేయడం వల్ల ఎన్నో రకాల ప్రయోజనాలు పొందుతారు. ప్రతి రోజూ ఉదయం సూర్య నమస్కారం చేయడం వల్ల శరీర జీవక్రియ సక్రియం అవుతుంది. ఇది జీర్ణక్రియను వేగవంతం చేస్తుంది. మలబద్ధకం, గ్యాస్, అజీర్ణం వంటి కడుపు సమస్యల నుండి ఉపశమనం కలిగిస్తుంది. ఇది ప్రేగులను కూడా పూర్తిగా శుభ్రపరుస్తుంది. ముఖ్యంగా మహిళలు ప్రతిరోజు ఉదయం సూర్య నమస్కారం చేస్తే పురుషుల కంటే ఎక్కువ లాభాలు పొందుతారట. సూర్యనమస్కారాల విధానం ద్వారా శరీరంలోని అన్ని వ్యవస్థలను ప్రభావితం చేస్తుంది. సూర్య నమస్కారాలు వెన్నెముక సామర్థ్యాన్ని మెరుగుపరచడంతో పాటు వెన్నెముక, భుజాలు, చేతులు, కాళ్ళ కండరాలను బలపరుస్తాయి. సూర్య నమస్కారం చేయడం వల్ల శరీరానికి నూతన శక్తి లభిస్తుంది. ఉదయాన్నే ఈ యోగాసనం చేయడం వల్ల మీ శరీరం చురుగ్గా మారుతుంది. ఉదయం నిద్ర లేచిన తర్వాత మహిళలు సూర్య నమస్కారాలు చేస్తే రక్త ప్రసరణ వ్యవస్థ మెరుగుపడుతుంది..చర్మం ప్రకాశవంతంగా, యవ్వనంగా మారుతుంది. అలాగే, జీర్ణక్రియ సమస్యలతో బాధపడుతున్న మహిళలు ఉదయాన్నే సూర్యనమస్కారం చేస్తే మంచి ఫలితాలు పొందుతారు. ప్రతి రోజు ఉదయం సూర్య నమస్కారం చేస్తే జ్ఞాపకశక్తి కూడా మెరుగుపడుతుందని నిపుణులు చెబుతున్నారు. క్రమం తప్పకుండా సూర్యనమస్కారాలు చేయటం వల్ల మెదడులో కొత్త ఆలోచనలు కలుగుతాయి. ఇది దృష్టిని పెంచుతూ పని సామర్థ్యాన్ని మెరుగుపరుస్తుంది. ఒత్తిడిని తగ్గిస్తుంది. శరీరంలోని అదనపు కొవ్వు కరుగుతుంది. ఇది జీవక్రియను వేగవంతం చేస్తుంది. ఫలితంగా బరువు తగ్గడానికి సహాయపడుతుంది. శరీరం సన్నగా, దృఢంగా ఉంటుంది. ముఖ్యంగా మలబద్ధకంతో బాధపడే వారు కూడా ఈ సూర్య నమస్కారాలు చేయడం వల్ల తొందరగా మంచి ఫలితాలు పొందగలుగుతారని నిపుణులు చెబుతున్నారు.

## షుగర్ ఉన్నవాళ్లు అరటిపండు తినొచ్చా..



షుగర్ ఉన్నవారు అరటిపండ్లు తినవచ్చా..? షుగర్ లెవెల్స్ పెరగకుండా ఉండాలంటే అరటిపండును ఎప్పుడు తినాలి..? ఎంత తినాలి ? లేత అరటిపండు ఎందుకు మంచిది..? అరటిపండ్లు మన దేశంలో సర్వసాధారణం. గుడిలో ప్రసాదంగా, టిఫిన్ బాక్స్‌లో స్నాక్‌గా, వ్యాయామం తర్వాత శక్తి కోసం అందరూ దీన్ని ఇష్టపడతారు. అయితే షుగర్ ఉన్నవాళ్లు అరటిపండు తినొచ్చా..? తింటే షుగర్ పెరిగుతుందా? అనే డౌట్లు చాలా మందిలో ఉంటాయి. మధుమేహ వ్యాధిగ్రస్తులు అరటిపండ్లను పూర్తిగా మానేయాల్సిన అవసరం లేదని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. వాటిని తినే సమయం, పరిమాణం, అరటిపండు రకాన్ని బట్టి వాటిని సురక్షితంగా తినవచ్చు. నెమ్మదిగా శక్తి: అరటిపండులోని కార్బోహైడ్రేట్లు నెమ్మదిగా జీర్ణమవుతాయి. అందుకే షుగర్ లెవెల్స్ అకస్మాత్తుగా పెరగవు. ఇది చక్కెరలో ఆకస్మిక పెరుగుదలను నివారిస్తుంది. ఫైబర్: ఇందులో ఉండే ఫైబర్ చక్కెర రక్తంలోకి త్వరగా చేరకుండా అడ్డుకుంటుంది. పోటాషియం: కండరాలు సరిగ్గా పనిచేయడానికి, అలసట తగ్గడానికి పొటాషియం చాలా ఉపయోగపడుతుంది. వ్యాయామం చేసే షుగర్ పేషెంట్లకు ఇది మంచిది. విటమిన్లు: విటమిన్ సి, విటమిన్ బి6 వంటి పోషకాలు రోగనిరోధక శక్తిని పెంచుతాయి. మానసిక ప్రశాంతత: అరటిపండులో ఉండే విటమిన్ బి6 మనసును ప్రశాంతంగా ఉంచే రసాయనాలను ఉత్పత్తి చేయడంలో సహాయపడుతుంది. షుగర్ ఉన్నవాళ్లు అరటిపండ్లు తినవచ్చా? అరటిపండు మితమైన గ్లైసెమిక్ సూచికను కలిగి ఉంటుంది. అంటే ఇది ఇతర స్వీట్ల కంటే నెమ్మదిగా చక్కెరను పెంచుతుంది. అయితే మీరు ఎంత తింటున్నారు..? అనేదానిపై నియంత్రణ ముఖ్యం. నిపుణుల సలహా: మీ ఆరోగ్య పరిస్థితిని బట్టి ఎప్పుడు, ఎంత తినాలి అనేది మీ డైటీషియన్ లేదా డాక్టర్ సలహా తీసుకోవడం మంచిది. అరటిపండు తినడానికి సరైన సమయం ఏది? అరటిపండ్లను అన్నం లేదా రోటీ వంటి కార్బోహైడ్రేట్ ఎక్కువగా ఉండే భోజనంతో కలిపి తినకూడదు. సరైన పద్ధతి: అరటిపండ్లను ఉదయం టిఫిన్ తర్వాత లేదా మధ్యాహ్నం భోజనంలో స్నాక్‌గా తినడం మంచిది. ఉదయం లేదా మధ్యాహ్నం తినడం వల్ల మీరు చేసే పనుల ద్వారా కేలరీలు ఖర్చవుతాయి. ఇది చక్కెర స్థాయిలు అకస్మాత్తుగా పెరిగే ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ఏ రకమైన అరటిపండు తినాలి..? అరటిపండు ఎంత పండితే.. అందులో చక్కెర శాతం అంత పెరుగుతుంది. కొద్దిగా పండని (లేత) అరటిపండ్లను ఎంచుకోవడం వల్ల చక్కెర తక్కువగా ఉంటుంది. కాబట్టి అవి షుగర్ పేషెంట్లకు మరింత మంచివి.

## ప్రకృతి ఇచ్చిన వరం కాకర ఆకులు..



భారతీయులు ఉపయోగించే కూరాగాయాల్లో కాకర కాయ ఒకటి. అయితే కాకర కాయ చేదుగా ఉంటుంది కనుక ఎక్కువ మంది దీనిని తినడానికి ఇష్టపడరు. అయితే కాకరకాయ మధుమేహ నియంత్రణ సహా ఎన్నో ఆరోగ్యప్రయోజనాలు ఇస్తుంది. కాకరకాయ మాత్రమే కాదు కాకరకాయ ఆకులు కూడా అనేక ప్రయోజనాలు ఇస్తుందని తెలుసా.. కాకర ఆకులుమధుమేహాన్ని నియంత్రించడంలో కూడా సహాయపడుతుంది. దీనిని ఆహారంలో ఎలా చేర్చుకోవచ్చు? కాకరకాయ చేదుగా ఉంటుంది. అయితే ఇది ఔషధ గుణాలతో ప్రసిద్ధి చెందింది. ఇది చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది. దాని ఆకులు ఆరోగ్యానికి కూడా మేలు చేస్తాయి. కాకరకాయతో పాటు దీని ఆకులు చాలా కాలంగా ఆయుర్వేదంలో వివిధ వ్యాధుల చికిత్సకు ఉపయోగించబడుతున్నాయి. కాకరకాయ ఆకులు ఆకుపచ్చగా ఉంటాయి. అంచులు ముళ్ళు తరహాగా ఉంటాయి. చేదు రుచిని కలిగి ఉంటాయి. ఈ ఆకులు వివిధ రకాల పోషకాలను కలిగి ఉన్నాయి. వివిధ రకాల వ్యాధుల చికిత్సలో సహాయపడుతున్నాయి. మధుమేహాన్ని నియంత్రించడానికి కాకరకాయని వంటింటి చిట్కాలలో ఉపయోగిస్తారు. ఇది ఫైబర్, విటమిన్లు ఎ, సి సహా ఇతర పోషకాలకు మూలం. కానీ దీని ఆకులు కూడా ప్రయోజనకరం అని నిపుణులు చెబుతున్నారు. నిపుణులు ఏమంటున్నారు? ఆయుర్వేద నిపుణుడు కిరణ్ గుప్తా కాకర ఆకుల ఆరోగ్య ప్రయోజనాల గురించి మాట్లాడుతూ.. కాకరకాయ ఆకులు మధుమేహాన్ని తగ్గించడంలో సహాయపడతాయని వివరించారు. వీటిల్లో ఇన్సులిన్ లాంటి సమ్మేళనాలు ఉన్నాయి. ఇవి రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడతాయి. ప్రతిరోజూ కాకర ఆకుల రసం తాగడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు నియంత్రించబడతాయి. జీర్ణక్రియకు ప్రయోజనకరంగా ఉంటుంది. కడుపును శుభ్రపరచడంలో సహాయపడుతుంది. కాకరకాయ ఆకులను తీసుకోవడం వల్ల శరీరానికి ఐరెన్, ఫోలిక్ ఆమ్లం లభిస్తుంది. హిమోగ్లోబిన్‌ను పెంచడానికి ప్రయోజనకరంగా ఉంటాయి. కాకరకాయ ఆకులను రసం తయారు చేసుకుని తాగడం లేదా పచ్చిగా నమలడం చేయాలి. కాకర ఆకుల రసాన్ని ఎలా చేసుకోవాలంటే 6 నుంచి 8 కాకరకాయ ఆకులను తీసుకుని బాగా కడిగి.. మిక్సీ గిన్నెలో వేసుకుని కొంచెం నీరు వేసి గ్రైండ్ చేసుకోవాలి. తర్వాతా ఈ రసాన్ని వడకట్టి ఉదయం ఖాళీ కడుపుతో తీసుకోవాలి. ఇది రక్తంలో చక్కెరను నియంత్రించడంలో పాటు.. హిమోగ్లోబిన్‌ను పెంచడంలో సహాయపడుతుంది. ప్రత్యామ్నాయంగా కాకరకాయ ఆకులను నీటితో శుభ్రం చేసుకుని పచ్చిగా నమలవచ్చు. అయితే మితంగా తీసుకోవాలి. అధిక పరిమాణంలో తీసుకోవడం వల్ల లో షుగర్ లేదా ఇతర ఆరోగ్య సమస్యలు వస్తాయి.

## బిజినెస్ వాయిస్

### భారత్ వృద్ధిరేటు అంచనాలు తగ్గింపు




భారత్ వృద్ధిరేటు అంచనాలను ఆసియా అభివృద్ధి బ్యాంక్ (ఎడిఒ) తగ్గించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారత్ వృద్ధిరేటు 6.5 శాతంగా ఉండొచ్చని ఆసియాన్ డెవలప్‌మెంట్ ఔట్‌లుక్ నివేదిక వెల్లడించింది. ఈ యేడాది ప్రథమార్థంలో 7.8 శాతం వృద్ధిరేటు నమోదు చేసినా.. ద్వితీయార్థంలో అదికాస్త తగ్గే అవకాశం ఉందని అంచనా వేసింది. మెరుగైన వినియోగం, ప్రభుత్వ వ్యయం కారణంగా 2025-26 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో జిడిపి వృద్ధిరేటు 7.8 శాతంగా నమోదైంది. అయితే అమెరికా ప్రభుత్వం విధించిన సుంకాల ప్రభావం ఎగుమతులపైనా పడుతుందని, అందువల్లే ఈ ఆర్థిక సంవత్సరం రెండోభాగంతో పాటు వచ్చే ఏడాదిలోనూ వృద్ధి రేటు తగ్గనుంది. అయితే స్థిరమైన దేశీయ డిమాండ్, సేవారంగ ఎగుమతులు సుంకాల ప్రభావాన్ని కాస్త తగ్గించొచ్చని నివేదికలో పేర్కొంది. ఇతర దేశాలకు ఎగుమతులు పెరగడం, జిడిపిలో వాటి వాటా తక్కువగా ఉండటం కలిసొస్తుందని తెలిపింది. ఇక, బడ్జెట్ అంచనాల ప్రకారం ద్రవ్యలోటు 4.4 శాతం. అయితే అప్పుడు జిఎస్‌టి కోతలను అందులో ఎక్కడా ప్రస్తావించలేదు. ఈ కోతలతో పన్ను ఆదాయం కొంతమేర తగ్గి, ద్రవ్యలోటు పెరిగేందుకు కారణమవుతుందని ఈ నివేదిక అంచనా వేసింది.

### బయటి షాక్‌లను తట్టుకోవడంలో భారత్ సామర్థ్యం బలమైనది




ప్రపంచ ఆర్థికవ్యవస్థ నిర్మాణాత్మక మార్పును చూస్తోందని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. ఇలాంటి తరుణంలో బయటి నుంచి ఆకస్మికంగా తగిలే షాక్‌లను తట్టుకోవడంతో భారత్ సామర్థ్యం బలంగా ఉందని పేర్కొన్నారు. శుక్రవారం ఢిల్లీలో జరిగిన కౌటిల్య ఎకనామిక్ కాన్‌క్లేవ్-2025లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్మలాసీతారామన్ మాట్లాడుతూ.. ఆర్థిక, ఇంధన అసమతుల్యతను ఎదుర్కోవడం కూడా దేశాల ముందున్న కర్తవ్యమని పేర్కొన్నారు. భౌగోళిక రాజకీయ సంఘర్షణలు తీవ్రమవుతున్నాయని, ఆంక్షలు, సుంకాలు, విభేదాలు ప్రపంచ సరఫరా గొలుసులను దెబ్బతీస్తున్నాయని ఆమె ఆందోళన వ్యక్తంచేశారు. ఇవి భారత్‌కు కూడా దెబ్బేనని, వీటన్నింటినీ బలంగా ఎదుర్కొనే సామర్థ్యం భారత్‌కు ఉందని అన్నారు. దేశ ఆర్థిక పరపతి కూడా అభివృద్ధి చెందుతోందని నిర్మలాసీతారామన్ చెప్పారు. యుద్ధాలు, వ్యూహాత్మక పోటీలు, సంఘర్షణ సరిహద్దులను తిరగ రాస్తున్నాయని అన్నారు. గతంలో బలంగా ఉన్న సంబంధాలు ఇప్పుడు పరీక్షలు ఎదుర్కొంటున్నాయి, కొత్త సంకీర్ణాలు ఉద్భవిస్తున్నాయని చెప్పారు. అయితే భారత ఆర్థిక వ్యవస్థ నిలకడగా ఉందని, స్థిరంగా వృద్ధి చెందుతూనే ఉందని తెలిపారు. యాదృచ్ఛికంగా భారత్ ఈ స్థాయికి రాలేదని, అనేక శక్తిమంతమైన సంస్కరణల ద్వారా వచ్చిందని చెప్పారు.

# తొలి ట్రిలియనీర్ దిశగా కుబేర ఎలాన్‌మస్క్ రికార్డు!




ఎలాన్‌మస్క్ రికార్డు సృష్టించారు. ఫోర్బ్స్ ప్రకారం ఎలాన్ మస్క్ చరిత్రలో తొలి వ్యక్తిగా 500 బిలియన్ డాలర్లకుపైగా సంపత్తి కలిగిన వ్యక్తిగా నిలిచారు. ఇది ప్రధానంగా టెస్లా షేర్ల విలువ పెరగడం, ఆయన ఇతర కంపెనీలు.. ఎఐ స్టార్టప్ ఎక్స్ ఎఐ, రాకెట్ కంపెనీ స్పేస్‌ఎక్స్.. విలువ పెరగడం వల్ల సాధ్యమైంది. బుధవారం మధ్యాహ్నం ఫోర్బ్స్ బిలియనేర్స్ జాబితాలో మస్క్ సంపత్తి 500.1 బిలియన్ డాలర్లుగా నమోదైంది. టెస్లా షేర్లు బుధవారం సుమారు 4 శాతం పెరిగి, మస్క్ సంపత్తిలో మరో 7 బిలియన్ డాలర్లు చేరువయ్యాయి. ఈ ఏడాదిలో టెస్లా షేర్లు 14 శాతం పైగా పెరిగాయి. సెప్టెంబర్ 15 నాటికి మస్క్ టెస్లాలో 12.4 శాతం వాటా కలిగి ఉన్నారు. వాహన అమ్మకాలు తగ్గడం, లాభాల ఒత్తిళ్ల వంటి సమస్యలతో టెస్లా షేర్లు "ప్రధాన ఏడు టెక్ కంపెనీలు" టెక్ స్టాక్‌లలో తక్కువ పెరుగుదల చూపాయి. ఇటీవల మస్క్ సుమారు 1 బిలియన్ డాలర్లు విలువైన టెస్లా షేర్లు కొని, కంపెనీ భవిష్యత్తుపై విశ్వాసం చూపించారు. గత నెలలో టెస్లా బోర్డు మస్క్‌కి 1 ట్రిలియన్ డాలర్లు పరిహార ప్రణాళిక ప్రతిపాదించింది, అలాగే ఆయనకు ఎక్కువ వాటా ఇవ్వడానికి నిర్ణయం తీసుకుంది. ఎఐ స్టార్టప్ ఎక్స్ ఎఐ, స్పేస్‌ఎక్స్ కంపెనీల విలువ కూడా ఈ ఏడాదిలో పెరిగాయి. జూలైలో ఎక్స్ ఎఐ విలువ సుమారు 75 బిలియన్ డాలర్లుగా ఉంది. సిఎన్‌బిసి ప్రకారం.. ఎక్స్ ఎఐ 200 బిలియన్ విలువను సాధించడానికి ప్రయత్నిస్తోంది. కానీ మస్క్ ఆ సమయంలో ఇలాంటి ప్లాన్ లేదని చెప్పారు. రానున్న రోజుల్లో మార్కెట్ విలువను భారీగా పెంచేందుకు టెస్లా ముమ్మర ప్రయత్నాలు చేస్తోంది. రానున్న రోజుల్లో రోబోట్యాక్సీ, ఏఐ మార్కెట్ విస్తరణ వంటి లక్ష్యాలను పెట్టింది. ఈ పనితీరు లక్ష్యాలను ఎలాన్‌మస్క్ సాధిస్తే ప్రతిపాదిత ప్రోత్సాహక ప్యాకేజీ కింద ఆయనకు భారీగా షేర్లు సమకూరనున్నాయి. దాదాపు 900 బిలియన్ డాలర్లు సమకూరనున్నట్లు అంచనా. దాంతో ఆయన సంపద విలువ ట్రిలియన్ డాలర్లు దాటిపోవచ్చని అంచనా. అయితే ప్రస్తుతం ఆయన కొన్ని సవాళ్లను ఎదుర్కొంటున్నారు. చైనాలోని బీవైడీ తదితర కంపెనీల నుంచి పోటీ కూడా పెరిగింది. జర్మనీలో కూడా అమ్మకాలు పడిపోయాయి. ఈయూ దేశాల్లోను ఇదే పరిస్థితి. భారీ విస్తరణ అంచనాలను వెల్లడించింది.

## చెక్కుల క్లియరెన్స్ కోసం నూతన నిబంధనలు తెలిపిన ఆర్‌బీఐ

బ్యాంకు కస్టమర్లకు ఇది శుభవార్త. చెక్కుల క్లియరెన్స్ కోసం ఇకపై రోజుల తరబడి వేచి చూడాల్సిన అవసరం లేదు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) తీసుకొచ్చిన కొత్త నిబంధనల ప్రకారం, రేపటి (అక్టోబర్ 4) నుంచి 'అదే రోజు చెక్ క్లియరెన్స్' విధానం అమల్లోకి రానుంది. దేశంలోని ప్రముఖ ప్రైవేట్ బ్యాంకులైన హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐ సహా పలు బ్యాంకులు ఈ కొత్త విధానాన్ని ప్రారంభించనున్నట్లు ప్రకటించాయి. ఈ నూతన విధానం వల్ల, కస్టమర్లు తమ ఖాతాలో జమ చేసిన చెక్కులు కేవలం కొన్ని గంటల్లోనే క్లియర్ అవుతాయి. చెల్లింపుల ప్రక్రియను మరింత వేగంగా, సురక్షితంగా మార్చేందుకు ఆర్‌బీఐ ఈ మార్పులు తీసుకొచ్చింది. ఈ నేపథ్యంలో, చెక్కులు బౌన్స్ కాకుండా ఉండేందుకు ఖాతాదారులు తమ అకౌంట్లలో సరిపడా నగదు నిల్వలు ఉంచుకోవాలని బ్యాంకులు సూచిస్తున్నాయి. అలాగే చెక్కులపై వివరాలను తప్పులు లేకుండా స్పష్టంగా నింపాలని కోరుతున్నాయి. చెక్కుల భద్రతను పెంచేందుకు 'పాజిటివ్ పే సిస్టమ్'ను తప్పనిసరిగా ఉపయోగించాలని బ్యాంకులు స్పష్టం చేశాయి. దీని ప్రకారం, రూ.50,000 కంటే ఎక్కువ విలువైన చెక్కులను బ్యాంకులో జమ చేయడానికి కనీసం 24 గంటల ముందు ఖాతాదారులు కొన్ని కీలక వివరాలను బ్యాంకుకు అందించాలి. అకౌంట్ నంబర్, చెక్ నంబర్, తేదీ, చెక్ మొత్తం, లబ్ధిదారుడి పేరు వంటి వివరాలను బ్యాంకుకు తెలియజేయాలి. ఈ వివరాలను రీజనల్ ఆఫీసులకు కేటాయించిన ఈ-మెయిల్ ఐడీలకు పంపించాల్సి ఉంటుంది. బ్యాంకులో చెక్కును సమర్పించినప్పుడు, ముందుగా అందించిన వివరాలతో సరిపోల్చి చూస్తారు. అన్నీ సక్రమంగా ఉంటేనే చెక్కును క్లియర్ చేస్తారు. వివరాలు సరిపోలకపోతే ఆ చెక్కును తిరస్కరిస్తారు. రూ.5 లక్షలు దాటిన చెక్కులకు పాజిటివ్ పే విధానం తప్పనిసరి అని ఆర్‌బీఐ ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది.




ప్రస్తుతం చెక్కుల క్లియరెన్స్ కోసం బ్యాంకులు చెక్ ట్రంకేషన్ సిస్టమ్ (సీటీఎస్)ను వాడుతున్నాయి. దీనివల్ల ఏటీఎం లేదా డ్రాప్ బాక్సుల్లో వేసిన చెక్కులు క్లియర్ కావడానికి కనీసం రెండు రోజులు పడుతోంది. కొత్త విధానంతో ఈ జాప్యం పూర్తిగా తొలగిపోనుంది.

## క్రీడా వాయిస్

# 21 నిమిషాల్లో 100 పరుగులు




క్రికెట్‌లో అత్యంత వేగవంతమైన సెంచరీల గురించి మాట్లాడినప్పుడు, చాలామంది తక్కువ బంతుల్లో వచ్చిన సెంచరీలను గుర్తు చేసుకుంటారు. కానీ, కేవలం 21 నిమిషాల్లోనే సెంచరీ సాధించిన రికార్డు ఏ ఆటగాడి పేరు మీద ఉందో చాలా తక్కువ మందికి తెలుసు. ఈ అద్భుతమైన ఘనత సాధించింది ఇంగ్లాండ్ ఆల్‌రౌండర్ గ్లెన్ చాపెల్. క్రికెట్ చరిత్రలో అత్యంత వేగవంతమైన సెంచరీల గురించి చర్చ వచ్చినప్పుడల్లా బంతుల ఆధారంగా సాధించిన సెంచరీలు మాత్రమే గుర్తుకు వస్తాయి. కానీ, టైం ఆధారంగా అత్యంత వేగవంతమైన సెంచరీ రికార్డు ఇంగ్లాండ్ ఆల్‌రౌండర్ గ్లెన్ చాపెల్ పేరు మీద ఉంది. చాపెల్ 1993లో ఒక ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లో కేవలం 21 నిమిషాల్లోనే సెంచరీ బాది సంచలనం సృష్టించాడు. ఈ రికార్డు 32 సంవత్సరాల తర్వాత కూడా అజేయంగా నిలిచి ఉంది. లంకాషైర్ తరపున ఆడుతున్న చాపెల్ 1993 జూలై 15న గ్లామోర్గన్ పై ఈ అద్భుతాన్ని సాధించాడు. లంకాషైర్ రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్ చేయడానికి దిగినప్పుడు, చాపెల్ ఓపెనర్‌గా క్రీజ్‌లోకి వచ్చాడు. క్రీజ్‌లోకి అడుగుపెట్టిన వెంటనే అతను బౌలర్లపై విరుచుకుపడ్డాడు. చాపెల్ కేవలం 21 నిమిషాల్లో, 27 బంతుల్లోనే సెంచరీని పూర్తి చేశాడు. ఈ ఇన్నింగ్స్‌లో అతని బ్యాట్ నుండి 10 ఫోర్లు, 9 సిక్సర్లు వచ్చాయి. సమయం పరంగా ఇది ఫస్ట్ క్లాస్ క్రికెట్ చరిత్రలో ఇప్పటివరకు నమోదైన అత్యంత వేగవంతమైన సెంచరీ. అంతకుముందు ఈ రికార్డు ఆస్ట్రేలియాకు చెందిన టామ్ మూడీ పేరు మీద ఉండేది. మూడీ 1990లో వార్విక్‌షైర్ పై గ్లామోర్గన్ తరపున ఆడుతూ కేవలం 26 నిమిషాల్లో సెంచరీ చేశాడు. చాపెల్, మూడీ రికార్డును బద్దలు కొట్టి కొత్త చరిత్ర సృష్టించాడు. తొలి ఇన్నింగ్స్‌లో లంకాషైర్ 310 పరుగులు చేసింది. సమాధానంగా, గ్లామోర్గన్ 303 పరుగులకు తమ ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. దీంతో లంకాషైర్‌కు కేవలం 7 పరుగుల స్వల్ప ఆధిక్యం లభించింది. ఆ తర్వాత చాపెల్ ధనాధన్ ఇన్నింగ్స్‌తో లంకాషైర్ కేవలం 12 ఓవర్లలోనే 235 పరుగులు చేసి ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. గ్లామోర్గన్‌కు 243 పరుగుల లక్ష్యం లభించింది, దీనిని వారు కేవలం 52.1 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి సాధించారు. చాపెల్ తుఫాన్ సెంచరీ జట్టును గెలిపించలేకపోయినప్పటికీ, క్రికెట్ చరిత్రలో ఈ ఇన్నింగ్స్ శాశ్వతంగా నిలిచిపోయింది.

గ్లెన్ చాపెల్ దేశీయ క్రికెట్ కెరీర్ అద్భుతంగా సాగింది. కానీ, అంతర్జాతీయ క్రికెట్‌లో అదృష్టం అతనితో లేదు. 2006లో అతను ఇంగ్లాండ్ తరపున వన్డే అరంగేట్రం చేశాడు, కానీ అదే మ్యాచ్‌లో గాయపడ్డాడు. కేవలం నాలుగు ఓవర్లు వేసిన తర్వాత అతన్ని మైదానం నుండి బయటకు తీసుకెళ్లారు, ఆ తర్వాత అతనికి మళ్లీ ఇంగ్లాండ్ జట్టు జెర్సీ ధరించే అవకాశం రాలేదు. 32 సంవత్సరాల తర్వాత కూడా చాపెల్ రికార్డు చెక్కుచెదరకుండా ఉంది. నేటి వేగవంతమైన క్రికెట్, టీ20 యుగంలో కూడా ఇంత తక్కువ సమయంలో సెంచరీ సాధించిన ఆటగాడు మరెవరూ రాలేదు. అందుకే క్రికెట్ అభిమానులకు ఈ ఇన్నింగ్స్ ఒక లెజెండరీ కథ కంటే తక్కువ కాదు.

## 14 ఏళ్ల తర్వాత మళ్లీ భారత్‌కు మెస్సీ




ఫుట్‌బాల్ ప్రపంచాన్ని తన అద్భుతమైన ఆటతీరుతో మంత్రముగ్ధుల్ని చేస్తున్న దిగ్గజ ఆటగాడు లియోనెల్ మెస్సీ, దాదాపు 14 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత మళ్లీ భారత గడ్డపై అడుగు పెట్టబోతున్నారు. భారత పర్యటన ఖరారైనట్లు నిర్వాహకులు ప్రకటించడంతో దేశంలోని ఫుట్‌బాల్ అభిమానుల్లో ఉత్సాహం నెలకొంది. ఈ పర్యటనలో భాగంగా ఆయన దేశంలోని పలు నగరాలను సందర్శించనున్నారు. అర్జెంటీనా ఫుట్‌బాల్ స్టార్ లియోనెల్ మెస్సీ "గోట్ టూర్ ఆఫ్ ఇండియా 2025" పేరుతో భారత్‌లో పర్యటించనున్నారు. డిసెంబర్ 13 నుంచి 15 వరకు మూడు రోజుల పాటు జరగనున్న ఈ టూర్‌లో భాగంగా మెస్సీ మొదట కోల్‌కతా, ముంబై, ఢిల్లీ నగరాలను సందర్శించనున్నారు. త్వరలోనే నాలుగో నగరాన్ని కూడా ప్రకటిస్తామని ఈవెంట్ మేనేజర్ తెలిపారు. 2011లో అర్జెంటీనా జాతీయ జట్టుతో కలిసి కోల్‌కతాలో వెనిజులాపై ఒక ఫ్రెండ్లీ మ్యాచ్ ఆడిన తర్వాత మెస్సీ భారత్‌కు రావడం ఇదే తొలిసారి. ఈ పర్యటనపై మెస్సీ స్పందిస్తూ తన పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. "భారత్ చాలా ప్రత్యేకమైన దేశం. 14 ఏళ్ల క్రితం ఇక్కడికి వచ్చినప్పటి మధుర జ్ఞాపకాలు నాకింకా గుర్తున్నాయి. అప్పటి అభిమానుల స్పందన అద్భుతం. ఇప్పుడు కొత్త తరం అభిమానులను కలుసుకోవడానికి, ఫుట్‌బాల్‌పై నాకున్న ఇష్టాన్ని వారితో పంచుకోవడానికి ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను" అని మెస్సీ పేర్కొన్నారు. ఈ పర్యటనలో భాగంగా కోల్‌కతాలోని సాల్ట్ లేక్ స్టేడియం, ముంబైలోని వాంఖడే స్టేడియం, ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలలో ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ముఖ్యంగా కోల్‌కతాలో మెస్సీ విగ్రహాన్ని ఆవిష్కరించడంతో పాటు, ఓ కొత్త స్వచ్ఛంద సంస్థ కార్యక్రమాన్ని కూడా ప్రారంభించనున్నారు. అంతేకాకుండా పశ్చిమ బెంగాల్, మహారాష్ట్ర, ఢిల్లీ రాష్ట్రాల ముఖ్య నేతలతో పాటు, స్థానిక క్రీడా, సినీ ప్రముఖులతో కూడా మెస్సీ సమావేశం కానున్నారు. ఈ డిసెంబర్ పర్యటనకు ముందే, నవంబర్‌లో అర్జెంటీనా ప్రపంచకప్ విజేత జట్టుతో కలిసి మెస్సీ కొచ్చిలో ఓ మ్యాచ్ ఆడనుండటం విశేషం. ఫిఫా అంతర్జాతీయ విండోలో భాగంగా అర్జెంటీనా జట్టు ఈ మ్యాచ్ ఆడనుంది.

# వెస్టిండీస్‌ని మట్టి కరిపించిన భారత బౌలర్లు

వెస్టిండీస్‌తో తొలి టెస్టు మ్యాచ్‌లో భారత బౌలర్లు అద్భుత ప్రదర్శన కనబరిచారు. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం వేదికగా ప్రారంభమైన ఈ మ్యాచ్‌లో పేసర్లు మహమ్మద్ సిరాజ్, జస్ప్రీత్ బుమ్రా నిప్పులు చెరగడంతో కరేబియన్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో కేవలం 162 పరుగులకే కుప్పకూలింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న వెస్టిండీస్ నిర్ణయం పూర్తిగా బెడిసికొట్టింది. ఆట ప్రారంభమైనప్పటి నుంచే భారత బౌలర్లు పూర్తి ఆధిపత్యం ప్రదర్శించారు. ముఖ్యంగా, మహమ్మద్ సిరాజ్ (4/40) తన పదునైన బౌలింగ్‌తో విండీస్ బ్యాటింగ్ ఆర్డర్‌ను కకావికలం చేశాడు. కీలకమైన టాప్ ఆర్డర్ బ్యాటర్లను పెవిలియన్ చేర్చి జట్టుకు శుభారంభం అందించాడు. అతనికి జస్ప్రీత్ బుమ్రా (3/42) కూడా తోడవడంతో విండీస్ ఏ దశలోనూ కోలుకోలేకపోయింది. క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోతూ తీవ్ర ఒత్తిడికి గురైంది. వెస్టిండీస్ బ్యాటర్లలో జస్టిన్ గ్రీవ్స్ చేసిన 32 పరుగులే అత్యధిక స్కోరు కావడం వారి బ్యాటింగ్ వైఫల్యానికి అద్దం పడుతోంది. షాయ్ హోప్ (26), కెప్టెన్ రోస్టన్ చేజ్ (24) కాసేపు క్రీజులో నిలిచినా, భారత బౌలర్ల ధాటికి ఎక్కువసేపు నిలవలేకపోయారు. పేసర్లు విజృంభించిన తర్వాత స్పిన్నర్లు కూడా తమ వంతు పాత్ర పోషించారు. కుల్దీప్ యాదవ్ రెండు వికెట్లు పడగొట్టగా, వాషింగ్టన్ సుందర్ ఒక వికెట్ తీశాడు. మొత్తం మీద 44.1 ఓవర్లలోనే విండీస్ ఇన్నింగ్స్ ముగిసింది. తొలి రోజు ఆటలోనే ప్రత్యర్థిని తక్కువ స్కోరుకు ఆలౌట్ చేసి, టీమిండియా మ్యాచ్‌పై పూర్తి పట్టు సాధించింది. అనంతరం, తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన టీమిండియా 2 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 1 పరుగు చేసింది. ఓపెనర్లు కేఎల్ రాహుల్ (1 బ్యాటింగ్), యశస్వి జైస్వాల్ (0 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు.



# నేహా శెట్టి పాట ప్లస్సయ్యిందా!



ఎడిటింగ్ లో తీసేసిన ఓజి ఐటెం సాంగ్ ని ఇటీవలే జోడించిన సంగతి తెలిసిందే. నేహా శెట్టి మీద బ్యాంకాక్ లో షూట్ చేసిన ఈ ప్రత్యేక గీతం వల్ల పెద్దగా ప్రయోజనం కనిపించడం లేదు. ప్రీ క్లైమాక్స్ కు ముందు పవన్ కళ్యాణ్ గాయపడితే ఇమ్రాన్ హష్మీ వచ్చే టైంలో దర్శకుడు సుజిత్ దీనికి ప్లేస్ మెంట్ ఇచ్చాడు. అయితే సీరియస్ గా జరుగుతున్న నెరేషన్ లో ఇది అడ్డం వస్తుందని భావించి ఫస్ట్ వెర్షన్ లో తీసేశారు. డీజే టిల్లు భామ ఆడిపాడినా ఎందుకు ఇంపాక్ట్ లేదంటే అందులో పవన్ కళ్యాణ్ డాన్స్ చేయడం లాంటివేవీ లేవు కాబట్టి. తమన్ కూడా మిగిలిన సాంగ్స్ రేంజ్ లో దీన్ని కంపోజ్ చేయలేదనే కామెంట్స్ వినిపిస్తున్నాయి. ఏతావాతా చెప్పేదేంటంటే నేహా శెట్టి పాట వల్ల కలిగిన ప్రయోజనం పెద్దగా లేదు. అందుకే తను కూడా ఒకచోట తప్ప ఎక్కడా ఓజి గురించి చెప్పడం కానీ, పవన్ కళ్యాణ్ తో స్క్రీన్ పంచుకున్నందుకు ఎగ్ జైట్మెంట్ చూపించడం కానీ ఏమి చేయలేదు. ఒకే ఫ్రేమ్ లో ఇద్దరు లేనప్పుడు తను మాత్రం ఏం చేస్తుంది. ఒక్కటి మాత్రం వాస్తవం. ఫ్లోకు అడ్డం వస్తాయని తీసేసిన పాటల వల్ల అమాంతం కలెక్షన్లు పెరగడం లాంటివి ఉండవు. దేవర, మిరాయ్ ఎంత పెద్ద హిట్టయినా తర్వాత యాడ్ చేసిన సాంగ్స్ వల్ల ఎక్కువ బెనిఫిట్ పొందలేకపోయాయి. ఒరిజినల్ గా లాక్ చేసిన వర్షన్లే బాగున్నాయని ఆడియన్స్ అనుకునేలా చేశాయి. సుహాస్ సీన్ తీసేయడం, అర్జున్ దాస్ ఫ్లాష్ బ్యాక్ అయ్యాక కాస్త ట్రిమ్ చేయడం లాంటివి కూడా కొంచెం మైనస్ అయ్యాయని ఫ్యాన్స్ అభిప్రాయపడుతున్నారు. సరే ఏదైతేనేం నేహా శెట్టిది బోనస్ గా ఫీలవ్వడం తప్ప ఎవరైనా చేయగలిగింది ఏమి లేదు. కాకపోతే మొదటిసారి ఓజి చూస్తున్న వాళ్లకు మాత్రం ఇదో స్పీడ్ బ్రేకర్ లా అనిపించడమే సమస్య.

# తట్టుకుని నిలబడుతున్న ఓజి



ఒకపక్క కాంతార చాప్టర్ 1 ఏ లెజెండ్ పాజిటివ్ టాక్ వెల్లువలా సోషల్ మీడియాని ముంచెత్తుతున్నప్పటికీ ఓజి మేనియా దాన్ని తట్టుకుని నిలబడుతోంది. దసరా పండగని క్యాష్ చేసుకునే పనిలో ఉన్న ఓజస్ గంభీర ఇప్పటిదాకా సుమారు రెండు వందల అరవై కోట్ల గ్రాస్ దాటేసి ట్రిపుల్ సెంచరీ వైపు పరుగులు పెడుతున్నాడు. 2025 హయ్యస్ట్ గ్రాసర్ గా ఉన్న సంక్రాంతికి వస్తున్నాంని అఫీషియల్ గా దాటేందుకు పరుగులు పెడుతున్నాడు. బుక్ మై షోలో గంటకు ఇప్పటికీ పది వేలకు పైగా టికెట్లు అమ్ముడుపోవడం చూస్తుంటే పవన్ సునామి బాగానే వెళ్తోందని అర్థమవుతోంది. ముఖ్యంగా నైజాం వసూళ్లు భారీగా ఉన్నాయి. ఏపీలో పది రోజుల పాటు పెంచిన టికెట్ ధరలే కొనసాగించాలని డిస్ట్రిబ్యూటర్లు నిర్ణయించుకోవడంతో దాని ప్రభావం ఆక్యుపెన్సీల మీద పడుతోంది. మెయిన్ సెంటర్స్ లో పవన్ క్రేజ్ పుణ్యమాని చెల్లిపోతోంది కానీ బిసి కేంద్రాల్లో హౌస్ ఫుల్స్ ఆలస్యంగా జరుగుతున్నాయి లేదా మొత్తం సోల్డ్ అవుట్ చేయలేకపోతున్నాయి. ఒకవేళ తెలంగాణ తరహాలో ప్రభుత్వం అనుమతించిన రెగ్యులర్ గరిష్ట ధరలే అమలులో ఉంటే ఓజి రన్ ఇంకా బలంగా ఉండేదని ట్రేడ్ టాక్. అయితే పెట్టుబడి కోణంలో చూసుకుంటే వేగంగా రికవర్ కావాలంటే పండగ టైంలో పెంపులు ఉంచేయక తప్పదు. అందుకే దాన్ని కంటిన్యు చేస్తున్నారు. వచ్చే వారం కూడా చెప్పుకోదగ్గ రిలీజులు లేవు కాబట్టి ఓజి అంత సులభంగా డ్రాప్ అవ్వకపోవచ్చు. ఒకసారైనా చూడొచ్చనే అభిప్రాయం కామన్ ఆడియన్స్ లో రావడంతో ఫుట్ ఫాల్స్ పెరుగుతున్నాయి. అయితే కాంతార చాప్టర్ 1 ప్రభావం లేదని కొట్టి పారేయడానికి లేదు. ఎందుకంటే ఫ్యామిలీ జనాలకు దీని రూపంలో ఇంకో ఛాయస్ దొరికింది.

# స్టార్ క్రికెటర్ సోదరి.. 'బిగ్‌బాస్'లోకి వైల్డ్ కార్డ్ ఎంట్రీ



బాలీవుడ్ నటుడు సల్మాన్‌ఖాన్ హోస్ట్‌గా 'బిగ్‌బాస్ 19' ఆగస్టులో మొదలైంది. హిందీలో కొనసాగుతున్న ఈ షో ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ దక్కించుకుంది. అయితే, ఈ షోలోకి భారత క్రికెటర్ అక్క వైల్డ్ కార్డ్ ఎంట్రీ ఇస్తున్నట్లు బాలీవుడ్‌లో వైరల్ అవుతుంది. ఈమేరకు సోషల్‌మీడియాలో పలు పోస్టులు కనిపిస్తున్నాయి. ఇండియన్ క్రికెటర్ దీపక్ చాహర్ సోదరి మాల్తీ చాహర్ హిందీ బిగ్‌బాస్-19లోకి ఎంట్రీ ఇవ్వబోతున్నట్లు తెలుస్తోంది. ఆమె మోడల్‌గా తన కెరీర్‌ను ప్రారంభించి బాలీవుడ్ పలు సినిమాల్లో కూడా నటించింది.
సోషల్‌మీడియాలో ఆమె కంటెంట్ క్రియేటర్‌గా కూడా రాణిస్తుంది. ఇన్‌స్టాగ్రామ్‌లో మాల్తీకి సుమారు పది లక్షలకు పైగా ఫాలోవర్స్ ఉన్నారు. ఆమె 2014లో ఫెమినా మిస్ ఫోటోజెనిక్, మిస్ సుడోకు కిరీటాలను గెలుచుకుంది.
ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రాకు చెందిన ఈ బ్యూటీ 2018లో అనిల్ శర్మ దర్శకత్వం వహించిన బాలీవుడ్ చిత్రం జీనియస్ ద్వారా రూబీనా పాత్రను పోషించింది. అరవింద్ పాండే దర్శకత్వం వహించిన రొమాంటిక్ డ్రామా ఇష్క్ పాష్మినా (2022)లో ఒమిషా పాత్రను పోషించి తన నటనా నైపుణ్యాలను మరింతగా ప్రదర్శించింది. అనేక బ్రాండ్లకు ప్రచారకర్తగా కూడా ఆమె పనిచేస్తోంది. ఇన్‌స్టాలో గ్లామరస్ ఫొటోలు, ఫ్యాషన్ పోస్టులతో ఎప్పుడూ యాక్టివ్‌గా ఉంటుంది. 2018లో ఐపీఎల్ మ్యాచ్‌లో మిస్టరీ గర్ల్‌గా ఫేమస్ అయ్యింది. ఆ తరువాత ఆమె దీపక్ చాహర్ సోదరి అని ప్రపంచానికి తెలిసింది.

# స్క్రిప్ట్ వినకుండానే సినిమా ఒప్పుకున్నా..



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్, హరీష్ శంకర్ కాంబోలో రాబోతున్న భారీ బడ్జెట్ మూవీ 'ఉస్తాద్ భగత్‌సింగ్'. ఇందులో శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తుండగా..రాశి ఖన్నా ఫొటోగ్రాఫర్ పాత్రలో కనిపించనుంది. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై తెరకెక్కుతుండగా.. ఇటీవల రాశిఖన్నా పాత్రకు సంబంధించిన షూటింగ్ కూడా పూర్తి అయినట్లు ప్రకటించింది. ఈ సినిమా ఈ ఏడాది చివరలో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈనేపథ్యంలో.. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న రాశిఖన్నా ఆసక్తికర విషయాలు వెల్లడించింది. "ఉస్తాద్ భగత్‌సింగ్ కోసం హరీష్ శంకర్ నాకు కాల్ చేసినప్పుడు నేను కథ వినకుండానే ఒకే చేశాను. పవన్ కళ్యాణ్ నటిస్తున్నారని చెప్పడంతో.. స్క్రిప్ట్ కూడా వద్దు అని చెప్పాను. ఉస్తాద్ భగత్‌సింగ్ కేవలం పవన్ కళ్యాణ్ గారి కోసమే చేశాను. చాలామందికి ఇండస్ట్రీకి వచ్చినప్పుడు ఆయనతో సినిమా చేయాలనే డ్రీమ్ ఉంటుంది. నాకు కూడా అలాగే ఏండేది. నేను ఈ మూవీ చేయడంతో నా డ్రీమ్ ఫుల్ ఫిల్ అయింది. నేను పవన్ కళ్యాణ్ గారి గురించి చాలా విన్నాను. ఆయన స్వాగ్ అనుకోకుండా ఉంది. నిజంగా పవన్ గారితో పని చేయటం అదృష్టంగా భావిస్తున్నాను. నాకు ఆయనంటే చాలా ఇష్టం.. విపరీతమైన నాలెడ్జ్ కలిగి ఉన్నారు. ఆడియన్స్ అంటూ చాలా ఇష్టం. కొంతమందికి సినిమాలు అంటే పిచ్చి ఉంటుంది.. కానీ పవన్ కళ్యాణ్ గారికి జనాలు అంటే పిచ్చి" అని చెప్పుకొచ్చింది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

# రాజు గారి గది 4 కూడా వచ్చేస్తోంది..



తెలుగు ప్రేక్షకుల్ని భయపెట్టిన హారర్ ఫ్రాంచైజీ 'రాజు గారి గది' ఇప్పుడు మళ్లీ మెరుపులు మెరిపించేందుకు సిద్ధమవుతోంది. యాంకర్-డైరెక్టర్ ఓంకార్ ఆరేళ్ల గ్యాప్ తర్వాత ఈ సిరీస్‌లో నాలుగో భాగాన్ని ప్రకటించారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై తెరకెక్కుతున్న ఈ చిత్రం పేరు రాజు గారి గది 4: శ్రీచక్రం. తాజాగా విడుదలైన ఫస్ట్ పోస్టర్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇందులో కాళికా మాత ఉగ్రరూపంలో దర్శనం ఇవ్వగా, ఎర్రచీరలో ఉన్న ఓ మహిళ దేవీ వైపు నడుచుకుంటూ వెళ్తుండటం హారర్, మిస్టికల్ ఎలిమెంట్స్‌ను సూచిస్తోంది. పోస్టర్‌కు జత చేసిన A Divine Horror Begins ట్యాగ్ లైన్ ఆసక్తి రేపుతుంది. ఈసారి కథా నేపథ్యం పూర్తిగా భక్తి, భయాల మిశ్రమంగా ఉండనుంది. 'కాళికాపురం' అనే ఊరిలోని కాళికా మాత ఆలయం, శ్రీచక్రం మహిమ, భక్తి వల్ల మేల్కొనే అమ్మవారు వంటి అంశాలతో హారర్, థ్రిల్లర్, కామెడీని మిక్స్ చేస్తూ ఓ కొత్త డైవైన్ యూనివర్స్‌ను నిర్మించనున్నట్టు చిత్రబృందం వెల్లడించింది.

విశ్వం వాయిస్ తెలుగు దినపత్రికలో వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...




VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603, viswamvoice@gmail.com